
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 296

బుధవారం 17-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సుమిత్ సంచలనం

ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్‌లో 27వ ర్యాంకర్ బుబ్లిక్‌పై విజయం - 14లో



లాభాల స్వీకరణ

199 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. నిఫ్టీ 65 పాయింట్ల పతనం - 15లో



షాహీ ఈద్గాలో సర్వేపై స్టే

మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి సమీపంలో ఉన్న షాహీ ఈద్గా మసీదులో శాస్త్రీయ సర్వేను నిలిపేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



దక్షిణకొరియా మన శత్రువు

కయ్యానికి కాలు దువ్వుతున్న దక్షిణ కొరియాను శత్రుదేశంగా ప్రకటించాలని తమ పార్లమెంట్ సభ్యులకు కిమ్ ఆదేశాలిచ్చారు.

వివరాలు 6లో ▸



హాజరవ్వడం కష్టమే

అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి అందిన ఆహ్వానాన్ని కాంగ్రెస్ నేతలు తిరస్కరించడాన్ని రాహుల్ సమర్థించారు.

వివరాలు 6లో ▸



తొలి ప్రైమరీలో ట్రంప్ విజయం

రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం అయోవాలో జరిపిన ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ అత్యధిక ఓట్లను కైవసం చేసుకున్నారు.

వివరాలు 6లో ▸

బాబుపై స్కిల్ కేసును కొట్టేయలేం

ఈ కేసులో రాజకీయ దురుద్దేశాలు, కక్ష సాధింపులు లేవు

సీఐడీ ఎఫ్ఐఆర్ సరైనదే... దాన్ని కొట్టేయాలనటం సరికాదు: సుప్రీంకోర్టు

చంద్రబాబును జైలుకు పంపడం సమర్థనీయమే

- ముందస్తు అనుమతి లేదనే కారణంతో రిమాండ్ ఉత్తర్వుల్ని కొట్టేయలేం
- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు
- సెక్షన్ 17(ఏ) వర్తింపుపై ఇరువురు న్యాయమూర్తులు భిన్న తీర్పులు
- అది వర్తిస్తుందని ఒకరు.. ఈ కేసుకు వర్తించదని మరొకరు తీర్పు
- దీంతో ముగ్గురు సభ్యులుండే విస్తృత ధర్మాసనానికి ఈ అంశం
- సెక్షన్ 17(ఏ) వర్తించేది అవినీతి నిరోధక చట్టానికి మాత్రమే
- సీఐడీ ఎఫ్ఐఆర్‌లో... ఐపీసీ 409, 120బి కింద కూడా బాబుపై కేసులు
- సుప్రీం తీర్పుతో వాటితో ముందుకెళ్లడానికి సీఐడీకి పచ్చజెండా...
- దీన్లో సెక్షన్ 409 కింద నేరం రుజువైతే బాబుకు యావజ్జీవ ఖైదు
- సెక్షన్ 17ఏపై తేల్చడానికి విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్న సీజేఐ
- సుప్రీంకోర్టు టాప్ 4 సీనియర్ జడ్జిల్లో ఒకరి నేతృత్వంలో విస్తృత ధర్మాసనం
- ఆ సీనియర్ న్యాయమూర్తి ఎవరి తీర్పును సమర్థిస్తే... 17ఏపై ఆ తీర్పే ఖరారు
- సెక్షన్ 17ఏతో సంబంధం లేకుండా తొలిసారి బోనెక్కనున్న చంద్రబాబు
- ఎన్నో కేసుల్లో సాంకేతిక కారణాలతో బయటపడ్డ బాబు
- చాలా కేసుల్లో 'మేనేజ్‌మెంట్ స్కిల్స్'.. ఈ సారి పారని పాచిక

11లో





జస్టిస్ అనిరుద్ధ బోస్ ఏం చెప్పారంటే..

- స్కిల్ కేసుకు సెక్షన్ 17(ఏ) వర్తిస్తుంది
- చంద్రబాబుపై కేసు నమోదుకు ముందు గవర్నర్ అనుమతి తప్పనిసరి
- ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ నుంచి అనుమతి తీసుకోవచ్చు
- అనంతరం చంద్రబాబు విషయంలో ముందుకెళ్లొచ్చు

జస్టిస్ బేలా త్రివేదీ ఏం చెప్పారంటే..



- 2018కి ముందు నేరాలకు సెక్షన్ 17(ఏ) వర్తించదు
- సెక్షన్ 17(ఏ) అమల్లో లేని కాలానికి దానిని వర్తింపజేయలేం.. చట్ట సవరణ చేసిన శాసనవ్యవస్థ ఉద్దేశమిదే
- 2018కి పూర్వ నేరాలకు వర్తింప చేస్తే చాలా వివాదాలు తలెత్తుతాయి.. గత నేరాలకు వర్తింప చేస్తే ప్రతికూల ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది
- అంతేకాక చట్ట సవరణ తీసుకొచ్చిన ఉద్దేశం కూడా నెరవేరకుండా పోతుంది.. భిన్నమైన భాష్యం ప్రాథమిక దశలో దర్యాప్తునకు విఘాతం కలిగించడమే
- సెక్షన్ 17 (ఏ) తెచ్చింది అవినీతిపరులను కాపాడేందుకు కాదు.. వేధింపుల నుంచి నిజాయతీపరులైన వారిని కాపాడేందుకే
- అధికార విధుల్లో భాగం కాని నిర్ణయాలకు సెక్షన్ 17(ఏ) కింద రక్షణ సాధ్యం కాదు
- బాబు రిమాండ్‌పై ఏసీబీ కోర్టు సరిగ్గానే వ్యవహరించింది.. తన పరిధి మేరకే నిర్ణయం తీసుకుంది
- 17(ఏ) కింద అనుమతి లేదని రిమాండ్ ఉత్తర్వులు కొట్టేయలేం.. హైకోర్టు తీర్పులో కూడా ఎలాంటి చట్ట విరుద్ధత లేదు.. ఏసీబీ కోర్టు, హైకోర్టు తీర్పుల్లో ఏ రకంగానూ జోక్యం అవసరం లేదు.

'స్కిల్' దొంగ చంద్రబాబే

సాక్ష్యాధారాలు బలంగా ఉన్నందుకే జోక్యం చేసుకోని సుప్రీంకోర్టు

ప్రాజెక్ట్ రూపకల్పన నుంచి నిధులు కొల్లగొట్టడం వరకు అంతా ఆయనే

అమాయక చక్రవర్తి కాదు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

బాబుకు శిక్ష తప్పదు

ఏపీ అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు

12లో

తిరుమలలో సుప్రభాత సేవ పునఃప్రారంభం

శ్రీవారికి గోదా మాలలు సమర్పణ



తిరుమల: పవిత్రమైన ధనుర్మాసం ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభమైంది. గతేడాది డిసెంబర్ 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఘడియలు కావడంతో శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. కాగా, శ్రీవారికి మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ సంగతి



..మనసులో మాట వింటున్నారు



శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రంలో జాతీయ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్ అకాడమీ కొత్త క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి పంకజ్

పేదరికంపై పోరాడి గెలిచాం

ఏపీలో 'నాసిన్' అకాడమీ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

తొమ్మిదేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- విద్య, వైద్యం, ఉపాధి రంగాలపై భారీగా వ్యయం చేశాం
- నకిలీలను ఏరివేయడంతో ప్రతి పైసా నేరుగా అర్హులకు
- ప్రజల సొమ్మును తిరిగి వారికే అందిస్తున్నాం..
- రామరాజ్యం గురించి మహాత్ముడు, తులసీదాస్ గొప్పగా వర్ణించారు
- జటాయువు నేలకొరిగిన ఈ ప్రాంతాన్ని రామాలయ ప్రతిష్ఠాపనకు ముందు సందర్శించడం నా అదృష్టం
- విజయనగర సామ్రాజ్య సుపరిపాలన మూలాలు ఈ ప్రాంతంలోనే..

2లో

ప్రపంచ స్థాయికి 'నాసిన్' కీర్తి

'అనంత'లో నెలకొల్పడం ఆనందదాయకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2లో

లేపాక్షి శిల్పకళ అద్భుతం

ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ

వీరభద్రుడికి స్వయంగా హారతి

తోలుబొమ్మలాటను వీక్షించి తన్మయత్వం 2లో

'ఉమ్మడి'గా మాయ!

2014లో రాష్ట్ర ప్రజలను ఉమ్మడిగా వంచించిన చంద్రబాబు, పవన్

- 600కు పైగా హామీలతో మేనిఫెస్టో విడుదల.. అందులో చంద్రబాబుతో పాటు పవన్ ఫొటో కూడా..
- చంద్రబాబు సీఎం అయ్యాక హామీలన్నీ బుట్ట దాఖలు.. ఒక్క హామీ సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను నిలువునా వంచించిన ద్వయం
- రుణమాఫీ పేరుతో రైతులు, మహిళలను మోసం చేసిన వైనం
- జాబుల పేరుతో యువతకు టోకరా
- పింఛన్లు ఇవ్వడానికీ వృద్ధులు, దివ్యాంగులను తిప్పలు పెట్టిన ఘనులు
- చివరకు మేనిఫెస్టోనే వెబ్‌సైట్ నుంచి తొలగించేశారు.. ఇప్పుడు మళ్లీ ఇద్దరూ కలిసి మాయ చేసేందుకు యత్నం
- ఉమ్మడి మేనిఫెస్టో, కార్యక్రమాలు అంటూ ప్రజల ముందుకు



సాక్షి, అమరావతి: మాయే చంద్రబాబు మంత్రం. మోసమే ఆయనకు తెలిసిన తంత్రం. ఇందుకు ఎన్నో ఉదాహరణలు. ఆయనకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తోడు. 2014 ఎన్నికల్లో ఉమ్మడిగా కలిసి పోటీ చేసిన చంద్రబాబు, పవన్.. అప్పట్లో ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను నిలువునా మోసం చేశారు. ఆ తర్వాత అసలు ఆ మేనిఫెస్టోనే కనపడకుండా పార్టీ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. వీరిద్దరూ కలిసి మరోసారి ప్రజలను మోసం చేయడానికి ఉమ్మడి కార్యాచరణతో రంగంలోకి దిగారు. ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడిగా అభ్యర్థుల ప్రకటన, ఉమ్మడి కార్యక్రమాలు అంటూ హడావుడి చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కలిసే పోటీ చేశారు. 600కు పైగా మిగతా 5వ పేజీలో ▶

అయోధ్యలో సంప్రదాయ క్రతువులు ఆరంభం

చారిత్రక నగరం అయోధ్యలోని భవ్య రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన సంప్రదాయ క్రతువులు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రాణప్రతిష్ఠ దాకా ఇవి నిరంతరాయంగా కొనసాగుతాయని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది.

- వివరాలు 6లో



రామాలయం గర్భగుడికి ఏర్పాటు చేసిన ద్వారం

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

కుటుంబానికి కొండంత 'ఆసరా'



'వైఎస్సార్ ఆసరా కింద రుణ మాఫీ చేయడం మా కుటుంబానికి కొండంత ఆసరాగా నిలిచింది. ఈ డబ్బులతో ఫ్యాన్సీ స్టోర్ నడుపుతూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మాది వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె. నేను మైథిలి మహిళా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద మూడు విడతలుగా రుణ మాఫీ చేశారు. మా సంఘంలో మొత్తం 10 మంది సభ్యులున్నారు. బ్యాంకు ద్వారా మొత్తం రూ.8 లక్షలు రుణంగా పొందాం. అందులో నాకు రూ.80 వేలు వచ్చింది. ఆసరా కింద మా గ్రూపునకు రూ.2,31,171 మాఫీ అయింది. అందులో నాకు రూ.30,822 వచ్చింది. ఈ డబ్బులతో ఫ్యాన్సీ స్టోర్ ప్రారంభించి నా కాళ్ల మీద నేను బతుకుతున్నాను. కూతురికి పెళ్లి చేశాను. కుమారుడిని డిగ్రీ వరకు చదివించాను. అతను ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. మాకు కొంత పొలం ఉంది. నాలుగేళ్లుగా రైతు భరోసా డబ్బులు కూడా వస్తున్నాయి. నా భర్త వ్యవసాయ పనులు చూసుకుంటాడు. ఫ్యాన్సీ స్టోర్ నిర్వహణలో కూడా సహాయ పడుతుంటాడు. భవిష్యత్తు గురించి ఏ దిగులూ లేదు.

– పోరెడ్డి మాధవి, నెమళ్లదిన్నె
(ఎస్.విశ్వప్రసాద్, విలేకరి, కడప రూరల్)

ఆయుష్షు పెంచిన దేవుడు



రోజూ పనులకు వెళ్తే గాని ఇల్లు గడవని పరిస్థితి మాది. బేల్దారి మేస్త్రీగా చేసే నాకు ఒకసారి ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి వెళ్లాను. కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని చెప్పారు. డయాలసిస్ చేయాలన్నారు. పై ప్రాణాలు పైనే పోయాయి. ప్రభుత్వం డయాలసిస్ పెన్షన్ మంజూరు చేయడంతో క్రమం తప్పకుండా చేయించుకుంటున్నా. మాది పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం కంచరగుంట. పేద కుటుంబం. బేల్దారి మేస్త్రిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇప్పటి వరకు నాకు రూ.1.50 లక్షలు పెన్షన్ రూపంలో అందింది. 108 ద్వారా నెలకు 12 సార్లు 30 కి.మీల దూరంలోని మాచర్ల డయాలసిస్ సెంటర్‌కు వెళ్లి వస్తున్నా. క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవడం వల్ల నా జీవన కాలం పెరిగింది. నా ఆయుష్షు పెంచిన దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి. నాకు పునర్జన్మ ప్రసాదించిన ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాను. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి చదువు పూర్తి కావడంతో పెళ్లి చేశాము. అబ్బాయి చదువుకుంటున్నాడు. ఇద్దరికీ విద్యా దీవెన పథకం ద్వారా సాయం అందింది. మాలాంటి పేదల జీవితాల్లో ఈ ప్రభుత్వం వెలుగులు నింపింది.

– బండి శ్రీహరి, కంచరగుంట
(ఎం.వెంకటనారాయణ, విలేకరి, దుర్గి)

ఇంటిల్లిపాదికీ లబ్ధి



మాది పేద కుటుంబం. గతంలో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కష్టాలు తీరాయి. మా ఇంట్లో ఉన్న నలుగురికీ ఏదో రూపంలో లబ్ధి చేకూరింది. మేము విశాఖపట్నం నగరంలోని తాటిచెట్లపాలెం సంతోషిమాత కాలనీలో నివాసం ఉంటున్నాము. నేను మొదట్లో బుట్టలో పండ్లు అమ్ముకుని జీవనం సాగించేదాన్ని. ఈ ప్రభుత్వంలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా వచ్చిన సొమ్ముతో నా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చింది. ఈ పథకం ద్వారా ఏటా రూ.18,750 వస్తోంది. ఈ డబ్బుతో విశాఖపట్నం రైల్వే న్యూ కాలనీ మెయిన్‌రోడ్డులో తోపుడు బండి ఏర్పాటు చేసుకొని పండ్ల వ్యాపారం చేసుకుంటున్నా. దీని ద్వారా ఒకరిపై ఆధారపడకుండా, ఎవరి వద్దా అప్పు చేయకుండా సొంత కాళ్లపై నిలబడి కుటుంబాన్ని నడిపిస్తున్నా. కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా క్రమం తప్పకుండా ఈ చేయూత పథకం మమ్మల్ని మాదుకుంది. నా భర్త ఆటో నడుపుతున్నారు. వాహనమిత్ర ద్వారా ఏటా రూ.పది వేలు ఈ ప్రభుత్వం అందిస్తోంది. దీనివల్ల ఆటో నిర్వహణకు అవసరమైన ఖర్చులకు ఇబ్బంది లేకుండా పోయింది. మా చిన్న పాప సాయి లావణ్య ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది.మా పెద్ద పాప ధనలక్ష్మి మానసిక స్థితి బాగోదు. ఆమె దివ్యాంగురాలు కూడా. ఆమెకు దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఇన్నేళ్లలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రతి నెలా రూ.3 వేల పింఛను ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. ఇలా మా ఇంట్లో ప్రతి ఒక్కరం జగనన్న ద్వారా లబ్ధి పొందాము.

– బాదా జయమ్మ, విశాఖపట్నం
(పి.విజయ్‌కుమార్, విలేకరి, తాటిచెట్లపాలెం, విశాఖపట్నం)



నాసిన్ కొత్త క్యాంపస్‌లో అధికారులతో ప్రధాని మోదీ. చిత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

పేదరికంపై పోరాడి గెలిచాం

ఏపీలో 'నాసిన్' అకాడమీ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

సాక్షి, పుట్టపర్తి (శ్రీసత్యసాయి జిల్లా): దేశంలో పేదరికాన్ని ఓడించే సత్తా తమ ప్రభుత్వానికే ఉందని, గత తొమ్మిదేళ్లలో సుమారు 25 కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించామని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. నీతి ఆయోగ్ తాజా నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, స్వయం ఉపాధి రంగాలకు ప్రభుత్వం భారీగా ఖర్చు చేసి పేదలకు సౌకర్యాలు పెంచిందని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టామన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రజల సొమ్మును తిరిగి వారికే ఇస్తున్నామని చెప్పారు. గత పదేళ్లలో 10 కోట్ల నకిలీ పేర్లను తొలగించడంతో నేడు ప్రతి పైసా అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరుతోందన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచామన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో జాతీయ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్ అకాడమీ (నాసిన్) కొత్త క్యాంపస్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌ను తిలకించి ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) 74, 75వ బ్యాచ్‌లకు చెందిన ట్రైనీ అధికారులతో పాటు భూటాన్ రాయల్ సివిల్ సర్వీస్ ట్రైనీ ఆఫీసర్లతో ప్రధాని ముచ్చటించారు. పాలసముద్రం విశిష్టతను గుర్తు చేస్తూ ఘన వారసత్వం కలిగిన ఈ ఆధ్యాత్మిక ప్రాంతం దేశ నిర్మాణం, సుపరిపాలనతో మమేకమవుతోందన్నారు. రామాయణంలో ప్రస్తావించిన జటాయువు నేలకొరిగిన స్థలం ఇక్కడకు సమీపంలోనే ఉండటం, అయోధ్యలో రామాలయ ప్రతిష్టాపనకు ముందు ఈ ప్రాంతాన్ని సందర్శించడం, ఈ పుణ్యకాలంలో పురాతన ఆలయాల్లో ఆశీర్వాదాలు అందుకోవటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి సత్యసాయిబాబా, స్వాతంత్ర్య సమరయోధుడు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు, ప్రఖ్యాత తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు ఈ ప్రాంతవాసులే కావడం గర్వకారణమన్నారు. అద్భుతమైన విజయనగర సామ్రాజ్య సుపరిపాలన మూలాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయని గుర్తు చేశారు.

మహాత్ముడు కలలుకన్న 'రామరాజ్యం'

'జాతిపిత మహాత్మాగాంధీ పలు సందర్భాల్లో రామరాజ్యం గురించి చెప్పారు. అలాంటి సుపరిపాలన అందాలని ఆకాంక్షించారు. రామరాజ్యం ఆలోచన నిజమైన ప్రజాస్వామ్యం వెనుక ఉన్న భావన అని అన్నారు. రామరాజ్యంలో పన్నుల వ్యవస్థ గురించి తులసీదాస్ రామ్ చరిత్ మానస్‌లోనూ ఎంతో గొప్పగా వర్ణించారు' అని ప్రధాని పేర్కొన్నారు. 'రామరాజ్య వాసి (పౌరులు).. తల ఎత్తుకుని న్యాయం కోసం పోరాడు.. అందరినీ సమానంగా చూడు.. బలహీనులను రక్షించు.. ధర్మాన్ని నిలబెట్టు' అనే సంస్కృత శ్లోకాన్ని ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, అవినీతిపరులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ నిర్మాణంలో తమ కృషిని గుర్తించాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. పాలసముద్రం పర్యటనకు ముందు లేపాక్షిలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని ప్రధాని సందర్శించారు. భక్తులతో కలిసి భజనలు, కీర్తనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, పరోక్ష పన్నుల బోర్డు చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

పన్నుల వసూళ్లలో 'రెవెన్యూ' కీలక పాత్ర

ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్టాపనకు ముందు 'నాసిన్'ను ప్రారంభించడం శుభ సూచికమని ప్రధాని పేర్కొన్నారు. ప్రాచీన తమిళ కవి తిరువల్లువర్ కవితలను ఉటంకిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమానికి దోహదం చేసే పన్నుల వసూళ్లలో రెవెన్యూ అధికారుల కీలక పాత్రను ప్రస్తావించారు. దేశానికి జీఎస్టీ రూపంలో తాము ఆధునిక వ్యవస్థను అందించడంతోపాటు ఆదాయపు పన్నును సరళీకృతం చేశామన్నారు.

ప్రపంచ స్థాయికి 'నాసిన్' కీర్తి

'అనంత'లో నెలకొల్పడం ఆనందదాయకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్



ప్రధానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, పుట్టపర్తి: అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రపంచస్థాయి సంస్థ 'నాసిన్' అకాడమీని నెలకొల్పినందుకు ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియచేశారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) అకాడమీ ప్రారంభోత్సవంలో సీఎం జగన్ ప్రధానితో కలసి పాల్గొన్నారు. 'నాసిన్'ను తీసుకొచ్చే గొప్ప ప్రయత్నం చేయడమే కాకుండా పట్టుబట్టి సాధించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు సందర్భాలలో ఇక్కడికి రావడం మన కళ్లెదుటే కనిపించిన వాస్తవమన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక సంస్థ మన రాష్ట్రం పేరు, కీర్తి ప్రతిష్టలను దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిబింబిస్తూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అన్నింటిని అనుసంధానించే గొప్ప సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

- ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ
- వీరభద్రుడికి స్వయంగా హారతి
- తోలుబొమ్మలాటను వీక్షించి తన్మయత్వం



లేపాక్షి వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ప్రధాని మోదీ

లేపాక్షి (శ్రీసత్యసాయి జిల్లా): చారిత్రక లేపాక్షి ఆలయంలో శిల్పకళా సంపద అద్భుతమని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. భారతీయ చరిత్ర, పురాతన వైభవం, విజయనగర సామ్రాజ్య సంస్కృతిని లేపాక్షి ఆలయ శిల్పకళా సంపద ప్రతిబింబిస్తోందని చెప్పారు. ప్రధాని మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో లేపాక్షి చేరుకుని స్థానిక పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాలను సందర్శించారు. ప్రధానికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో వీరభద్రస్వామి, పాపనాశేశ్వరస్వామి, దుర్గాదేవి అమ్మవారికి ప్రధాని ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రస్వామికి స్వయంగా మహామంగళ హారతి ఇచ్చారు. గర్భగుడిలో పాపనాశేశ్వర లింగానికి అభిముఖంగా ప్రత్యేక పీఠంపై కూర్చుని ప్రధాని ధ్యానం చేశారు. టీటీడీ వేద విజ్ఞాన పాఠశాల ఆధ్వర్యంలో రంగనాథ రామాయణ పారాయణం నిర్వహించగా మహిళా కళాకారులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. నిమ్మలకుంట కళాకారులు రామాయణంలో సీతాపహరణ ఘట్టాన్ని తోలుబొమ్మల రూపంలో ప్రదర్శించారు. వీటన్నింటినీ ఆస్వాదించిన ప్రధాని మోదీ తన్మయత్వం చెందారు.

వేలాడే స్తంభం..

గర్భగుడి ప్రదక్షిణ అనంతరం మహా మంటపం పైకప్పు మీద చిత్రీకరించిన 25 గీ14 అడుగుల వీరభద్రస్వామి ఉగ్రరూపాన్ని ప్రధాని తదేకంగా తిలకించారు. పది చేతుల్లో వివిధ ఆయుధాలు, పొడవాటి కత్తి, దక్షయజ్ఞం సందర్భంగా దక్షుడి తలను దునుమాడటం లాంటి ఘట్టాలను చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు. నాట్యమంటపంలోని శిల్పాలు, తైలవర్ణ చిత్రాలను చూసిన ప్రధాని ముగ్ధులయ్యారు. వేలాడే స్తంభాన్ని ఆసక్తిగా తిలకించారు. వేలాడే స్తంభం ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. స్తంభం దిగువన మైనాస్వామి ఒక పలుచటి వస్త్రాన్ని ఉంచగా ప్రధాని దాన్ని స్వయంగా స్తంభం నుంచి వెలుపలకు తీశారు. కిరాతార్జునీయ ఘట్టం, గిరిజా కల్యాణం, వీరభద్ర అనుగ్రహం పొందిన ఆలయ నిర్మాత విరుపణ్ణ, ఆయన పరివారం తైలవర్ణ చిత్రాలను తదేకంగా పరిశీలించారు. వటపత్రసాయి వర్ణచిత్రం గురించి చరిత్రకారుడు వివరించినప్పుడు బాలకృష్ణుడి కన్నులను చిత్రీకరించిన విధానాన్ని మూడు వైపుల నుంచి తిలకించారు. నాట్య మంటపంలోని భిక్షాటనమూర్తి సుందర రూపాన్ని తనివి తీరా చూశారు. భిక్షాటనమూర్తి విగ్రహాలలో భేదాల గురించి ఆసక్తిగా ఆలకించారు. ప్రధాని మోదీని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అర్చకులు, కళాకారులను ప్రధాని సన్మానించారు. ప్రధానిని చూసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

అడవి బిడ్డలకూ పథకాలు అందాలి

- గిరిజనులతో వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ
- ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి





మాట్లాడుతున్న స్వాభి గంగా. వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రభుత్వ సంక్షేమ పథకాలు మారుమూల గిరిజనులకు సైతం అందినప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆదివాసీల (పీవీటీజీల) సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు పీవీటీజీ గిరిజనులకు 150 రోజుల పనిదినాలు కల్పిస్తున్నామన్నారు. పీఎం కిసాన్, ప్రధాని ఉజ్వల్ యోజనతో ఉచిత గ్యాస్ కనెక్షన్, ఆయుష్మాన్ భారత్ కార్డులు, అటవీ హక్కు పత్రాల పంపిణీ, జన్‌ధన్ ఖాతాలు, వన్‌దన్ వికాస్ కేంద్రాలు, పీఎం జల్ జీవన్ లాంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాని ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం నిధుల విడుదల సందర్భంగా సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ మండలం కొత్తభల్లుగుడ ప్రాథమిక పాఠశాల, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆదివాసీ గిరిజనులతో ప్రధాని వర్చువల్ సమావేశం ద్వారా ముచ్చటించారు.

పీవీటీజీ మహిళ: నాపేరు స్వాభి గంగ, మాది గద్యగుడ గ్రామం, అరకులోయ మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా, ఆంధ్రప్రదేశ్. నా భర్త పేరు స్వాభి రామచందర్. మాకు ఇద్దరు పిల్లలు.

పీఎం: పీఎం జన్‌మన్ గురించి మీకు ఎలా తెలిసింది?

స్వాభి గంగా: జనవరి 5న మా గ్రామంలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించి ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం గురించి వివరించారు.

పీఎం: జన్‌మన్ అవగాహన సదస్సుతో మీరు ఎలాంటి లబ్ధి పొందారు?

స్వాభి గంగా: అవగాహన సదస్సు ద్వారా పీఎం ఆవాస్ యోజన కింద ఇంటి కోసం, పీఎం జలజీవన్ యోజన కింద కుళాయి కోసం, పీఎం జన ఆరోగ్య కింద నా కుటుంబ సభ్యులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం నమోదు చేసుకున్నా. నాకు పథకాలన్నీ మంజూరు చేశారు.

పీఎం: మీ జీవనాధారం ఏమిటి?

స్వాభి గంగా: ఆర్‌వోఎఫ్‌ఆర్ పథకంలో నాకు 35 సెంట్లు భూమికి పట్టా వచ్చింది. అందులో కాఫీ, మిరియాలు సాగు చేస్తూ మంచి గిట్టుబాటు ధర పొందుతున్నాం.

పీఎం: అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు రావడం ఎలా అనిపిస్తోంది?

స్వాభి గంగా: చాలా ఆనందంగా ఉంది. గతంలో దళారులకు విక్రయించి మోసపోయేవాళ్లం. ఇప్పుడు మంచి ధర లభిస్తోంది.

కొండరెడ్డి గిరిజనులతో ముఖాముఖి

పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం కొండరెడ్డి గిరిజనులతో మాట్లాడారు. పీఎం జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) కార్యక్రమం అమలులో భాగంగా అందించే సేవలను వివరించారు. ఈ కార్యక్రమం వల్ల పీవీటీజీ గ్రామాల్లో రూపురేఖలు మారబోతున్నాయని చెప్పారు.

సులభంగా ఓపీ రిజిస్ట్రేషన్

డిజిటల్ వైద్య సేవల అమల్లో ఆదర్శంగా ఏపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: డిజిటల్ వైద్య సేవలు అందించడంలో ఏపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం డిజిటల్ విధానంతో అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలనూ సులభతరం చేస్తోంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపీ రిజిస్ట్రేషన్‌ను తేలికగా పూర్తి చేస్తోంది. ఈ విధానంలో దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఏపీలోని 909 ప్రభుత్వాస్పత్రుల్లో స్కాన్ అండ్ షేర్ విధానంలో ఓపీ రిజిస్ట్రేషన్ అమలు చేస్తోంది. ఇలా గడిచిన 4 నెలల్లో 23.80 లక్షల ఓపీలు నమోదయ్యాయి.55.04 లక్షలతో యూపీ తొలి స్థానంలో, 24.67 లక్షలతో కర్ణాటక రెండో స్థానంలో ఉన్నాయి. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే ఓపీ కౌంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇవి పూర్తయిన తర్వాత రోగి ఏ సమస్యతో వైద్య సేవలు పొందాలనుకుంటున్నారో తెలుసుకుని, ఆ విభాగానికి రిఫర్ చేస్తూ టోకెన్ ఇస్తారు. దీనికి 5–10 నిమిషాలు పడుతుంది. పెద్దాస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంవల్ల రోగులు ఓపీ రిజిస్ట్రేషన్ కోసం చాలా సమయం క్యూలో వేచి ఉండాల్సి వస్తుంది. అదే క్యూఆర్ కోడ్‌తో త్వరగా అయిపోతుంది. రోగి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వెళ్లి స్మార్ట్ ఫోన్ ద్వారా కోడ్ స్కాన్ చేసి, టోకెన్‌ను తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు. క్యూలో వేచి ఉండటం, ఇతర అగచాట్లు తప్పుతాయి.

ఇలా చేసుకోవాలి..

■ స్మార్ట్ ఫోన్ నుంచి ఆస్పత్రిలో ప్రదర్శించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే యూఆర్ఎల్ కోడ్ వస్తుంది. దాని మీద క్లిక్ చేస్తే..ఆభా,ఆరోగ్య సేతు, వంటి యాప్‌లు కనిపిస్తాయి ■ ఆ యాప్‌లు ఫోన్‌లో లేకపోతే ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవాలి ■ ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్ (ఆభా) 14 అంకెల గుర్తింపు/ఆభాలో రిజిస్టర్ చేసిన ఫోన్ నంబర్/మెయిల్ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ అవ్వాలి ■ యాప్‌లోకి లాగిన్ అయితే ఆభా వివరాలు వస్తాయి. వీటిని ఆస్పత్రితో షేర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. షేర్ ఆప్షన్ పై క్లిక్ చేస్తే ఓ నంబర్ వస్తుంది. ఈ టోకెన్‌కు అరగంట వ్యాలిడిటీ ఉంటుంది. టోకెన్ నంబర్ వచ్చాక ఆస్పత్రిలోని కౌంటర్‌కు వెళ్లి ఆభా నంబర్, ఫోన్ నంబర్ చెప్పి, ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే సిబ్బంది ఓపీ స్లిప్ ఇస్తారు. దీన్ని తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు.

రేపటి నుంచి హెల్దీ విలేజీలపై వర్క్‌షాపు

తిరుపతిలో నిర్వహణ

సాక్షి, అమరావతి: ప్రజల జీవన ప్రమాణ పెంపునకు ఉద్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గ్రామ స్థాయిలోనే సమర్థంగా అమలు చేసే ప్రక్రియలో భాగంగా ఏపీ ప్రభుత్వం ఈ నెల 18, 19, 20 తేదీల్లో 3 రోజుల పాటు తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 'హెల్దీ గ్రామ పంచాయతీ(ఆరోగ్య గ్రామాలు)' అంశంపై జాతీయ స్థాయి వర్క్ షాపు నిర్వహించనుంది. కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌తో పాటు ఏపీ ఉపముఖ్యమంత్రి బూడి, సీఎస్ జవహర్‌రెడ్డి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ, పలు రాష్ట్రాల నుంచి 450కి పైగా ప్రతినిధులు ఈ వర్క్‌షాపులో పాల్గొంటారు. గ్రామాల్లో వ్యాధుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు.. అందుకు వీలుగా ఆయా రాష్ట్రాల్లో గ్రామ స్థాయిలో అందుబాటులో ఉన్న వసతులపై ఆయా రాష్ట్రాల ప్రతినిధుల మధ్య ఉమ్మడి గ్రూపులతో చర్చ జరగనుంది. ఉత్తమ విధానాలను దేశమంతటా అమలు చేసేందుకు వీలుగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై ఈ వర్క్‌షాపులో అన్ని రాష్ట్రాల ప్రతినిధుల మధ్య ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

ఏపీసీసీ అధ్యక్షురాలిగా గిడుగు స్థానంలో షర్మిల



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలిగా షర్మిల నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్ష పదవికి గిడుగు రుద్రరాజు సోమవారం రాజీనామా చేయగా.. షర్మిలను ఏపీ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021 జూలై 8న వైఎస్సార్‌టీపీని ప్రారంభించిన షర్మిల.. ఈ నెల 4వ తేదీన ఢిల్లీలో ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. కాగా.. గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. షర్మిలకు ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్ అభినందనలు తెలిపారు.

‘గిరి’ రహదారులకు మోక్షం

- ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన చందనగిరి గిరిజన గ్రామానికి రూ.1.25 కోట్లతో రహదారి
- రూ.5.42 కోట్లతో ఎత్తయిన గ్రామాలకు రహదారుల పనులు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే తీరిన గిరిజనుల సమస్యలు


శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం హడ్డివాడ గ్రామంలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

మెళియాపుట్టి: ‘గిరి’ గ్రామాల రహదారుల కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి మండలంలో ఉత్తరాంధ్రలోనే అత్యంత ఎత్తయిన గిరిజన గ్రామాలు ఉన్నాయి. వాటికి దశాబ్దాలుగా రహదారి సౌకర్యాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ‘గడపగడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించి, గిరి శిఖర గ్రామాలను సందర్శించి వారి సమస్యలు, కష్టాలను తెలుసుకున్నారు. రహదారి కష్టాలు తీరితే అన్ని సౌకర్యాలు వారికి అందుతాయనే ఆలోచన చేసి, విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన గిరిశిఖర గ్రామమైన చందనగిరి గ్రామానికి (రూ.1.25 కోట్లతో 3.10 కి.మీ), హడ్డివాడ (రూ.1.75 కోట్లతో 2.3 కి.మీ), కేరాసింగి (రూ.92 లక్షలతో 1.5 కి.మీ), కేరాసింగిగూడ (రూ.1.5కోట్లతో 2.5 కి.మీ), మొత్తంగా రూ.5.42 కోట్లతో గిరి శిఖర గ్రామాలకు వెళ్లే రహదారి పనులకు నిధులు తీసుకువచ్చి పనులు సైతం వేగవంతం చేశారు. ప్రస్తుతం హడ్డివాడ గ్రామానికి రహదారి పూర్తి కాగా.. మిగిలిన గ్రామాలకు రహదారి పనులు చివరి దశలో ఉన్నాయి. గిరిజనులకు సీఎం


కేరాసింగి రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి (ఫైల్)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే గౌరవం లభించిందని, పోడుపట్టాలు అందుకున్నామని, రైతుభరోసాతోపాటుగా అన్ని పథకాలు అందుతున్నాయని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కిలోమీటర్ల మేర నడుచుకుంటూ కొండలపైనుంచి కిందికి దిగి, రేషన్ సరుకులు మోసుకుంటూ వెళ్లిన రోజులు మర్చిపోయేలా చేసి కొండలపైకి నేడు ట్రాక్టర్‌పై సరుకులు తీసుకెళ్లి పంపిణీ చేస్తున్నారు. కొద్దిరోజుల్లోనే రహదారి నిర్మాణాలు పూర్తిచేసి గిరిజనుల కష్టాలకు తెరదించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. గత తెలుగుదేశం పాలకులు గిరిజనులకు చేసిందేమీ లేకపోవడంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక విమర్శలకే పరిమితమయ్యారు.

ఆనందంగా ఉంది

గడప గడపకూ వెళ్లిన సమయంలో రహదారులు చూసి బాధపడ్డాను. వారి గ్రామాలకు వెళ్లి కష్టాలను చూశాను. వారి బతుకులు బాగుచేయాలని ఆలోచించి జగనన్న దృష్టికి సమస్యను తీసుకువెళ్లాను. గిరిజనుల సమస్య అనగానే ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు. రహదారుల మంజూరుతో ప్రస్తుతం గిరిజనుల కష్టాలు తీరనున్నందుకు సంతోషంగా ఉంది. ఎమ్మెల్యేగా వారికష్టాలు తీర్చడం చాలా ఆనందంగా ఉంది. గిరిజనాభివృద్ధికి పెద్దపీట వేసిన వ్యక్తి జగనన్న కాబట్టే ఇది సాధ్యమైంది.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు



రహదారి కోసం ఎన్నో ఏళ్లు నిరీక్షించాం. ఎంతో మంది చుట్టూ తిరిగాం. కానీ మా స్థితి మారలేదు. మహిళా ఎమ్మెల్యే అయినా.. రెడ్డి శాంతమ్మ కాలినడకన మా గ్రామానికి వచ్చి ‘గడప గడపకూ కార్యక్రమం’ నిర్వహించారు. మా సమస్యలు చెప్పుకొన్నాం. అన్నీ చేస్తానని మాటిచ్చారు. రహదారి మంజూరు చేశారు. రోడ్డు పూర్తి కావడంతో మాకష్టాలు తీరాయి. సంతోషంగా ఉంది.

– చందనగిరి పోలయ్య, హడ్డివాడ గ్రామం

సంతోషంగా ఉంది



జగనన్నను పాదయాత్రలో కలిసి గిరిజనుల కష్టాలను వివరించాను. అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానన్నారు. ఎమ్మెల్యే దృష్టికి గిరిజనుల సమస్యలు తీసుకెళ్లా.. ఆమె స్పందించారు. కృషికి ఫలితం లభించింది. ఎంతోకాలంగా కొండప్రాంతాలకు సరైన రహదారులు లేక ఇబ్బందులు పడ్డాం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మా గిరిజనుల కష్టాలు తీరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. జెడ్పీటీసీగానే కాకుండా నేను కూడా గిరిజనుల్లో ఒకడ్ని కావడం ఆనందంగా ఉంది. సీఎం జగన్, ఎమ్మెల్యే రెడ్డి శాంతికి రుణపడి ఉంటాను.

– గూడ ఎండయ్య, జెడ్పీటీసీ సభ్యుడు, మెళియాపుట్టి మండలం

జవాన్ పప్పల శ్రీరాములుకు అశ్రు నివాళి

- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఐలవరం తరలివచ్చిన మిలటరీ అధికారులు


శ్రీరాములు (ఫైల్)

ఐలవరం (భట్టిప్రోలు): భారత సైనిక దినోత్సవ పర్వదినాన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఐలవరానికి చెందిన మిలటరీ జవాన్ పప్పల శ్రీరాములు(33) విధి నిర్వహణలో భాగంగా కశ్మీర్‌లోయలో మంచు కొండల మధ్య చిక్కుకుని ఆదివారం అమరులయ్యారు. ఆయన మృతదేహాన్ని సోమవారం రాత్రి ప్రత్యేక వాహనం ద్వారా మిలటరీ అధికారులు ఐలవరానికి తరలించారు. మంగళవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియ నిర్వహించారు. శ్రీరాములు పార్థివ దేహానికి వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నివాళులు అర్పించారు. అమర జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అశోక్‌బాబు తెలిపారు. శ్రీరాములకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కృష్ణా జలాల వివాదంపై నేడు భేటీ

- ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో చర్చించనున్న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి
- శ్రీశైలం, సాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించడమే అజెండా
- నీటి వాటాలు, వరద జలాల మళ్లింపు తదితర అంశాలపై చర్చ


నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఫైల్)

సాక్షి, అమరావతి: కృష్ణా నది దిగువ బేసిన్‌లో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించడమే అజెండాగా బుధవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశం నిర్వహించనున్నారు. నీటి వాటాలు, వరద జలాల మళ్లింపు తదితర అంశాలపై చర్చించనున్నారు. సాగర్ నిర్వహణపై ఏపీ, తెలంగాణ మధ్య నవంబర్ 30న వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ బల్లా ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. విభజన నేపథ్యంలో కృష్ణా జలాల వినియోగంలో ఏపీ, తెలంగాణ మధ్య విభేదాలు తలెత్తకుండా చూసేందుకు 2014లో కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటు చేసింది. బోర్డు పరిధిని నిర్దేశించేవరకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను కర్నూలు సీఈ(ఆంధ్రప్రదేశ్), సాగర్ నిర్వహణను ఆ ప్రాజెక్టు సీఈ(తెలంగాణ)కి అప్పగించింది. కానీ తమ భూభాగంలో ఉందంటూ శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని ఆధీనంలోకి తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం.. ఏపీ భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నా అప్పటి చంద్రబాబు సర్కార్ నోరు మెదపలేదు. వరద ప్రవాహం ప్రారంభం కాకపోయినా దిగువకు నీటిని వదిలేస్తూ.. ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. శ్రీశైలం పాజెక్టును ఖాళీ చేస్తూ రాయలసీమ హక్కులను తెలంగాణ హరిస్తూ వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టును ఖాళీ చేస్తూ సాగర్‌కు తరలించిన జలాలను.. కుడి కాలువకు విడుదల చేయకుండా రాష్ట్ర హక్కులను కాలరాస్తూ వస్తోంది.

బోర్డు పరిధి నిర్దేశించినప్పటికీ..

దీనిపై 2021లో వైఎస్ జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో న్యాయపోరాటానికి దిగింది. దాంతో 2021 జూలై 15న కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను ఏడాదిలోగా బోర్డుకు అప్పగించాలి. కృష్ణా బోర్డు సమావేశంలో ఆ ప్రాజెక్టులను అప్పగించడానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అంగీకరించాయి. కానీ ఆ తర్వాత తెలంగాణ అడ్డం తిరగడంతో ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ అమల్లోకి రాలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది డిసెంబర్‌లో దిగువన నీటి అవసరాలు లేకపోయినా.. శ్రీశైలంలో ఏపీకి కేటాయించిన 17 టీఎంసీలను విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువకు వదిలేసి సాగర్‌కు తరలించిన తెలంగాణ.. వాటిని ఏపీకి విడుదల చేయకుండా మొండికేసింది. దాంతో రాష్ట్ర హక్కులను పరిరక్షించుకోవడానికి నవంబర్ 30న ఏపీ భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను వైఎస్ జగన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

సాగర్ వివాదంతో కదలిన కేంద్రం

సాగర్ నిర్వహణపై ఏపీ, తెలంగాణ మధ్య వివాదం చెలరేగడంతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి డిసెంబర్‌లో రెండు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సాగర్‌పై యథాస్థితిని కొనసాగిస్తూ.. సీఆర్పీఎఫ్ బలగాల పహారాలో నిర్వహణ బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగించారు. రెండు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి వివాదానికి తెరదించాలని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శికి సూచించారు. ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణను బోర్డుకు అప్పగించడంతోపాటు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 2015లో చేసిన సర్దుబాటు మేరకు ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల నీటి వాటాలు కొనసాగించడం, వరద జలాల మళ్లింపుపై బుధవారం జరిగే సమావేశంలో చర్చించనున్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

తిరుమల/యాదమరి(చిత్తూరు జిల్లా): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని కూడా జస్టిస్ వెంకటజ్యోతిర్మయి దర్శించుకున్నారు.


జస్టిస్ చక్రవర్తి దంపతులకు ఘన సన్మానం


జస్టిస్ చక్రవర్తి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి దంపతులకు స్వగ్రామంలో మంగళవారం ఘన సన్మానం జరిగింది. సంక్రాంతి పండుగ సందర్భంగా జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి తన స్వగ్రామమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తామరపల్లికి కుటుంబ సమేతంగా వచ్చారు. గ్రామానికి చెందిన స్నేహితులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, హరిత దంపతులను సన్మానించారు.

లక్ష్యంలేని చదువు వ్యర్థం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్


జస్టిస్ హరినాథ్ దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

పగిడ్యాల: లక్ష్యంలేని చదువు వ్యర్థమని, తల్లిదండ్రులను, మాతృభూమిని మరువరాదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ అన్నారు. సంక్రాంతి తిరునాళ్లను పురస్కరించుకుని సోమవారం ఆయన తన స్వగ్రామమైన నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోటకు కుటుంబ సమేతంగా విచ్చేశారు. గ్రామంలోని చిలుకల శంకర్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో జస్టిస్ నూనెపల్లి హరినాథ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల సహకారంతో ఉన్నత స్థితికి చేరుకున్నానని, తండ్రి బాలవెంకటరెడ్డి తనకు హీరో అని చెప్పారు. మారుమూల గ్రామంలో పుట్టిన తాను రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి స్థాయికి చేరుకోవడానికి పడిన కష్టాన్ని వివరించారు. జిల్లా అదనపు జడ్జి భూపాల్‌రెడ్డి, నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఏఎస్పీ నరేంద్రనాథ్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి ఇంజన్ ‘డెక్కన్’ ప్రాంతమే..

‘ది డెక్కన్ పవర్ ప్లే’ పుస్తకావిష్కరణలో మాజీ ప్రధాని మీడియా సలహాదారు సంజయ బారు


సాక్షి, న్యూఢిల్లీ: దేశాభివృద్ధి ఇంజన్ డెక్కన్ ప్రాంతమే అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారు సంజయ బారు అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత జాతీయ రాజకీయాల్లో తెలుగు రాష్ట్రాల ప్రభావం తగ్గిందన్నారు. మంగళవారం ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ రచించిన ‘ది డెక్కన్ పవర్ ప్లే’ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్ ఆఫ్ సౌత్ ఆసియా అధ్యక్షుడు వెంకట్ నారాయణ, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా చైర్మన్ గౌతమ్ లహరి, ఆల్ ఇండియా వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎన్ సిన్హా, రూపా పబ్లికేషన్స్ అధినేత రుద్రనారాయణ శర్మ పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ బారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు దేశ అభివృద్ధికి గ్రోత్ ఇంజన్ లా పనిచేస్తున్నాయని తెలిపారు. దేశ జనాభాలో 50శాతం హిందీ రాష్ట్రాల్లో ఉండగా.. కేవలం దక్షిణాది రాష్ట్రాలు 50 శాతం స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)ని అందిస్తున్నాయని వివరించారు. పుస్తక రచయిత దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో 2004–2014 వరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మారని, విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ నేతలకు డిపాజిట్లు కూడా రాలేదని తెలిపారు. తెలుగు రాజకీయాలు, రాజకీయ నేతలపై హస్తినలోని పెద్దలకు తప్పుడు అవగాహన ఉందని, దక్షిణాదిలో ఏం జరుగుతోందో... ఢిల్లీ పెద్దలకు తెలిపే ప్రయత్నంలో భాగంగా తొలిసారి ‘ది డెక్కన్ పవర్ ప్లే’ పుస్తకాన్ని ఇంగ్లిష్‌లో రాశానని దేవులపల్లి అమర్ వివరించారు. ఎఫ్‌సీసీ అధ్యక్షుడు వెంకట్ నారాయణ మాట్లాడుతూ దేవులపల్లి అమర్ రాసిన ‘ది డెక్కన్ పవర్ ప్లే’ పుస్తకం ఉత్తరాది వారికి తెలుగు రాజకీయాలపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ పుస్తకాన్ని హిందీలో ముద్రించాలని అమర్‌కు వెంకట్ నారాయణ సూచించారు.

రాష్ట్రంలో ‘లైఫ్ మిషన్’

- విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం ఎంపిక
- బీఈఈ దక్షిణాది రీజియన్ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ప్రకృతి సిద్ధమైన జీవనశైలిని అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ‘లైఫ్ మిషన్’ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పథకం అమలుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైనట్లు బీఈఈ దక్షిణాది రీజియన్ సలహాదారుగా నియమితులైన ఎ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ‘లైఫ్’ మిషన్‌కు నోడల్ అధికారిగానూ వ్యవహరించనున్న ఆయన సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఏపీలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. లైఫ్ మిషన్ అమలుకు కేంద్రం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశలవారీ కార్యాచరణ రూపొందిస్తున్నదని, 2028 నాటికి దేశవ్యాప్తంగా 5.15 లక్షల గ్రామాలు, 3,700 పట్టణ స్థానిక సంస్థల్లోని కోటి మంది ప్రజలను ‘ప్రో ప్లానెట్ పీపుల్’గా మార్చాలనే లైఫ్ మిషన్ పథకం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. సోషల్ మీడియా వినియోగం, పర్యావరణ హిత సదస్సులు, స్థానికంగా లైఫ్ గ్రూపులను ఏర్పాటు చేయడం, ఆన్‌లైన్ వేదికల ద్వారా విస్తృత ప్రచారం వంటి కార్యక్రమాల ద్వారా లైఫ్ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లనుందని, పాఠశాలల్లో ఎనర్జీ క్లబ్‌లను ఏర్పాటు చేసి వర్క్‌షాపులు, ప్రదర్శనలు, పోటీల ద్వారా ఇంధన సామర్థ్యంపై అవగాహన పెంచుతుందని చెప్పారు. ఇళ్లు, కాలనీల సంక్షేమ సంఘాలు, కమ్యూనిటీ వర్క్‌షాపుల ద్వారా ఇంధన సామర్థ్యం పెంపునకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను లైఫ్ మిషన్ తెలియజేస్తుందని, ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహనా కార్యక్రమాలను కూడా బీఈఈ చేపడుతుందని చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు.



ఆరోగ్యం ఉన్నవాడు ఆశను కలిగి ఉంటాడు.
ఆశ ఉన్నవాడు ప్రతిదీ కలిగి ఉంటాడు.
– థామస్ కార్లయిల్

సాక్షి
బుధవారం, 17 జనవరి 2024

ట్రంప్ వైపే 'అయోవా'!

అమెరికాలోని అయోవా రాష్ట్రం అందరి భయాలనూ నిజం చేసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి రెండోసారి రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు ఆ రాష్ట్రంలోని పార్టీ ప్రతినిధులు పట్టం కట్టారు. దేశానికి ట్రంప్ బెడదను నివారించటంలో అయోవా రిపబ్లికన్లు తోడ్పడితే బాగుణ్ణని చాలామంది పెట్టుకున్న ఆశలు తలకిందయ్యాయి. ఇదే రేస్‌లోవున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి అయోవాలో తగినన్ని ఓట్లు రాబట్టలేక పోటీకి స్వస్తిచెప్పారు. మెరుగ్గా ఓట్లు పడకపోతే పోటీ నుంచి తప్పుకుంటారేమోనని వివేక్ మద్దతుదారులు భయపడ్డారు. చివరకు అదే జరిగింది. ముమ్ముందు ఏమవుతుందన్నది పక్కనబెడితే అయోవాలో ట్రంప్ సాధించిన విజయం అనేక విధాల కీలకమైనది. ఇదే రాష్ట్రంలోని రిపబ్లికన్లు ఎనిమిదేళ్లక్రితం అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం జరిగిన ఎన్నికల్లో ట్రంప్‌ను పట్టించుకోలేదు. అప్పట్లో ఆయనకు కేవలం 21 శాతం ఓట్లు పోలయ్యాయి. రెండేళ్ల క్రితం నిర్వహించిన సర్వేల్లో సైతం రిపబ్లికన్లలో అనేకులు విముఖంగానే వున్నట్టు తేలింది. కేవలం కార్మికవర్గ ఓటర్లు మాత్రమే ఆయన వైపు మొగ్గుచూపుతున్నారని, పార్టీలోని కాలేజీ గ్రాడ్యుయేట్స్‌లో అత్యధికులకు ట్రంప్ పోకడలు నచ్చటం లేదని ఆ సర్వేలు తెలిపాయి. వేరేచోట్ల ముందంజలోవున్న ట్రంప్‌ను అయోవాలో అడ్డుకోగలిగితే పార్టీ తరఫున దేశాధ్యక్షుడిగా పోటీ చేయటానికి తన అవకాశాలు మెరుగుపడతాయని డీశాంటిస్ లెక్కలేశారు. కానీ ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి.

విధానాలకూ, నిబంధనలకూ కట్టుబడి ఉండటం ముఖ్యమా... లౌక్యంగా పోవటం మంచిదా అన్న మీమాంస చాలా పాతది. డోనాల్డ్ ట్రంప్ ఒక నీలి చిత్రాల నటి నోరునొక్కేందుకు తన న్యాయవాది ద్వారా ముడుపులు చెల్లించారన్న అభియోగం విచారణార్హమైనదేనని మన్‌హట్టన్ గ్రాండ్ జ్యూరీ నిర్ధారించినప్పుడు అనేకులు లబలబలాడారు. కేసులు పెడితే సానుభూతి వెల్లువెత్తుతుందని, ఆయన బలపడతాడని హెచ్చరించారు. కానీ డెమాక్రాట్లు వినలేదు. ఇక 2020నాటి అధ్యక్ష ఎన్నికల వ్యవహారం సరేసరి. ఓటమి తప్పదని గ్రహించిన ట్రంప్ వాటిని తారుమారు చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. న్యాయస్థానాల్లో కేసులు వేశారు. చివరకు ఓట్ల లెక్కింపును అడ్డుకోవటం కోసం కేపిటల్ హిల్ భవనానికి తరలిరావాలంటూ మద్దతుదార్లను రెచ్చగొట్టారు. పర్యవసానంగా భారీయెత్తున హింస చోటుచేసుకుంది. పలువురు మరణించారు. ఈ ఉదంతాల్లో ట్రంప్‌పై కేసులున్నాయి. అదిగాక తనకు ప్రధాన పోటీదారు కాబోతున్న డెమాక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌పై విచారణకు ఆదేశించాలని 2019లో ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలో ఒకసారి... ఓట్ల లెక్కింపు సమయంలో మద్దతుదార్లను హింసకు ప్రేరేపించారన్న అభియోగంలో మరోసారి ప్రతినిధుల సభ ఆయన్ను అభిశంసించింది. రెండుసార్లూ తమకు బలం వున్న సెనేట్‌లో రిపబ్లికన్లు ట్రంప్‌ను నిర్దోషిగా బయటపడేశారు. చివరకు జరిగేదేమిటో తెలిసినప్పుడు ట్రంప్‌పై ఇదంతా అవసరమా అన్నది విశ్లేషకుల వాదన. కానీ డెమాక్రాట్లకు ఇదంతా పట్టలేదు. నిజానికి సానుభూతే అయోవాలో కొత్త ఓటర్లను ఆయనవైపు మళ్లించిందని తేలింది. తాజా ఎన్నికకు ముందు జరిగిన సర్వేల్లో ప్రత్యర్థుల కన్నా ట్రంప్ చాలా ముందున్నారు. ట్రంప్‌పై పెట్టిన కేసులన్నీ బోగస్‌వేనని పార్టీ ఓటర్లు చెప్పడం గమనించదగ్గది. నిజానికి అయోవాపై ట్రంప్ పెద్దగా నమ్మకం పెట్టుకోలేదు. 2016లో పార్టీలో తనపై పోటీచేసిన సెనెటర్ టెడ్ క్రజ్ రిగ్గింగ్‌తో గెలిచారని అప్పట్లో ఆయన గొడవ చేశారు. ఈసారి అదే పని డీశాంటిస్ చేయబోతున్నారని గగ్గోలు పెట్టారు. కానీ అందుకు భిన్నంగా కార్మికవర్గ ఓటర్లతోపాటు గ్రాడ్యుయేట్లు కూడా ట్రంప్‌ను బలంగా సమర్థించారని తేలింది. ఇక్కడ డీశాంటిస్‌కు గట్టి మద్దతుందని అంచనా వేసిన నిక్కీ హేలీ ఆయనకు వ్యతిరేకంగా భారీయెత్తున ఖర్చుచేశారు. పైగా డెమాక్రటిక్ ఓటర్లు కొందరు హేలీ కోసం రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని స్వీకరించి, ఆమెకు అనుకూలంగా ఓట్లు వేశారు. బహుశా అందుకే కావొచ్చు...డీశాంటిస్ కన్నా కాస్త మెరుగ్గా ఓట్లు సాధించి ఆమె ద్వితీయ స్థానంలో నిలిచారు. అయోవాతో మొదలైన రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి ఎంపిక ప్రక్రియ వచ్చే జూన్ 4తో ముగుస్తుంది. పార్టీలో ఎన్నడూ లేనివిధంగా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయాక కూడా రిపబ్లికన్లకు ట్రంపే నాయకుడిగా కొనసాగుతున్నారు. నోటి దురుసుతనం, ప్రత్యర్థులపై తీవ్రంగా విరుచుకు పడటం లాంటివి ఆయనకు తోడ్పడుతున్నాయో... ఆ పార్టీయే అటువంటివారిని నెత్తినపెట్టుకునే స్థాయికి దిగజారిందో అనూహ్యం. ట్రంప్‌ను విమర్శిస్తే ఆయన మద్దతుదార్లు దాడి చేస్తారని పార్టీలోని ప్రత్యర్థులే బెంబేలెత్తటం గమనించదగ్గది.

ట్రంప్ ఇటీవలి వ్యాఖ్యలు అందరినీ హడలెత్తిస్తున్నాయి. వలసదారులు దేశాన్ని విషపూరితం చేస్తున్నారని, వారిని తరిమికొట్టడమే తన ధ్యేయమని ఆ మధ్య ప్రకటించారు. తాను మళ్లీ అధికారంలోకొస్తే నియంతగా మారి వ్యతిరేకులందరినీ తుడిచిపెడతానని, అసమ్మతిని అణిచేస్తానని హెచ్చరించారు. పార్టీలో ఆయనతో పోటీపడుతున్నవారిదీ అదే బాణీ. తాను గెలిస్తే ఎఫ్‌బీఐని రద్దుచేస్తానని, ప్రభుత్వ సిబ్బందిలో 75 శాతం మందిని ఇంటికి పంపుతానని వివేక్ ఎలుగెత్తారు. ఉన్నంతలో నిక్కీ హేలీ కన్నా డీశాంటిస్ మెరుగే అయినా ట్రంప్ ముందు ఆయన నిలబడలేరని తాజా ఎన్నికల తీరు చూస్తే అర్థమవుతుంది. ఇటు డెమాక్రాట్లు సైతం 81 ఏళ్ల జో బైడెన్‌ను మించి మరెవరినీ ఎంపిక చేసుకోలేక ట్రంప్ సునాయాస విజయానికి పరోక్షంగా బాటలు పరుస్తున్నారు.

జమిలి అమలుకు అవరోధాలు

విశ్లేషణ



మంజీవ్ సింగ్ పురి

ఒక దేశ రాజకీయ నిర్మాణంలో వివిధ స్థాయిలలో ఏకకాల ఎన్నికల కంటే అసెంబ్లీలకు, పార్లమెంట్ ఎన్నికలకు వేర్వేరు నిర్ణీత తేదీలు ఉండటం సర్వ సాధారణం. అయితే, భారత్‌లో ఆసక్తికరంగా లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయాన్ని రూపొందించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, పార్లమెంటరీ కమిటీ నిశ్చితాభిప్రాయం ఏమిటంటే, రెండు దశల్లో ఎన్నికలు జరగాలన్నదే! కొన్ని రాష్ట్రాలకు లోక్‌సభ పదవీ కాలం మధ్యలోనూ, మరికొన్నింటికి లోక్‌సభతోపాటు ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ, పదేపదే జరిగే ఎన్నికల ద్వారా అనవసరంగా సమయం, ఖర్చు చేయకూడదనే ఆలోచన నుంచి వచ్చిన 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అనేది దాని అమలు సాధ్యతపైనే ఆధారపడి ఉంది.

ఒక దేశం, ఒకే ఎన్నిక' విధానం అమలుకు రాజ్యాంగ సవరణలు, ఇతర పరిశీలనల విషయమై ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ... దీనికి సంబంధించి ప్రజల సూచనలను కోరింది. 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అనే ఆలోచనకు ప్రధాన కారణం సమయం, ఖర్చు, ఆదా చేయడం. ఈ రెండు అంశాలు ప్రపంచవ్యాప్తంగా వర్తిస్తాయి. కానీ, సమాఖ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలలో దాదాపు ఎక్కడా సమాఖ్య స్థాయిలో, ప్రాంతీయ (రాష్ట్ర) స్థాయిలలో ఏకకాల ఎన్నికలు జరగడం లేదు. నిజానికి సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, చట్టం – న్యాయంపై ఏర్పర్చిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, ఏకకాల ఎన్నికల అంశాన్ని పరిశీలించిన 79వ నివేదిక... ప్రపంచవ్యాప్తంగా దక్షిణాఫ్రికా, స్వీడన్ దేశాల్లోని రెండు కేసులను మాత్రమే ఉదాహరించింది.

సార్వత్రిక వయోజన ఓటు హక్కును ప్రతిపాదిస్తున్న దక్షిణాఫ్రికాలో ఎన్నికలు 1994లో మాత్రమే ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్... సమాఖ్య, ప్రాంతీయ స్థాయిలలో (వెస్టర్న్ కేప్ మినహా) దేశమంతటా విజయం సాధించడం కొనసాగించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి 25 ఏళ్లలో, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా గెలుస్తూ వచ్చిన భారతదేశ పరిస్థితికి ఇది భిన్నమైనది కాదు. భారతదేశంలో మరింత స్పర్ధాత్మక రాజకీయ దృశ్యం కారణంగా, ఆ తర్వాత హంగ్ అసెంబ్లీలు (హంగ్ పార్లమెంటు కూడా), పార్టీని మొత్తంగా ఖాళీ చేసి వేరే పార్టీలోకి గెంతేయడం (ఫ్లోర్ క్రాసింగ్) మొదలైనవి కనిపించడం ప్రారంభమైంది. ఫలితంగా చట్టసభల రద్దు, ఎన్నికలు, వివిధ సమయాల్లో పార్లమెంటుకు, రాష్ట్రాలకు (శాసనసభ లేకుండా) ఆరు నెలల కంటే ఎక్కువ విరామం ఏర్పడుతూ వచ్చింది. కేంద్రంలో, రాష్ట్రాలలో ఇలాంటి స్థితి ప్రజాస్వామ్యానికి ఆమోదయోగ్యం కాదు. పైగా భారత రాజ్యాంగం దీనికి అనుమతించదు.

స్వీడన్ విషయానికి వస్తే ఆ దేశం మునిసిపాలిటీలు, రీజియన్లలో ఏకీకృత ప్రభుత్వాన్ని కలిగి



జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో తొలి సమావేశం (ఫైల్ ఫొటో)

ఉంది, కానీ రీజియన్‌లలో మాత్రం ఫెడరల్ వ్యవస్థలోని ప్రావిన్సుల వలె ఉండదు. పైగా వాటి మధ్యన క్రమానుగత సంబంధం లేదు. ముఖ్యంగా, రెండూ వేర్వేరు రకాల పనులను చేపట్టే స్థానిక ప్రభుత్వ రూపాలు. స్వీడిష్ రాజ్యాంగం ముందస్తు ఎన్నికలను అనుమతిస్తుంది. అయితే ఇవి రద్దు అయిన కాలం నుండి మిగిలి ఉన్న కాలానికి మాత్రమే పరిమితమవుతాయి.

ఒక దేశంలోని రాజకీయ నిర్మాణంలో వివిధ స్థాయిలలో ఏకకాల ఎన్నికల కంటే అసెంబ్లీలు, సమాఖ్య పార్లమెంట్‌ల ఎన్నికలకు నిర్ణీత తేదీలు ఉండటం చాలా సాధారణ లక్షణం. పార్లమెంటరీ ప్రభుత్వ రూపాన్ని కలిగి ఉన్న కెనడా సమాఖ్య వ్యవస్థ ఫెడరల్ స్థాయిలోనూ, దాని ప్రావిన్సులలోనూ రెండు చట్టాలను రూపొందించింది. ఎన్నికల నిర్వహణకు ఒక నిర్ణీత తేదీని ప్రతిపాదిస్తుంది, ఆ తేదీ ప్రావిన్స్ నుండి ప్రావిన్స్‌కు మారుతూ ఉంటుంది. ఫెడరల్ ఎన్నికల షెడ్యూల్ వేరొక దానిని అనుసరిస్తుంది. ఆస్ట్రేలియాలో ఫెడరల్ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల (వాటిలో చాలా వరకు) కాలావధులు వరుసగా మూడు, నాలుగు సంవత్సరాలు ఉంటాయి. తద్వారా అక్కడ జమిలి ఎన్నికలను మినహాయించారు.

'నిర్దిష్ట తేదీ, పదవీకాలం' ఎన్నికల నమూనా తక్షణమే అమెరికాను గుర్తు చేస్తుంది. అక్కడ అధ్యక్ష, గవర్నర్ ఎన్నికలు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే జరుగుతాయి. అధ్యక్షుడు లేదా గవర్నర్ పని చేయనట్లయితే వారి స్థానంలోకి రాగల యోగ్యత ఉన్నవారి కోసం ఒక వ్యవస్థ అమలులో ఉంది. ఆ ప్రక్రియ ద్వారా పూర్తి కాలాన్ని కొనసాగించడం సాధ్యమవుతుంది. అయితే ఇది కొన్నిసార్లు 'ప్రజల స్థాయిలో' ఎన్నికల్లో పోటీ చేయకుండానే 1974లో గెరాల్డ్ ఫోర్డ్ అధ్యక్షుడిగా మారడం వంటి క్రమరాహిత్యాలకు దారి తీస్తుంది. అంతేకాకుండా, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అమెరికా కాంగ్రెస్‌లో, రాష్ట్రాల అసెంబ్లీలలో ప్రతినిధుల సభకు ఎన్నికలు జరుగుతాయి. ప్రైమరీలకు సంబంధించి అమెరికన్ సంప్రదాయం ప్రకారం, దేశం ఆచరణాత్మకంగా ప్రతి సంవత్సరం ఎన్నికల మోడ్‌లో ఉంటుంది.

భారత్‌లో ఆసక్తికరంగా లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయాన్ని రూపొందించడానికి పెద్ద ప్రయత్నాలు జరిగినప్పటికీ, పార్లమెంటరీ కమిటీ నిశ్చితాభిప్రాయం ఏమిటంటే – రెండు దశల్లో ఎన్నికలు జరగాలన్నదే! కొన్ని రాష్ట్రాలకు లోక్‌సభ పదవీకాలం మధ్యలోనూ, మరి కొన్నింటికి లోక్‌సభతోపాటు ఎన్నికలు జరపాల్సి ఉంటుంది.

సమాఖ్య, ప్రాదేశిక ఎన్నికలను వేరు చేయడం వల్ల ఓటర్లు తమ రాష్ట్రం లేదా ప్రావిన్స్‌లో ఉన్న నాయకులు లేదా జాతీయ ఎన్నికల సమస్యల కారణంగా ఇటూ అటూ అవగల సంభావ్యతకు గురికాకుండా ఉంటారని నమ్మకం. పోరులో ఉన్న ప్రాంతీయ పార్టీలకు (లేదా పార్టీలకు) ప్రత్యేక గుర్తింపు లేనప్పుడు అలాగే ఓటర్లు సులభంగా గుర్తించగలిగేలా పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలకు మధ్య తేడాను సూచించే కారణం లేనప్పుడు ఇది జరిగే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికీ, పదేపదే జరిగే ఎన్నికల ద్వారా అనవసరంగా సమయం, డబ్బులు ఖర్చు చేయకూడదనే ఆలోచన ఆమోదయోగ్యమైనదే. జర్మనీలో ఇటీవల నేపాల్ అనుభవాల నుండి, ఎక్కువ రాజకీయ సుస్థిరతను అందించే రాజ్యాంగపరమైన నిబంధనలు సాధ్యమయ్యే అవకాశం కనిపించింది. ఉదాహరణకు, జర్మన్ బేసిక్ లా, 2015 నేపాలీ రాజ్యాంగం అవిశ్వాసంలో సానుకూల ఓట్లను మాత్రమే అనుమతిస్తాయి. అటువంటి తీర్మానంతో పాటు తదుపరి నాయకుడి పేరు కూడా ఉండాలి.

బ్రిటన్‌లో, కెనడాలో కూడా పార్లమెంటు నిబంధనలను పరిష్కరించే ప్రయత్నాలు... కామన్వెల్త్ సంప్రదాయం ద్వారా సభను రద్దు చేసి, తాజా తీర్పును కోరే హక్కును ప్రధానమంత్రి కలిగి ఉండటం ద్వారా విఫలమయ్యాయి. నేపాల్‌లో అదే సంప్రదాయాన్ని అమలు చేయాలని కోరినప్పుడు, దానిని సుప్రీంకోర్టు 2021లో రెండు సందర్భాల్లో అనుమతించకపోగా, కొత్త నాయకుడిని ఎన్నుకోమని సభను కోరింది. మధ్యంతర ఎన్నికలపై ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా 2017లో ఎన్నికైన సభ పూర్తి ఐదేళ్ల కాల వ్యవధిలో పాలన సాగించేలా అది దోహదపడింది.

వ్యాసకర్త భారత మాజీ రాయబారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గ్రేట్ ఇండియన్



సుమిత్ నాగల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరుకోవటం ద్వారా గ్రాండ్ స్లామ్‌లో గత 35 ఏళ్లలో ఒక సీడెడ్ ఆటగాడిని ఓడించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఈ విజయం అతడికి 1,20,000 డాలర్లను సంపాదించి పెట్టింది. ఆటకు ముందు తన బ్యాంకు ఖాతాలో 900 యూరోలే ఉన్నాయనడం అతని నిజాయతీ.

– జూలియో రోడ్రిగ్స్, ఫ్రెంచి క్యూరేటర్

అదేం కారణం?!



రిపబ్లికన్‌లు ఇలా ఆలోచిస్తున్నారు: "అయోవా రిపబ్లికన్ పార్టీ చర్చా సదస్సులో పేలవమైన జవాబుల తర్వాత అధ్యక్ష ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్న భారత సంతతి వివేక్ రామస్వామి, ఆ వెంటనే ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు కనుక అంతిమ విజయం ట్రంప్‌దే." కానీ ఇదే ట్రంప్ 2016 ఎన్నికల్లో అయోవాను కోల్పోయారు కదా!

– సిలాస్ ఎంబురుకి, కెన్యా లా విద్యార్థి

దేవుడా... కాపాడు!



ఓ అల్లాహ్! పాలస్తీనా ప్రజలకు సహాయం చేయండి. వారిని రక్షించండి. ఓ అల్లాహ్! వారి మనోవేదనను, భౌతికమైన బాధల్ని తగ్గించండి. వారిపై మీ కరుణను ప్రసరింపజేయండి. ఓ అల్లాహ్! ఈ సంక్షోభ సమయంలో ప్రజల హృదయాలను తెరిపించండి.

– ఫర్‌ఖాన్, 'షరీఫ్', యు.ఎ.ఇ.

పడి లేచిన పట్టణం



ఫొనీ తుపాను 2019లో పూరీ పట్టణాన్ని దెబ్బ తీసినప్పటి నుండి ఈ ఐదేళ్లలో ఎంతో మారింది. నాడు నీటిలో అతలాకుతలమైన పవిత్ర నగరం నేడు జగన్నాథ ఆలయ శ్రీ మందిర్ పరిక్రమ ప్రకల్ప ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జనవరి 17 నుంచి సరికొత్త పూరీని వీక్షించవచ్చు.

– సౌమ్యజిత్ పట్నాయక్, కళింగ టీవీ

రుచుల రుతువు



నువ్వులు–బెల్లం కలయికలో అద్భుతమైన విశేషం ఏమిటంటే... ఒక రుతువు నిష్క్రమిస్తూ, మరో రుతువు ప్రవేశిస్తున్నప్పుడు తీపిని, చేదును కలిపి (తియ్యదనమే ఎక్కువనుకోండి) ఆరగించడం. మీ అందరికీ సంక్రమణ రుతువు శుభాకాంక్షలు.

– సుఖదా, రచయిత్రి, నాగపూర్

ఇన్ బాక్స్

ఓడుతూ... గెలుస్తూ...

గుజరాత్‌కు చెందిన బిల్కిస్ బానో 22 ఏండ్లుగా జరుపుతున్న న్యాయ పోరాటంలో ఎన్నో ఒడుదొడుకులు! తనపైనా, తన కుటుంబంపైనా దారుణాలకు పాల్పడిన వారికి శిక్ష పడిందని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో నేరస్థులు జైలు నుంచి విడుదల కావటం ఆమెను విస్మయపరచింది. 2002 గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో బిల్కిస్ బానోపై అత్యాచారం చేయడమే కాకుండా, ఒక పసిపిల్లతో సహా ఆమె కుటుంబ సభ్యులను హత్య చేసిన కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న 11 మంది నేరస్థులను గుజరాత్ ప్రభుత్వం శిక్ష పూర్తి కాకుండానే రెమిషన్‌పై విడుదల చేసింది. ఈ చర్యపై బాధితురాలు బిల్కిస్‌తో పాటూ దేశవ్యాప్తంగా అనేకమంది నిరసన వ్యక్తం చేశారు. బిల్కిస్ ఈ చర్యను సవాల్ చేస్తూ సుప్రీంకోర్ట్ తలుపు తట్టింది. అలాగే సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్, మాజీ ఎంపీ మహువా మొయిత్రా, సుభాషిణీ అలీ, శోభా గుప్తా... వంటివారు ఆమె తరఫున కోర్టుకెక్కారు. మొత్తం వ్యవహారాన్ని సమీక్షించిన ఉన్నత న్యాయస్థానం గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టింది. జైలు నుంచి బయటకు వచ్చిన పదకొండు మంది నేరస్థులనూ లొంగిపోవాలని ఆదేశించింది. ఈ తీర్పు నిజంగా దేశంలో ఎంతో మందికి ఊరట కలిగించింది. న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగేలా చేసింది.



బిల్కిస్ బానో


బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కానీ, కేంద్రంలో కానీ మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై నోరు విప్పేవారే కరవయ్యారు. మణిపుర్‌లో యువతులను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటనపై ఆ పార్టీ ప్రభుత్వాలు కానీ, నాయకులు కానీ స్పందించిన తీరు ఈ సందర్భంగా గమనార్హం. మణిపుర్‌లో హింస ఇంకా ఆగలేదు. ఆరు నెలలు కావస్తున్నా ప్రధానమంత్రి అక్కడికి వెళ్ళలేదు. ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు బీజేపీ ఐటి సెల్ నిర్వాహకులు ఒక యూనివర్సిటీ క్యాంపస్‌లో యువతిపై లైంగికదాడి చేయడం, ఆమెను వివస్త్రను చేసి వీడియో తీయడం లాంటి దారుణాలకు పాల్పడినా ప్రధాని స్పందించలేదు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని మహిళా రెజ్లర్లు ఆరోపించి రోడ్లపై నిరాహారదీక్షకు దిగినా బీజేపీ పెద్దల్లో చలనం లేదు. చివరికి వ్యవహారం చేయిదాటిపోతున్న తరుణంలో కొత్తగా ఎన్నికయిన రెజ్లింగ్ సమాఖ్య పాలక వర్గ సభ్యులను సస్పెండ్ చేసి పరువు నిలుపుకొన్నది కేంద్ర సర్కార్.

బిల్కిస్ బానో విషయంలో అయితే బీజేపీ నేతలు అవహేళన చేసే మాటలు మాట్లాడారు. క్షమాభిక్ష మీద వచ్చిన వారికి సన్మానాలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు వేదికలు ఎక్కించి వారితో ఉపన్యాసాలు ఇప్పించారు. వారికి మంగళ హారతులు పట్టారు. నిజం చెప్పాలంటే మహిళల మీద బీజేపీ నేతలకు ప్రేమ లేదు. 'బేటీ బచావో, బేటీ పఢావో' వంటివి కేవలం ప్రచారం కోసం వాడే నినాదాలే అని అర్థమవుతోంది. ఇప్పుడు సుప్రీం కోర్ట్ తాజా ఆదేశం మేరకు జైలుకు వెళ్లాల్సిన 11 మందిలో 9 మంది మాయం అయ్యారట! మాయం అయ్యారా? వారికి మద్దతు ఇచ్చే పార్టీ నేతలు వారిని మాయం చేశారా అన్నది తేలాల్సి ఉంది. వారిని తిరిగి జైలుకు పంపడానికి మరో ఆందోళన చేయాల్సి వస్తుందేమో!

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్ । 99518 65223

కాంగ్రెస్ పునరాలోచించుకోవాలి!

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కారాదని కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం గర్హనీయం. సనాతన భారతీయ సంస్కృతిని తమదిగా భావించే హిందువులకు శ్రీరాముడి జీవితం, రామాయణంలోని అన్ని ఘట్టాలూ పరమ పవిత్రమైనవి. ఈ నేపథ్యంలో ఈ వ్యాసాన్ని అర్థం చేసుకోవాలి. జనవరి 22 అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ ఉత్సవానికి ప్రపంచ దేశాలలోని ప్రముఖులకు ఆహ్వానాలు పంపినట్లే, ఈ దేశంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులకూ 'అయోధ్య రామ మందిరం తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఆహ్వానాలను పంపింది. హిందువుల ఆచారాలు, హిందువుల సంస్కృతిపై నిరంతరం విషం వెళ్లగక్కే వామపక్ష పార్టీలు ఈ మహోత్సవానికి రాలేమని తెగేసి చెప్పాయి. ఈ విషయంలో వామపక్ష నాయకులు సైద్ధాంతిక విభేదత్వాన్ని చక్కగా ప్రదర్శించినందుకు వారిని స్వాగతించాలి.

ఇక సుదీర్ఘకాలం ఈ దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ మిగతా పార్టీల కంటే భిన్నమైంది. ఆ పార్టీ మనుగడ, అస్తిత్వం, ఉత్థాన– పతనాలు ఈ దేశంలోని మెజార్టీ ప్రజలైన హిందువుల ఆలోచనా విధానంతో ముడిపడి ఉన్నాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం హిందువుల ఆధ్యాత్మిక పరంపరతో, మనోభావాలతో ముడిపడిన విషయం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారనే విషయం ఈ మహోత్సవానికి హాజరు కాకూడదన్న నిర్ణయం ద్వారా తేటతెల్లమైంది. 'కాంగ్రెస్ పార్టీ హిందువులకు వ్యతిరేకమైనది' అనే భావాన్ని అధికార పార్టీ బీజేపీ, హిందుత్వ సంస్థలు బాగా ప్రచారం చేస్తాయనడంలో సందేహం లేదు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇది ఒక ప్రచారాంశంగా మారుతుంది. రామమందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల రాజకీయ ప్రాజెక్టు అనీ, అందుకే తాము ఈ మహోత్సవానికి రావడం లేదనీ కాంగ్రెస్ నాయకులు వివరణలు ఇచ్చుకున్నా– ఈ దేశంలోని హిందువులుగానీ, ప్రపంచ దేశాల్లోని హిందువులు కానీ నమ్మరు గాక నమ్మరు. 'రామసేతు' కట్టడాన్ని కూల్చాలని ప్రయత్నించిన సందర్భంలో 'రామాయణం మిథ్య' అంటూ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసిన విషయం బీజేపీ నాయకులు గుర్తుచేసి, కాంగ్రెస్ పార్టీకి హిందువులను పూర్తిగా దూరం చేసే



ప్రయత్నం చేస్తారు. ఆ చిన్న విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అర్థం కాకపోవడం దేశంలోని రాజ కీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయోధ్యలో రామమందిర నిర్మాణంతో హిందువుల కల సాకారం అయిందని బీఆర్‌ఎస్ నాయకురాలు కె. కవిత వ్యాఖ్యానించడం, శ్రీరాముడు ఈ దేశంలోని హిందువులకే కాదు, ప్రపంచంలోనే మానవాళికి ఆదర్శమని జమ్ము– కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ప్రకటించడం హిందువుల మనోభావాలను గుర్తించినట్లు కాదా? ఈ విషయంలో కాంగ్రెస్ ఎందుకు తప్పు చేస్తున్నట్లు?

ఇక శ్రీరాముని బీజేపీ తన రాజకీయాలకు వాడుకుంటుందనీ, ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే విమర్శలు సహేతుకమేనా? కాంగ్రెస్ తాను అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రపతి భవన్‌ను ఇఫ్తార్ విందులకు కేంద్రం చేయడం, ముస్లిం టోపీలు ధరించడంలో పోటీ పడడం, ముస్లింల హజ్‌యాత్రకు ప్రభుత్వ డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేయడం, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును కాలరాస్తూ, పార్లమెంట్ చట్టం చేయడం వంటి విషయాలు లౌకిక వాదం కిందికి వస్తాయా? తాను మైనార్టీ మతస్థుల మనోభావాలకు కట్టుబడి, సేవలు అందించలేదా? ఈ ప్రశ్నలు సామాన్య హిందువులు సంధిస్తే–కాంగ్రెస్ నాయకులు సమాధానాలు చెప్తారా? కులాల వారీగా ఉండే హిందూ సమాజం అయోధ్యలో రామ మందిరం కేంద్రంగా ఒక సుసంఘటిత సమాజంగా రూపుదిద్దుకుంటుంది. ముస్లింల పరిపాలనా కాలంలో వేల దేవాలయాలు కూల్చబడ్డాయి. అందులో అయోధ్య రామ మందిరం ఒకటి. 'మక్కా'... ముస్లింలకు ఎంత పవిత్రమైందో, 'అయోధ్య'... హిందువులకంతే పవిత్రమైంది. ఈ విషయంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వంటి హిందుత్వ సంస్థలు హిందూ సమాజానికి అండగా నిలబడ్డాయి. వాస్తవం మాట్లాడితే మతాన్ని రాజకీయాలకు వాడని పార్టీ ఈ దేశంలో ఏదీ లేదు. బీజేపీకి ఈ విషయంలో మినహాయింపు ఎందుకు? గతంలో జరిగినట్లు హిందువులను విడగొట్టే ప్రయత్నాలు ఇక సాగవు!

గుజరాత్ సోమనాథ్ మందిర పునఃప్రతిష్ఠకు నాటి హోం మంత్రి పటేల్ పిలుపు మేరకు అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ హాజరయ్యే సందర్భంలో నిరోధించే ప్రయత్నం చేసిన ప్రధాని నెహ్రూ చేసిన తప్పిదాన్నే కాంగ్రెస్ పార్టీ నేడు చేసింది. ఈ విషయంలో ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆ పార్టీ పునరాలోచించుకోవడం అవసరం.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

భక్తి ప్రభావం

అరణ్యాలలో సంచరిస్తూ మండుటెండల తాపానికి దప్పిక గొన్న బాటసారి అలసి సొలసి చివరికి తన ఇల్లు చేరుకుని, సేద తీరుతాడు. అక్కడ నుండి మళ్ళీ ఎక్కడికీ కదలాలనిపించదు. అలాగే, సంసార బంధాలలో చిక్కుకుని అలసి పోయిన వ్యక్తి, విష్ణు పాద కమలద్వయంతో అనుబంధం ఏర్పడి ఆ ఆనందం చవి చూస్తే మళ్ళీ ఆ సన్నిధిని వదలలేడు.

మనసు దేవుని మీద లగ్నమయ్యే కొద్దీ లౌకిక విషయాలపై ఆసక్తి తగ్గుతుంది. లోకంలో జీవిస్తూనే, నిరాడంబర జీవితాన్ని గడపటానికి వ్యక్తి ఇష్టపడతాడు. జీవనం నడవటానికి సరిపడా ధనం ఉంటే చాలనుకుంటాడు. ఆలోచనలు ఉన్నత మార్గంలో నడుస్తాయి. లౌకిక విషయాలు అల్పంగా కనిపిస్తాయి. భక్తి ప్రభావం అట్టిది.

జ్యోతిర్మయం

'మందార పూలలోని మకరంద మాధుర్యాన్ని గ్రోలటానికి అలవాటు పడ్డ తుమ్మెద ఉమ్మెత్త చెట్ల వైపు వెళుతుందా? లలితమైన, సుకుమారమైన, మామిడి చిగురుటాకులను తింటూ పరవశించి పాడే కోయిల కొండ మల్లెల వైపు వెళుతుందా? స్వచ్ఛమైన ఆకాశగంగా తరంగాలపై విహరించే రాజహంస సెలయేటి ప్రవాహాలకు వెళుతుందా? పూర్ణచంద్రుని వెన్నెలలో విహారం చేసే చకోరం దట్టమైన మంచు వైపు వెళుతుందా?' అని హిరణ్యకశిపునితో ప్రహ్లాదుడు అంటాడు. హరి స్మరణ తప్ప మరొకటి తెలియని, హరి భక్తిలో పూర్తిగా లీనమైపోయిన ప్రహ్లాదునికి సర్వం విష్ణుమయంగానే కనిపిస్తుంది. అటువంటి వానికి తండ్రి హిరణ్య కశిపుడు లౌకిక విద్యలు నేర్పించటానికి గురువుల వద్దకు పంపుతాడు. అప్పుడు ప్రహ్లాదుడు విష్ణు ప్రాశస్త్యాన్ని చెబుతూ ఈ పోలికలు తెస్తాడు. మందార మకరంద మాధుర్యం, లేత మామిడి చిగుళ్ళు తిని పాడే కోయిల, ఆకాశ గంగా ప్రవాహంలో విహరించే రాజహంస ఇత్యాదులన్నీ ఉన్నతమైన హరిభక్తిని ప్రతిపాదించేవి. ఇతరములన్నీ అల్పమైనవి. లౌకికమైన, నశ్వరమైన మానవ జీవితానికి చెందినవి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, తిథి: శు.సప్తమి తె.3.04 వరకు (తెల్లవారితే గురువారం) తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.9.57 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: రా.9.14 నుండి 10.42 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.48 నుండి 12.36 వరకు, అమృత ఘడియలు: లేవు, ముక్కనుమ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.42.

క్లుప్తంగా...

అబ్బే.. కొత్త ఓటర్లు లక్ష కాదు 25 వేలే!

- అందులో ఆరు వేల ఓటర్లపై మాత్రమే అనుమానం
- చంద్రగిరి లిస్టుపై మాటమార్చిన చంద్రబాబు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష దొంగ ఓట్లు చేర్చారంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడమే కాకుండా, మీడియాలో హడావుడి చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట మార్చారు. లక్ష కాదు గత ఐదేళ్లలో కేవలం 25 వేల కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారని నిర్ధారించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గానికి వచ్చిన ఆయన తిరుపతి రూరల్ మండలం అవిలాలలో ఉంటున్న టీడీపీ నేత వెంకటమణిప్రసాద్‌ను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలవలేమని వైఎస్సార్‌సీపీ నేతలు దొంగ ఓటర్లను చేర్చుతున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో తాను చెప్పినట్టు లక్ష మంది కొత్తగా చేరలేదని, 25 వేల మంది మాత్రమే ఓటర్లుగా చేరారని ఒప్పుకున్నారు. ఇందులో ఆరువేల మంది ఓటర్లపై అనుమానం ఉందని, వారి అడ్రస్‌లు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని సన్నాయి నొక్కులు నొక్కారు. చంద్రగిరిలో గతంలో 325 పోలింగ్ బూత్‌లు ఉంటే ఇప్పుడు 375కు మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, నగరి నియోజకవర్గాల్లో కూడా దొంగ ఓటర్లతో గెలుపొందాలని వైఎస్సార్‌సీపీ ప్రయత్నిస్తోందని చెప్పుకొచ్చారు. ఓటర్ల లిస్టును సక్రమంగా పరిశీలించని ఆర్వోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేత అమరనాథ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలకు అండ సీఎం వైఎస్ జగన్

- ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాలను అమలుచేస్తూ అట్టడుగు వర్గాలకు ఆపద్బాంధవుడిగా ఎళ్లవేళలా సీఎం వైఎస్ జగన్ అండదండగా ఉంటున్నారని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ప్రశంసించారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతి వనం ప్రారంభోత్సవానికి భారీఎత్తున తరలి రావాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతి అడవి ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని .. కనీసం అక్కడ కూడా పునాదులు వేయలేదని విమర్శించారు. మహోన్నత ఆశయంతో సీఎం జగన్ విజయవాడ నడిబొడ్డున సామాజిక న్యాయ మహాశిల్పంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి చరిత్రలో నిలిచారని రాజునాయక్ చెప్పారు.

నాగాలమ్మకు నారా, నందమూరి కుటుంబాల ప్రత్యేక పూజలు

- తల్లిదండ్రుల సమాధి వద్ద నివాళులర్పించిన చంద్రబాబు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): సంక్రాంతి పండుగ సందర్భంగా నారావారిపల్లి గ్రామం మూడు రోజుల పాటు కళకళలాడింది. సొంత గ్రామంలో సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ కుటుంబ సభ్యులు శనివారం నారావారిపల్లికి చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ వచ్చారు. సోమవారం ఉదయం నారా, నందమూరి కుటుంబ సభ్యులు ముందుగా వారి కులదైవమైన నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి చంద్రబాబు, లోకేశ్, నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు చంద్రబాబు తల్లిదండ్రులు అమ్మణ్ణమ్మ, ఖర్జూరనాయుడుల సమాధి వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. తదుపరి దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయంత్రం 4.50గంటల సమయంలో చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. నారా లోకేశ్, భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ, బ్రాహ్మణి ఇతర కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు పయనమయ్యారు.

కమ్యూనిస్టులవి చవకబారు విమర్శలు

- ఎంపీ జీవీఎల్ నరసింహారావు

ఏయూక్యాంపస్ (విశాఖ): కమ్యూనిస్టులవి చవకబారు విమర్శలు అని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్ నరసింహారావు మండిపడ్డారు. వారికి భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలపై గౌరవం లేదన్నారు. ఏయూలో నిర్వహిస్తున్న మహా సంక్రాంతి సంబరాల వేదిక వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా విశాఖ వేదికగా సంక్రాంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిపై కమ్యూనిస్టుల వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. ఈ కార్యక్రమాలను తిలకించిన కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాలా కితాబిచ్చారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితోనే ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చంద్రబాబుపై ఆలపాటి తిరుగుబాటు

- తెనాలి సీటు జనసేనకు కేటాయింపుపై ఆగ్రహం
- మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధంగా తెనాలి టీడీపీ నేతలు
- జనసేనకు తెనాలి సీటు ఇవ్వొద్దని గతంలోనే కోరిన మాజీ మంత్రి ఆలపాటి
- నేడు గుంటూరులో అత్యవసర సమావేశం


ఆలపాటి రాజా ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతున్న తెలుగుదేశం నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెనాలి సీటు విషయంలో జనసేన, తెలుగుదేశం మధ్య చిచ్చు రాజుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా) తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. బుధవారం గుంటూరులో నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, మండల, పట్టణ పార్టీ, అన్ని అనుబంధ విభాగాల నేతల నేతలతో రాజా అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. తెనాలి సీటు తెలుగుదేశం పార్టీకి కేటాయించకపోతే ఈ నేతలంతా మూకుమ్మడి రాజీనామాలు చేయనున్నట్లు తెలిసింది.

తెనాలి సీటును జనసేన నేత నాదెండ్ల మనోహర్‌కు ఇస్తున్నట్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చాలా కాలం క్రితమే ప్రకటించారు. దీంతో కొద్దికాలం రాజకీయాలకు దూరంగా ఉన్న రాజా తర్వాత మళ్లీ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. నాదెండ్ల మనోహర్‌తో కలిసి చర్చలు జరపడం, కలిసి కార్యక్రమాల్లో పాల్గొనడం చేశారు. నాదెండ్ల మనోహర్‌ను రాజ్యసభకు పంపించి ఈ సీటు రాజాకు ఇస్తున్నట్లు చంద్రబాబు ఇటీవల చెప్పారు. దీంతో రాజా ప్రజా పాదయాత్ర పేరుతో తెనాలి నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభించారు. రాజ్యసభకు వెళ్లడానికి మనోహర్ ఇష్టపడలేదు. తెనాలిలోనే ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. తెనాలిలోనే ఉంటూ టీడీపీ, జనసేన ముఖ్య నేతలను కలుస్తూ సీటు తనదేనని చెబుతున్నారు. తనకు సహకరించాలని కోరుతున్నారు. దీంతో తెనాలి సీటు దక్కదన్న అభిప్రాయానికి వచ్చిన ఆలపాటి రాజా గుంటూరు వెస్ట్ లేదా పెదకూరపాడు కేటాయించాలని కోరుతున్నట్లు తెలిసింది. ఈ సీట్లు ఇచ్చేందుకు అధిష్టానం ఇష్టపడటంలేదు. దీంతో రాజా పార్టీ అధిష్టానంపై తిరుగుబాటుకు సిద్ధమైనట్లు సమాచారం. ఆయన పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ మంగళవారం తన ఇంటికి పిలిపించుకుని, వారితో చర్చలు జరిపారు. పొత్తులో భాగంగా సీటును జనసేన పార్టీకి ఇస్తే సహించబోమని ఈ సమావేశం అనంతరం నేతలు మీడియాకు తెలిపారు. పార్టీ తెనాలి పట్టణ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, మాజీ అధ్యక్షుడు ఖుద్దూస్, మాజీ ఎంపీపీలు కేశన కోటేశ్వరరావు, సూర్యదేవర వెంకటరావు, మాజీ జెడ్పీటీసీ శాఖమూరి చిన్నా, వైకుంఠపురం మాజీ చైర్మన్ జొన్నాదుల మహేష్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ సోమవరపు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ఆడుసుమిల్లి వెంకటేశ్వరరావు, దేసు యుగంధర్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులు వీరమాచినేని వెంకటేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, రావి చిన్ని, రావి సూర్య కిరణ్ తేజ, లాయర్ మద్ది మల్లికార్జునరావు తదితరులతో రాజా ఈ సమావేశం నిర్వహించారు. బుధవారం గుంటూరులో జరిగే సమావేశంలో రాజీనామాలపై నిర్ణయం తీసుకోవాలని వారు నిర్ణయించినట్లు తెలిసింది.

టీడీపీ నాయకుల అరాచకం

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై మారణాయుధాలతో దాడి
- ముగ్గురు కార్యకర్తలకు గాయాలు
- ఆత్మకూరు ఆస్పత్రిలో చికిత్స
- కేసు నమోదు చేసిన పోలీసులు


ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్‌రెడ్డి


ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెంచలరెడ్డి

ఆత్మకూరు: టీడీపీ నాయకులు అరాచకం సృష్టించారు. సంక్రాంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అడ్డుకుని మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలం మడపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మడపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. స్థానిక రామాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో టీడీపీకి చెందిన పెద్దిరెడ్డి కిరణ్, కిషోర్, నవీన్, వినయ్, పూర్ణచంద్ర తదితరులు అడ్డుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులందరూ కలిసి ఈ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని, నిలిపివేయమనడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చెప్పారు. దీంతో చెలరేగిపోయిన టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో దుర్భాషలాడారు. ఫలితంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. గ్రామ పెద్దలు ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో టీడీపీకి చెందిన కిరణ్, కిషోర్ తదితరులు వైఎస్సార్ సీపీకి చెందిన ఇనకల్లు ప్రసాద్‌రెడ్డి, పెంచలరెడ్డి, మాజీ సర్పంచ్ గుండుబోయిన నారాయణయాదవ్ ఇళ్లపై రాళ్లు, కర్రలు, కొడవలి తదితర మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. దాడిలో ప్రసాద్‌రెడ్డికి గాయాలు కాగా, పైదంతాలు రెండు ఊడిపోయాయి. పెంచలరెడ్డి, నారాయణయాదవ్‌లకూ గాయాలయ్యాయి. స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో టీడీపీ నాయకులు పరారయ్యారు. గాయపడిన వారిని తొలుత చేజర్ల పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్సై ప్రభాకర్ సిబ్బందితో కలిసి ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

‘ఉమ్మడి’గా మాయ!

▶ మొదటి పేజీ తరువాయి

హామీలతో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. ఆ మేనిఫెస్టోలో చంద్రబాబుతోపాటు పవన్ ఫొటో కూడా ముద్రించారు. అప్పుడు ఇద్దరూ కలిసే జనానికి హామీలు ఇచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. పీఠమెక్కాకు ముసుగు తొలగించి, అసలు రూపాన్ని బయటపెట్టుకున్నారు. ఆ హామీలను అమలు చేయకపోగా, అసలు మేనిఫెస్టోనే చెత్తబుట్టలో వేశారు. ప్రజలను నిలువునా మోసగించారు. రుణమాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా మహిళలను దారుణంగా వంచించారు. అధికారంలోకి వచ్చాక మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని, మీరు పైసా కట్టకండి అని చెప్పి.. తీరా చంద్రబాబు సీఎం అయ్యాక రైతులు, మహిళలను ముప్పతిప్పలు పెట్టారు. వారు వడ్డీతో సహా రుణాలు చెల్లించుకోవాల్సి వచ్చింది. జాబు రావాలంటే బాబు రావాలంటూ యువతనూ నిలువునా ముంచారు. పింఛన్ల పేరుతో వృద్ధులు, దివ్యాంగులను ఎన్ని అవస్థలు పెట్టాలో అన్నీ పెట్టారు. ఇళ్లు, స్థలాల పేరుతో అందరినీ మోసం చేశారు. గ్రామాల్లో జన్మభూమి కమిటీలు సృష్టించిన అరాచకం అంతా ఇంతా కాదు. అమరావతి రాజధాని పేరుతో ఓ మాయా ప్రపంచాన్నే కళ్ల ముందు నిలబెట్టి చక్కబెట్టుకున్న వ్యవహారాలు, సొంత వారికి చేసిన మేలు కళ్లకు కడుతూనే ఉంది. చివరకు తాము ఇచ్చిన హామీలు ప్రజలకు కనపడకుండా పార్టీ వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోనే తొలగించేశారు. మాటిమాటికీ ప్రశ్నిస్తానంటూ మాట్లాడే పవన్.. ఆనాడు చంద్రబాబు చేసిన మోసాలను, అవినీతిని, అరాచకాలపై ఒక్క ప్రశ్న వేయకపోగా, చంద్రబాబుతో బంధాన్ని మరింత పెంచుకున్నారు. గతంలో మోసం చేసినట్లే మళ్లీ ఇప్పుడు కూడా ఉమ్మడిగా ప్రజలను మోసం చేయడానికి ఇద్దరూ సిద్ధమైపోయారు. స్కిల్ కుంభకోణంలో అరెస్టయి జైలుకు వెళ్లిన చంద్రబాబును వెనకేసుకొచ్చారు. బాబు జైలుకు వెళ్లిన వెంటనే హుటాహుటిన హైదరాబాద్ నుంచి రాజమండ్రి వచ్చి ఆయనతో ములాఖత్ అయ్యారు. అవినీతిని బట్టబయలు చేసి, చంద్రబాబును జైలుకు పంపిన ప్రభుత్వంపైనే విమర్శలు చేశారు. ఆ తర్వాత కూడా ప్రతి విషయంలో అంటకాగుతూనే ఉన్నారు. ఇప్పుడు ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడి కార్యక్రమాలతో మరోసారి ఈ ద్వయం ప్రజలను వంచించడానికి వస్తోంది.

చేసేదంతా చంద్రబాబే

చంద్రబాబు, పవన్ కలిసి పని చేస్తున్నప్పటికీ, వాస్తవంగా నిర్ణయాలన్నీ చంద్రబాబువే. వాటికి వత్తాసు పలకడం పవన్ వంతు. వాస్తవానికి చంద్రబాబు మహానాడులో 6 అంశాలతో ఓ మేనిఫెస్టో ప్రకటించారు. ఇప్పుడు దానికే మరో 6 హామీలను జనసేన ఇస్తున్నట్లు చూపించి మొత్తం 12 అంశాలతో ఉమ్మడిగా మేనిఫెస్టో అంటూ ఒకటి తయారు చేశారు. నిజానికి జనసేన ఆరు హామీలు కూడా చంద్రబాబు చెప్పినవే. వాటికి జనసేన కలర్ మాత్రమే ఇచ్చారు. త్వరలో ఈ ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేయనున్నారు.

జనసేన అభ్యర్థుల ఎంపికలోనూ చంద్రబాబుదే నిర్ణయమనేలా పవన్ చర్యలు ఉన్నాయి. అసలు రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరినప్పటికీ, ఇంతవరకు సీట్ల సర్దుబాటు జరగలేదు. జనసేనకు టీడీపీ ఎన్ని సీట్లు కేటాయిస్తుందనే విషయం తేలలేదు. పవన్ 50 అసెంబ్లీ, రెండు లేదా మూడు లోక్‌సభ సీట్లు అడుగుతుండగా చంద్రబాబు దానిపై ఏమీ తేల్చకుండా నాన్చుతూనే ఉన్నారు. 10 నుంచి 15 సీట్లు మాత్రమే జనసేనకు ఇచ్చేందుకు చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తోంది. సీట్లు ఎన్ని ఇస్తారో తెలియకపోయినా, ఉమ్మడిగా అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు పవన్ సమ్మతించడంపై జనసేన పార్టీ నేతలే ఆశ్చర్యపోతున్నారు. జనసేన అభ్యర్థులను కూడా చంద్రబాబే నిర్ణయిస్తారని, ఉమ్మడి జాబితా నిర్ణయం వెనుక మతలబు ఇదేనని టీడీపీ, జనసేన నేతలు అంటున్నారు. తొలి జాబితాలో 20 నుంచి 27 సీట్లను ప్రకటించాలని భావిస్తున్నారు. అందులోనే ఐదు లేక ఆరు సీట్లను జనసేనకు కేటాయించనున్నారు. ఆ తర్వాత జాబితాలో మరికొన్ని జనసేనకు వదలనున్నారు. చంద్రబాబు తెలివిగా సీట్లు తేల్చకుండానే సర్దుబాటును ప్రకటించి పవన్ కళ్యాణ్‌ను ఇరికించేస్తున్నారు. చివరికి తాను అనుకున్న మేరకే జనసేనకు సీట్లు ఇచ్చే పరిస్థితి కల్పించడం దీని వెనుక వ్యూహమని తెలుస్తోంది.

దళితులకిచ్చే గౌరవం ఇదేనా బాబూ?

- టీడీపీ మాజీ మంత్రికి ఘోర అవమానం
- పక్కన కూర్చొనేందుకు సీటు ఇవ్వకుండా నిల్చోబెట్టిన వైనం


విలేకరుల సమావేశంలో చంద్రబాబు తన పక్కన కూర్చొనే అవకాశం ఇవ్వక పోవడంతో వెనుక నిల్చొని ఉన్న మాజీ మంత్రి, దళిత నేత పరసా రత్నం

తిరుపతి రూరల్: దళితులను అవమానించి ఆనందపడటం చంద్రబాబుకి అలవాటులా మారిపోయింది. ఎవరు మాత్రం ఎస్సీ కులంలో పుట్టాలని కోరుకుంటారంటూ గతంలో మీడియా ముందే అహంకారంతో మాట్లాడిన బాబు మరోసారి దళితుల పట్ల తనకున్న చిన్నచూపును ప్రదర్శించారు. సంక్రాంతి పండుగ రోజు తిరుపతి రూరల్ మండలం అవిలాలలోని టీడీపీ నేత వెంకటమణిప్రసాద్ ఇంట్లో నిర్వహించిన సమావేశంలో దళిత మాజీ మంత్రి పరసారత్నాన్ని అందరి ముందు నిల్చోబెట్టి ఘోరంగా అవమానించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి.. రెండు సార్లు ఎమ్మెల్యే, ఓసారి మంత్రిగా కూడా చేసిన ఆయనను కనీసం తమ పక్కన కూడా బాబు కూర్చోనివ్వలేదు. దాంతో ప్రెస్‌మీట్ జరిగినంతసేపు పరసారత్నం అవమానభారంతో చెమర్చిన కళ్లతో నిల్చొనే ఉండిపోయారు. దళితులను నిత్యం అవమానిస్తూ రాక్షసానందం పొందుతున్న తెలుగుదేశం పార్టీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని దళిత సంఘాలు పిలుపునిస్తున్నాయి.

సామాజిక న్యాయ మహాశిల్పం ఇది

- 19న సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరణ
- రూ.400 కోట్లకు పైగా వ్యయంతో అంబేడ్కర్ స్మృతివనం
- చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి వెల్లడి


అంబేడ్కర్ స్మృతివనంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: విజయవాడ నడిబొడ్డున సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ మహాశిల్పం సామాన్యమైనది కాదని.. అదొక గొప్ప సామాజిక న్యాయ మహాశిల్పమని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు ఈ మహాశిల్పం ఆవిష్కరణ జరగనుందని చెప్పారు. ఇక్కడ సమతా మహాసభ జరుగుతుందని, దీనికి దళిత సోదర, సోదరీమణులు, అంబేడ్కర్ ఆశయాలు నచ్చినవారు, పాటించేవారు కులాలు, మతాలకు అతీతంగా విచ్చేస్తారని చెప్పారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రారంభానికి సిద్ధం అవుతున్న అంబేడ్కర్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, నేతలతో కలిసి మంగళవారం విజయసాయిరెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌కు బీఆర్ అంబేడ్కర్‌పై ఉన్న అభిమానంతోనే అతిపెద్ద విగ్రహ నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. అంబేడ్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా సీఎం జగన్ నవరత్నాలు రూపొందించారని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఈ మహాశిల్పం ఏర్పాటు సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందన్నారు. 81 అడుగుల వేదికపై 125 అడుగుల మహాశిల్పం ఏర్పాటుకు (మొత్తం 206 అడుగులు ఎత్తు) రూ.400 కోట్లకు పైగా వెచ్చించామన్నారు. తరతరాల వివక్షను రూపుమాపేందుకే అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని, దేశంలోని వ్యవస్థలన్నీ ఇంత సక్రమంగా పని చేస్తున్నాయంటే అంబేడ్కర్ మహనీయుడి పుణ్యమేనని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు చూడలేదన్నారు. అంబేడ్కర్ ఆశయాలను, లక్ష్యాలను సీఎం జగన్ కొనసాగిస్తున్నారని వివరించారు.

అంబేడ్కర్ అందరివాడు

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం సీఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని.. విగ్రహావిష్కరణ సందర్భంగా సమతాసభ ఏర్పాటు చేశామని విజయసాయిరెడ్డి చెప్పారు. ఈ సభకు అన్ని ప్రాంతాల నుంచి అన్నివర్గాల ప్రజలు తరలి రానున్నారని చెప్పారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా? అని ఓ మీడియా ప్రతినిధి అడగ్గా.. అంబేడ్కర్ ప్రజల మనిషి అని, బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేసిన వాడని, ఆయన అందరి వాడని సమాధానమిచ్చారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమూ, పార్టీ కార్యక్రమమూ అనే భేదం లేకుండా అందరూ పాల్గొంటారని చెప్పారు. దార్శనికుడి విగ్రహావిష్కరణకు ప్రత్యేక ఆహ్వానం అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం జగన్ ఈ ప్రాజెక్ట్ చేపట్టారని.. ఇందులో పార్టీ, ప్రభుత్వం అని తేడా చూపించకూడదన్నారు.

1.20 లక్షల మంది రాక

రాష్ట్రం నలుమూలల నుంచి 1.20 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నామని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు లేజర్ షో లేదా డ్రోన్ షో ఉంటుందని చెప్పారు. ప్రారంభ కార్యక్రమం తర్వాత ఈ నెల 20వ తేదీ నుంచి సందర్శకులకు అనుమతి ఉంటుందన్నారు. భవిష్యత్‌లో గొప్ప పర్యాటక కేంద్రంగా అంబేడ్కర్ విగ్రహం ప్రాంతం నిలిచిపోతుందని చెప్పారు. లోపల ఆడిటోరియం, వెనుక కన్వెన్షన్ సెంటర్, మ్యూజియం అన్నీ పర్యాటకుల్ని ఆకర్షిస్తాయని తెలిపారు. ఆయన వెంట ఎంపీ కేశినేని నాని, మంత్రి మేరుగ నాగార్జున, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మునిసిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆసిఫ్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా ఉన్నారు.

యర్రగొండపాలెంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు ధ్వంసం


యర్రగొండపాలెంలో చించేసిన ఫ్లెక్సీ


యర్రగొండపాలెం/మద్దిపాడు: యర్రగొండపాలెంలోని మార్కాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ వేయించిన ఈ ఫ్లెక్సీలను సోమవారం అర్ధరాత్రి దాటాక చించివేశారు. నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ డివైడర్లు, రోడ్డు పక్కన వీటిని ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న సీసీ కెమెరాలు ఉన్నా వాటికి కనిపించకుండా ఉండే ప్రాంతాల్లో దాదాపు 15 ఫ్లెక్సీలు చించేశారు. ఉద్దేశపూర్వకంగానే వీటిని ధ్వంసం చేశారని పార్టీ నేతలు మండిపడుతున్నారు.

ఫుటేజ్ మాయం.. బ్యాంకు మేనేజరుపై అనుమానం


ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడులోనూ వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో ధ్వంసం చేశారు. ఏడుగుండ్లపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదురుగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు ధ్వంసమైన ప్రాంతం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదురుగానే ఉండటంతో వైఎస్సార్‌సీపీ నేత గుడ్డపాతల రవి సీసీ ఫుటేజ్ కోసం బ్యాంకు అధికారులను సంప్రదించారు. సీసీ ఫుటేజ్ కావాలంటే బ్యాంకు ఉన్నతాధికారుల అనుమతి కోరాలని చెప్పారు. మద్దిపాడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి మళ్లీ బ్యాంకుకు వెళ్లేటప్పటికీ సీసీ ఫుటేజ్‌లో నాలుగు నిముషాల వీడియోను డిలీట్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. దీనిపై బ్యాంక్ ఆర్ఎంను ఏడుగుండ్లపాడు పిలిపించగా ఆయన ఫుటేజ్‌ను పరిశీలించగా 8:20 నుంచి 8:24 నిమిషాల మధ్యలోని సీసీటీవీ రికార్డులు కనిపించలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారికి మేనేజరు సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులకు చెప్పి చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను ఎంపీపీ వాకా అరుణ కోరారు. దీనిపై ఆర్ఎం రామేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజుల్లో మెయిన్ బ్రాంచ్ నుంచి పూర్తి ఫుటేజ్ తెప్పిస్తానని తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా..సీసీ ఫుటేజ్ వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థిగా పోటీ చేస్తా
- కిరాయి మూకలతో నాపై దుష్ప్రచారం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానేగానీ ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ మారే ప్రసక్తే లేదని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు విపక్షాలు, రాజకీయ ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను టీడీపీ అధిష్టానాన్ని కలిసినట్లు, ఆ పార్టీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఎంపీ టికెట్ ఇవ్వడంతో గెలిచి సేవలు అందించానని తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి పార్టీ తగిన గుర్తింపునిచ్చిందన్నారు. ఇంత ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్‌సీపీని వదిలి వెళ్లాల్సిన అవసరం తనకు లేదన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే సత్తా లేక కొందరు కిరాయి మూకలను నియమించుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అత్యంత బలంగా ఉండటంతో ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. వీటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా పార్టీ మారే ప్రసక్తే లేదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి తీరుతానని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు మరోసారి ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.


అయోధ్యలోని గోడలపై చిత్రించిన రామాయణంలోని అపురూప ఘట్టాల దృశ్యాలు... ఆసక్తిగా తిలకిస్తున్న స్థానికులు



అయోధ్యలో లతా మంగేష్కర్ చౌక్‌లో రూపేశ్ సింగ్ చెక్కిన సైకత శిల్పం

అయోధ్యలో సంప్రదాయ క్రతువులు ఆరంభం

అయోధ్య: చారిత్రక నగరం అయోధ్యలోని భవ్య రామమందిరంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్టకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 22న జరిగే ఈ మహా వేడుకకు దేశ విదేశాల నుంచి వేలాది మంది విశిష్ట అతిథులు హాజరు కాబోతున్నారు. బాలరాముడి ప్రతిష్ఠాపనకు సంబంధించిన సంప్రదాయ క్రతువులు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రాణప్రతిష్ట దాకా నిరంతరాయంగా కొనసాగుతాయని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది. క్రతువులకు ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా, ఆయన భార్య ఉషా మిశ్రా 'యజమానులుగా' వ్యవహరిస్తున్నారు. ఆలయ ప్రారంభోత్సవం దాకా ప్రతినిత్యం వారే యజమానులుగా ఉంటారు. అయోధ్యలో అనుష్ఠానానికి శ్రీకారం చుట్టామని, ఆలయ ప్రాణప్రతిష్టకు దేవుళ్లందరి అనుగ్రహాన్ని అర్థిస్తూ మొత్తం 11 మంది పూజారులు క్రతువులు ప్రారంభించారని ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ తెలిపారు. ఆలయంలో ప్రాణప్రతిష్ట ముగిశాక ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి 8 వేల మంది అతిథులు హాజరవుతారని అంచనా. వీరిలో కొద్ది మందిని మాత్రమే గర్భాలయంలోకి అనుమతిస్తారు. గణేశ్వర్ శాస్త్రి ద్రవిడ్ ఆధ్వర్యంలో 121 మంది అచార్యులు ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రధాన ఆచార్యుడిగా కాశీకి చెందిన లక్ష్మీకాంత్ దీక్షిత్ వ్యవహరించబోతున్నారు. అయోధ్యలో సోమవారం ప్రాయశ్చిత్త, కర్మకుటీ పూజ నిర్వహించారు.

56 రకాల ఆగ్రా పేఠాలు

ఆగ్రా పేఠ.. ఉత్తర భారతీయులకు చాలా ఇష్టమైన మిఠాయి. బూడిద గుమ్మడి కాయ, చక్కెర పాకంతో ఈ పేఠాలు తయారు చేస్తారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ట జరుపుకోనున్న బాలరాముడికి ఆగ్రా పేఠాలను నివేదించబోతున్నారు. ఇందుకోసం ఏకంగా 56 రకాల పేఠాలను సిద్ధం చేశారు. ఇవి మంగళవారం అయోధ్యకు చేరుకున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆగ్రాకు చెందిన పంచీపేఠ అనే మిఠాయిల దుకాణం వీటిని తయారు చేసి పంపించింది. అలాగే అదనంగా 560 కిలోల పేఠాలను సైతం ఆగ్రా ట్రేడ్ బోర్డు ద్వారా పంపింది. వీటిని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టే అవకాశం ఉంది. అలాగే రత్నాలు కూర్చిన పట్టు వస్త్రాలు, వెండి పళ్లేలు, ఇతర పూజా సామగ్రి సైతం వేర్వేరు ప్రాంతాల నుంచి అయోధ్యకు చేరుకున్నాయి.



గుజరాత్ నుంచి తెచ్చిన 108 అడుగుల అగరొత్తికి మొక్కుతున్న భక్తులు



భారీ అగరొత్తిని వెలిగిస్తున్న మహంత్ నృత్య గోపాల్ దాస్

108 అడుగుల అగరు బత్తి వెలిగించారు

గుజరాత్ నుంచి అయోధ్యకు పంపించిన 108 అడుగుల పొడవైన అగరు బత్తిని శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు మహంత్ నృత్యగోపాల్ దాస్ మంగళవారం వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులు జైశ్రీరామ్ అంటూ జపించారు. దాదాపు 40 రోజుల దాకా ఈ అగరు బత్తి వెలుగుతూనే ఉంటుంది. 3,610 కిలోల బరువు, మూడున్నర అడుగుల వెడల్పు ఉన్న ఈ అగరు బత్తి సువాసన 50 కిలోమీటర్ల వరకు వ్యాపిస్తుందని తయారీదారులు చెప్పారు. భారీ అగరు బత్తిని ఆవు పేడ, నెయ్యి, సుగంధ తైలాలు, పూల రెక్కలు, ఔషధ మూలికలతో తయారు చేశారు.



శ్రీరామజన్మభూమి ఆలయం గర్భగుడి ద్వారం

సరయూ నదిలో సౌర విద్యుత్ పడవ

అయోధ్య నగరాన్ని మోడల్ సోలార్ సిటీకి అభివృద్ధి చేయాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులోభాగంగా సౌర విద్యుత్‌కు పెద్ద పీట వేయబోతోంది. అయోధ్యలో సరయూ నదిలో సౌరవిద్యుత్‌తో నడిచే పడవలను ప్రవేశ పెట్టేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలి పడవను ఈ నెల 22న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించబోతున్నారు. ఇండియాలో ఇదే తొలి సౌరవిద్యుత్ పడవ కావడం గమనార్హం. అయోధ్య పర్యాటకులు సరయూ నదిలో ఇలాంటి పడవల్లో విహరించవచ్చు. నయా ఘాట్ నుంచి ఈ పడవలు రాకపోకలు సాగిస్తాయి. ఒక్కో బోట్‌లో ఒకేసారి 30 మంది ప్రయాణించవచ్చు. ఫైబర్‌గ్లాస్‌తో తయారు చేయడంతో తేలిగ్గా ఉంటాయి. శబ్దం రాదు. పూర్తిగా పర్యావరణ హితం.

ప్రాణప్రతిష్టలో సంప్రదాయ సంగీత మధురిమలు

రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట సందర్భంగా అయోధ్యలో భారతీయ సంప్రదాయ సంగీతం అతిథులను అలరించబోతోంది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి సంప్రదాయ సంగీత కళాకారులను రప్పిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్, అస్సాం, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తమిళనాడు, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల నుంచి నుంచి కళాకారులు రాబోతున్నారు. ఇప్పటికే వారిని తీర్థ క్షేత్ర ట్రస్టు ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఘటము వాయిద్యానికి స్థానం కల్పించారు. ఈ నెల 22న జరిగే అపూర్వ వేడుకలో కళాకారులు తమ సంగీత ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పఖవాజ్, తమిళనాడుకు చెందిన మృదంగం వంటి వాయిద్యాలు ప్రదర్శన ఉంటుంది. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవంలో భిన్నరకాల వాయిద్యాలను ఒకేచోట తిలకించవచ్చు. భారతీయ సంప్రదాయ సంగీత మధురిమలను మనసారా ఆస్వాదించవచ్చు. ఇదిలా ఉండగా, ప్రాణప్రతిష్ట ముగిసిన తర్వాత ఈ నెల 23 నుంచి సామాన్య ప్రజలకు బాలరాముడి దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ నెల 26 తర్వాత ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు విడతలవారీగా దర్శించుకొనేలా షెడ్యూల్ రూపొందించారు. వారి దర్శనాలు ఫిబ్రవరి ఆఖరు దాకా కొనసాగుతాయి. అతిథుల కోసం బస ఏర్పాట్లు చేస్తున్నారు.

గాయని చిత్రపై ట్రోలింగ్

తిరువనంతపురం: జాతీయ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత గాయని కేఎస్ చిత్ర ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురవుతున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభ ఉత్సవాన్ని స్వాగతిస్తూ ఒక వీడియోను రెండు రోజుల క్రితం ఆమె సోషల్ మీడియాలో పోస్టు చేయడమే ఇందుకు కారణం. ఈ నెల 22న ఆలయ ప్రాణప్రతిష్ట సందర్భంగా ప్రజలంతా శ్రీరామ జయరామ జయ జయ రామ అనే రామమంత్రం జపించాలని, సాయంత్రం ఇళ్లల్లో ఐదు దీపాలు వెలిగించాలని చిత్ర పిలుపునిచ్చారు. ప్రజలందరికీ భగవంతుడి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. 'లోకస్సమస్త సుఖినోభవంతు' అంటూ తన సందేశాన్ని ముగించారు. అయితే, ఈ వీడియో సందేశంపై సోషల్ మీడియాలో పలువురు విమర్శలు చేస్తున్నారు. ఒక మతానికి మద్దతు ఇవ్వడం, దాన్ని ప్రచారం చేయడం, అయోధ్య రామ మందిరానికి ప్రాచుర్యం కల్పించడం తప్పు అంటూ ఆక్షేపిస్తున్నారు. మరోవైపు చిత్రకు మద్దతు వెల్లువెత్తుతోంది. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, గాయనీ గాయకులు, రచయితలు, వివిధ వర్గాల ప్రజలు ఆమెకు అండగా నిలుస్తున్నారు. అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు చిత్రకు ఉందని తేల్చిచెప్పారు. ట్రోలింగ్ చేసేవారి పట్ల మండిపడుతున్నారు. చిత్రకు కేరళకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. చిత్ర ఇచ్చిన సందేశాన్ని వివాదాస్పదం చేయొద్దని హితవు పలికారు. రాముడి పట్ల విశ్వాసం ఉన్నవారు ఆయనను పూజిస్తారని, అందులో తప్పేముందని చిత్రకు మద్దతుగా పలువురు నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ సుందర్ సైతం చిత్రకు మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్టు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అసహనం పెరిగిపోతోందని ఆరోపించారు.

రామ్‌లల్లా విగ్రహం ఖరారు

మైసూర్: అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించబోయే రామ్‌లల్లా విగ్రహాన్ని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఖరారు చేసింది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ రూపొందించిన ప్రతిమకు ఆ మహద్భాగ్యం దక్కనుంది. ఈ నెల 22న గర్భాలయంలో విగ్రహం ప్రాణప్రతిష్ట జరుపుకోనుంది. అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించడానికి మూడు విగ్రహాలను చెక్కించారు. వీటిలో అరుణ్ యోగిరాజ్ చెక్కిన శిల్పాన్ని ఎంపిక చేశారు. ఈ విగ్రహం ఐదేళ్ల బాలరాముడి రూపంలో ఉందని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. నిల్చున్న రూపంలోనే విగ్రహాన్ని తయారు చేయించామని చెప్పారు. రామ్‌లల్లా విగ్రహాన్ని ఈ నెల 18వ తేదీన గర్భాలయంలోని ఆసనంపైకి చేరుస్తామని వెల్లడించారు. బాలరాముడి విగ్రహాన్ని తయారు చేయడానికి ఎంతగానో శ్రమించారని, ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని అరుణ్ యోగిరాజ్ కుటుంబ సభ్యులు మంగళవారం చెప్పారు. రామ్‌లల్లా విగ్రహాన్ని చెక్కుతుండగా గాయం వల్ల ఆయనకు కంటి నొప్పి వచ్చిందని అన్నారు. యోగిరాజ్ రూపొందించిన శిల్పాన్ని తీర్థ క్షేత్ర ట్రస్టు ఎంపిక చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మహాకార్యం కోసం దేవుడు తన భర్తను ఎన్నుకొని ఉండొచ్చని యోగిరాజ్ భార్య విజేత అన్నారు. ఇది తమకు మర్చిపోలేని రోజు అని యోగిరాజ్ సోదరుడు సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. వార్త తెలిసిన తర్వాత తమకు చెప్పలేనంత ఆనందంగా ఉందని ఆయన తల్లి సరస్వతి అన్నారు. అరుణ్ యోగిరాజ్ గొప్ప శిల్పిగా ప్రఖ్యాతిగాంచారు. కేదార్‌నాథ్‌లో ప్రతిష్ఠించిన ఆది శంకరాచార్య, ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద నెలకొల్పిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను ఆయనే రూపొందించారు.

కునో పార్కులో మరో చీతా మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో శౌర్య అనే చీతా మంగళవారం చనిపోయింది. ఈ విషయాన్ని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి నగర్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. మృతికి కారణాలు పోస్టు మార్టం నివేదిక అందాకే తెలుస్తాయన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో శౌర్య అనే మగ చీతా సరిగ్గా నడవడం లేదని అధికారులు గుర్తించారు. మత్తు ఇచ్చి, సమస్యను గుర్తించే ప్రయత్నం చేస్తుండగానే సాయంత్రం 3.17 గంటల సమయంలో చీతా తుదిశ్వాస విడిచిందన్నారు. 2022లో నమీబియా నుంచి చీతాలను తీసుకు వచ్చిన తర్వాత సంభవించిన 10వ మరణమని ఆయన అన్నారు. 2023 మార్చి తర్వాత శౌర్య సహా ఏడు చీతాలు, మూడు కూనలు వివిధ కారణాలతో చనిపోయినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కునో పార్కులో 6 మగ, 7 ఆడ, 4 కూనలు కలిపి మొత్తం 17 చీతాలున్నాయన్నారు.

జపాన్ ఎయిర్‌పోర్టులో మరో ప్రమాద ఘటన

టోక్యో: జపాన్‌లో మరో విమాన ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కొరియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం రన్‌వేపైకి వెళ్లే క్రమంలో నిలిపి ఉన్న క్యాథే పసిఫిక్ విమానాన్ని ఢీకొట్టింది. జపాన్‌లోని న్యూ చిటోజ్ విమానాశ్రయంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. రెండు వారాల క్రితం హనేడా ఎయిర్‌పోర్టులో జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం, కోస్టు గార్డ్ విమానం ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఘటనలో కోస్టు గార్డ్ విమానంలోని ఆరుగురు సిబ్బందిలో అయిదుగురు సజీవ దహనమైన విషయం తెలిసిందే. మంగళవారం కొరియా ఎయిర్‌లైన్స్ విమానం 289 మంది ప్రయాణికు లతో పార్కింగ్ స్థలం నుంచి టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వే వైపుగా వెళుతోంది. ఆ క్రమంలో పక్కనే నిలిపి ఉన్న క్యాథే పసిఫిక్ విమానానికి ఎడమ వైపు రెక్క ఢీకొట్టింది.

మధుర షాహీ ఈద్గా మసీదులో సర్వేపై సుప్రీం స్టే

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వు అమలును నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో శ్రీకృష్ణ జన్మభూమి సమీపంలో ఉన్న షాహీ ఈద్గా మసీదులో శాస్త్రీయ సర్వేను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానంలో పర్యవేక్షణలో శాస్త్రీయ సర్వేకు అనుమతి ఇస్తూ అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 23లోగా స్పందన తెలియజేయాలని హిందూ సంఘాలను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

తొలి ప్రైమరీలో ట్రంప్‌దే గెలుపు

- అత్యధికంగా 51 శాతం ఓట్లు కైవసం
- సత్తా చాటలేకపోయిన మరో అభ్యర్థి వివేక్ రామస్వామి
- అధ్యక్ష అభ్యర్థి రేసు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన



అయోవాలో జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో ట్రంప్ అభివాదం

వాషింగ్టన్: అమెరికా పార్లమెంట్‌పై దాడికి ఉసిగొల్పాడన్న ఆరోపణలు, నీలిచిత్రాల తారతో అనైతిక ఆర్థిక లావాదేవీ, పదుల కొద్దీ కేసుల ఉదంతాలు వెలుగుచూసినా.. రిపబ్లికన్ పార్టీలో మెజారిటీ కార్యకర్తలు ఇంకా డొనాల్డ్ ట్రంప్ వెంటే ఉన్నారని రుజువైంది. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం అయోవా రాష్ట్రంలో జరిపిన ప్రైమరీ ఎన్నికల్లో తోటి అభ్యర్థులందరినీ వెనక్కి నెట్టి మాజీ దేశాధ్యక్షుడు ట్రంప్ అత్యధిక ఓట్లను కైవసం చేసుకుని ఘన విజయం సాధించారు. దీంతో రాష్ట్రాలవారీగా జరిగే ఈ ఎన్నికల్లో తొలి రాష్ట్రంలోనే ట్రంప్ బోణీ కొట్టడం రాజకీయ విశ్లేషకులనూ ఆశ్చర్యానికి గురిచేసింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ఎన్నికల్లో ట్రంప్‌కు 51 శాతం ఓట్లు ఒడిసిపట్టారు. గట్టి పోటీదారుగా అందరూ భావించిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీశాంటిస్‌కు 21.2 శాతం ఓట్లు పడ్డాయి. ఐక్యరాజ్యసమితి మాజీ రాయబారి, సౌత్ కరోలీనా మాజీ మహిళా గవర్నర్ నిక్కీ హేలీకి 19.1 శాతం ఓట్లు వచ్చాయి. భారతీయ మూలాలున్న అమెరికన్ వ్యాపారవేత్త, సంపన్నుడు వివేక్ రామస్వామి ఈ రేసులో ప్రభావం చూపలేకపోయారు. ఆయనకు కేవలం 7.7 శాతం ఓట్లు పడ్డాయి. సగానికిపైగా ఓట్లు సాధించి నిర్ణయాత్మక రాష్ట్రంలో గెలుపు ద్వారా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ తరఫున ప్రధాన అభ్యర్థి తానేనని ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. అయోవా రాష్ట్ర చరిత్రలో ఒక అభ్యర్థి ఇంతటి భారీ మెజారిటీతో గెలవడం ఇదే తొలిసారి. ఓట్ల పరంగా చూస్తే మరో అభ్యర్థి అసా హచిన్‌సన్‌కు కేవలం 191 ఓట్లు, ఇంకో అభ్యర్థి క్రిస్ క్రిస్టీకి 35 ఓట్లు పడ్డాయి. అత్యల్ప ఓట్లు సాధించడంతో తాను ఈ పోటీ నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు అర్కన్సాస్ మాజీ గవర్నర్ అసా హచిన్‌సన్ ప్రకటించారు. ఈసారి మొత్తంగా 1,10,000 మంది ఓట్లు వేశారు. ఈ రాష్ట్రంలో ఇంత తక్కువగా ఓటింగ్ జరగడం గత 20 ఏళ్లలో ఇదే తొలిసారి.

ఇక ట్రంప్‌కే నా మద్దతు: వివేక్ రామస్వామి

అయోవా ప్రైమరీ ఎన్నికల్లో తక్కువ ఓట్లలో నాలుగో స్థానానికి పరిమితమైన భారతీయ వ్యాపారి వివేక్ రామస్వామి ఇక ఈ రేసు నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. '' ఈ రాష్ట్ర ప్రైమరీలో ఆశ్చర్యకర ఫలితాలను ఆశించి భంగపడ్డా. ఇక ప్రచారానికి స్వస్తి పలుకుతున్నా. అధ్యక్షుడినయ్యే మార్గమే లేదు. ఇక నా మద్దతు ట్రంప్‌కే'' అని తన మద్దతుదారుల సమక్షంలో వివేక్ మాట్లాడారు.

ద.కొరియా మన శత్రువు

- అలా రాజ్యాంగ సవరణ చేయండి
- ఉన్నతాధికారులకు ఉ.కొరియా నియంత కిమ్ ఆదేశం

సియోల్: గతంలో ఉత్తరకొరియా నేతలు దక్షిణకొరియా, ఉత్తరకొరియాలను కలిపేందుకు పునరేకీకరణ పనుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వసంస్థలను శాశ్వతంగా మూసేయాలని ఉ.కొరియా నియంత కిమ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం ఉ.కొరియా పార్లమెంట్ అయిన సుప్రీం పీపుల్స్ అసెంబ్లీలో కిమ్ ప్రసంగం వివరాలను అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. '' అమెరికా, జపాన్‌ల అండతో కయ్యానికి కాలు దువ్వుతున్న దక్షిణ కొరియాతో స్నేహబంధం అనే మాటే లేదిక. దక్షిణ కొరియాతో స్నేహబంధం అనే భావనను రాజ్యాంగం నుంచి తొలగించండి. పునరేకీకరణ, సయోధ్యను ప్రోత్సహిస్తూ అందుకు ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వ సంస్థలను మూసేయండి. దక్షిణకొరియాను శత్రుదేశంగా ప్రకటించండి. యుద్ధాన్ని మేం కోరుకోవట్లేదు. తప్పని పరిస్థితి ఎదురైతే యుద్ధానికి దిగుతాం'' అని పార్లమెంట్‌సభ్యులకు కిమ్ ఆదేశాలిచ్చారు.

రైల్వే బంధం తెంపేద్దాం, స్మారకం కూల్చేద్దాం

కిమ్ ఆదేశాల మేరకు కమిటీ ఫర్ ది పీస్‌ఫుల్ రీయూనిఫికేషన్, నేషనల్ ఎకనమిక్ కోఆపరేషన్ బ్యూరో, ఇంటర్నేషనల్ టూరిజం అడ్మినిస్ట్రేషన్ సంస్థలను మూసేయనున్నారు. '' ద.కొరియా, అమెరికాల సంయుక్త సైనిక విన్యాసాలు, అమెరికా వ్యూహాత్మక సైనిక బలగాల మొహరింపు, ద.కొరియా, అమెరికా, జపాన్‌ల త్రిముఖ భద్రతా సహకారం.. కొరియా ద్వీపకల్పాన్ని యుద్ధం అంచుకు నెట్టుకుపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ద.కొరియాతో స్నేహం, సహకారం అసంభవం. ద.కొరియా, ఉ.కొరియాల మధ్య ఉన్న రైల్వే రైళ్లను మూసేయండి. ప్యాంగ్యాంగ్‌లోని పునరేకీకరణ స్మారకాన్ని కూల్చేయండి'' అని కిమ్ ఆదేశాలిచ్చారు. ' ద్వీపకల్పంలో అణు యుద్ధం మొదలైతే ద.కొరియాను ఈ భూపటంపై లేకుండా చేస్తాం. అమెరికా కనీవినీ ఎరుగని అపార నష్టాన్ని చవిచూస్తుంది' అని కిమ్ హెచ్చరించారు. దీనిపై ద.కొరియా స్పందించింది. '' అతను జాతి వ్యతిరేకి. చరిత్రను ఒప్పుకోని మనిషి. కవ్వింపు చర్యలకు దిగితే అంతకు మించి సైనిక చర్యలతో మట్టికరిపిస్తాం''అని ద.కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ మంగళవారం కేబినెట్ భేటీలో అన్నారు.

హాజరవడం కష్టమే

- 'ప్రాణప్రతిష్ఠ'ను బీజేపీ రాజకీయ వేదికగా మార్చేసింది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



కోహిమాలో స్థానికులతో రాహుల్

చిఫొబొజౌ(నాగాలాండ్): అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ఠ క్రతువు ఎన్నికల రంగులద్దుకుని 'నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్–బీజేపీ' ఫంక్షన్‌గా ముస్తాబవుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం సాయంత్రం నాగాలాండ్‌లోకి అడుగుపెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారం సైతం వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారుల నడుమ కొనసాగింది. యాత్రను ముందుండి నడిపిస్తున్న రాహుల్ గాంధీ మంగళవారం రాష్ట్ర రాజధాని కోహిమాలో కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి అందిన ఆహ్వానాన్ని తమ పార్టీ అగ్రనేతలు సున్నితంగా తిరస్కరించడాన్ని ఆయన గట్టిగా సమర్థించారు. '' మందిరం ప్రారంభోత్సవానికి కాంగ్రెస్, విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీల నేతలు ఎవరు వెళ్లినా నేను మనసారా స్వాగతిస్తా. కానీ ఇప్పుడు ఆ కార్యక్రమం మొత్తం మోదీ, ఆర్ఎస్ఎస్ కేంద్రంగా తయారైంది. చక్కని వేడుకను ఆర్ఎస్ఎస్, బీజేపీలు రాజకీయ వేడుకగా మార్చేశాయి. అందుకే ఈ కార్యక్రమానికి వెళ్లొద్దని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియా గాంధీ భావించి ఉంటారు. కాంగ్రెస్ పార్టీకి అన్ని మతాలు, సంప్రదాయాలు సమానమే. 22న అయోధ్య జరిగే కార్యక్రమం.. రాజకీయ ఉత్సవంలా మారిందని స్వయంగా కొందరు హిందూ మత పెద్దలే బహిరంగంగా విమర్శించారు. ఇలా కొత్తరూపును సంతరించుకున్న ఈ కార్యక్రమానికి మేం వెళ్లడం కష్టం. అసాధ్యం కూడా'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ''ఇండియా కూటమి బలంగా ఉంది, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తుంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీతో సీట్ల పంపకం విషయంలో నెలకొన్న విభేదాలు సమసి పోతాయి'' అని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు.

దొంగతనం ఉదంతంలో న్యూజిలాండ్ మహిళా ఎంపీ రాజీనామా

వెల్లింగ్టన్: దుకాణాల్లో వస్తువులు దొంగలించిందన్న ఆరోపణలపై న్యూజిలాండ్ మహిళా ఎంపీ గోలిజ్ గ్రాహమన్ తన ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆక్లాండ్, వెల్లింగ్టన్ నగరాల్లోని బొటిక్, షాపింగ్‌మాల్‌లో మూడు సార్లు దొంగతనానికి పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. షాపింగ్‌మాల్‌లో అత్యంత ఖరీదైన హ్యాండ్‌బ్యాగ్, డ్రెస్‌ను ఆమె దొంగలిస్తున్న సీసీటీవీ ఫుటేజీలు బహిర్గతం కావడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. పోలీసు దర్యాప్తు కొనసాగుతుండటంతో గోలిజ్ తన ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన చర్యకు బేషరతు క్షమాపణలు చెప్పారు. గతంలో ఆమె మానవహక్కుల కేసులు వాదించే లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. తర్వాత రాజకీయాల్లో చేరి గ్రీన్ పార్టీ తరఫున ఎంపీగా గెలిచారు. ఇరాన్ నుంచి వలసవచ్చి 2017 సంవత్సరంలో న్యూజిలాండ్‌లో ఎంపీ అయిన తొలి వలస వ్యక్తిగా రికార్డులకెక్కారు.

డీప్ ఫేక్‌కు గురైన సచిన్ టెండూల్కర్

సాక్షి, న్యూఢిల్లీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ డీప్ ఫేక్ బారిన పడ్డారు. ఓ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ కోసం ఆయన ప్రచారం చేస్తున్నట్లుగా ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశాడు. 'స్కైవార్డ్ ఏవియేటర్ క్వెస్ట్'యాప్‌లో నా కుమార్తె గేమ్ ఆడుతుంది. ఈ గేమ్ ద్వారా రోజుకు 2100 డాలర్లు సంపాదిస్తోంది. చాలా మంది ఈ యాప్ ద్వారా గేమ్ ఆడి డబ్బు సంపాదిస్తున్నారు'అంటూ ఓ వీడియో ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. దీనిపై సచిన్ టెండూల్కర్ సోమవారం స్పందించారు. డీప్ ఫేక్‌ల వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వాల నుంచి సత్వర చర్యలు చాలా కీలకం'అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌లతో పాటు మహారాష్ట్ర సైబర్ క్రైంలకు ఆయన ట్యాగ్ చేశారు. సచిన్ ట్వీట్‌పై మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. ఏఐ, డీప్ ఫేక్ వంటి వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు త్వరలోనే పటిష్టమైన ఐటీ చట్టాలను అమల్లోకి తీసుకోస్తున్నట్లు పేర్కొన్నారు.

వార్‌రూంలు ఏర్పాటు చేసుకోండి

న్యూఢిల్లీ: పొగమంచుతో విమానాల రాకపోకలకు అంతరాయం కలగడంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరిన్ని చర్యలు ప్రకటించారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా విమానాశ్రయాల అధికారులు రోజులో మూడు దఫాలుగా విమానాల రాకపోకలకు సంబంధించిన నివేదికలు పంపాలని ఆదేశించారు. ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసం వార్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని ఎయిర్‌పోర్టులను, విమానయాన సంస్థలను ఆయన కోరారు. విమానాశ్రయాల్లో రోజంతా సరిపోను సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పొగమంచుతో విమానాలు ఆలస్యంగా నడుస్తుండటంతో ఢిల్లీలో ఇండిగో పైలట్‌పై విమాన ప్రయాణికుడి దాడి, ముంబై ఎయిర్‌పోర్టులోని టర్మాక్‌పై గోవా–ఢిల్లీ ఇండిగో విమాన ప్రయాణికుల బైఠాయింపు వంటి ఘటనలు ఇటీవల నమోదు కావడంతో మంత్రి సింధియా ఈ మేరకు చర్యలను ప్రకటించారు.


ప్రధాని మోదీ డిగ్రీ వివాదం.. సుప్రీం కోర్టులో ఆప్ నేతలకు ఊరట

ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ విద్యార్హతపై ఆప్ నేతలు చేసిన వ్యాఖ్యలకు గాను గుజరాత్ కోర్టులో పరువునష్టం కేసు విచారణపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ కేసును గుజరాత్ వెలుపలికి, ముఖ్యంగా కోల్‌కతాలోని కోర్టుకు బదిలీ చేయాలంటూ ఆప్ నేత సంజయ్ సింగ్ వేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారించింది. మెట్రో పాలిటన్ కోర్టు జారీ చేసిన సమన్లను కొట్టివేయాలంటూ ఆప్ నేతలు కేజ్రీవాల్, సంజయ్ సింగ్ వేసిన పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని గుజరాత్ హైకోర్టును ధర్మాసనం కోరింది. అప్పటి వరకు ట్రయల్ కోర్టులో పరువు నష్టం కేసుపై స్టే కొనసాగుతుందని పేర్కొంది.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన ఏపూరి బిందు ప్రియ కుటుంబం రూ.1,11,207 విరాళం సమర్పించింది.



నృసింహుని పార్వేట మహోత్సవం

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి మంగళవారం పార్వేట మహోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని మేళతాళాలు, కనక తప్పెట్లతో వైభవంగా ఊరేగించారు.



పెనమలూరు గడ్డ.. వైఎస్సార్ సీపీ అడ్డా

పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసి జగనన్నను మళ్లీ సీఎం చేస్తామని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆయన సోమవారం పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించారు. -8లో▸

న్యూస్‌రీల్

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి భక్తులు తరలివచ్చారు. సంక్రాంతి నేపథ్యంలో మూడు రోజులు దుర్గమ్మ సన్నిధికి భక్తులు పోటెత్తారు. సర్వ దర్శనం, రూ.500 అంతరాలయ దర్శనం మినహా మిగిలిన రూ.100, రూ.300 క్యూలైన్లలో సాధారణ రద్దీ కనిపించింది. సంక్రాంతి రద్దీ మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. సోమ, మంగళవారాలు ఉదయం తొమ్మిది గంటల వరకు సాధారణ రద్దీ కనిపించగా, ఆ తర్వాత భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. సర్వ దర్శనం, రూ.500 అంతరాలయ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల అనంతరం భక్తుల రద్దీ కాస్త పెరిగింది.

టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కనుమ పండుగ సందర్భంగా పడమట గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో మంగళవారం గోపూజ నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త యద్దనపూడి సుబ్రహ్మణ్య శాస్త్రి ఈ కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు. ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గోమాతకు విశిష్ట స్థానం ఉందన్నారు. గో సేవ, గో పూజ వల్ల సర్వపాపాలు హరిస్తాయన్నారు. టీటీడీ ఒంగోలు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల దేవాలయాల సూపరింటెండెంట్ మేడారపు కాంతికుమార్ మాట్లాడుతూ.. టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గోశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ దేవాలయాల ఆధ్యాత్మిక వేత్త మంగిపూడి వెంకటశాస్త్రి భారతీయ పురాణాల్లో గోవు ప్రస్తావన అంశంగా ప్రసంగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గో పూజను నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె. ప్రసాద్ పాల్గొన్నారు.

మూడు రోజులపాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ఇక నుంచి మూడు రోజుల పాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీని మంగళవారం ఆయన పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ నిన్నటి వరకు మంగళ, శుక్ర వారాల్లోనే ఉండేదని ఇక నుంచి మంగళ, గురు, శనివారాల్లో ఉంటుందని ఆయన చెప్పారు. ఈ విభాగానికి ప్రతి ఓపీకి 80 నుంచి వంద మంది వరకు రోగులు వస్తున్నారని చెప్పారు. అందు వల్ల రోజు మార్చి రోజు ఓపీ అందుబాటులో ఉంచాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఊపిరి తిత్తుల ఓపీని కూడా ఉంచాలని నిర్ణయించినట్టు చెప్పారు. మూడు రోజులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మూడు రోజులు ఊపిరితిత్తులు ఓపీ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ఆయన వెంట గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్ఓడీ డాక్టర్ కవిత, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 521.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి కుడి కాలువకు 4,940, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 15,580, ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 826.90 అడుగుల వద్ద ఉంది.

కోడి పందేల సందడి



అంపాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బరి

ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు సంక్రాంతి పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకొన్నారు. ఎడ్ల పోటీలు, కోడి పందేలతో సందడి చేశారు. కంకిపాడు, గొడవర్రు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, అంపాపురం తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా బరులు ఏర్పాటు చేసి పండుగ సంప్రదాయంగా కోడిపందేలు నిర్వహించారు. ప్రజలు ఈ బరులను సందర్శించి కోడిపందేలను తిలకించారు. బరుల వద్ద సందర్శకుల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పందెంలో తలపడుతున్న కోళ్లు

ఒడిబడిగా అభివృద్ధి



కంకిపాడు ఆదర్శ పాఠశాల నాడు



కంకిపాడు ఆదర్శ పాఠశాల నేడు

నాడు దైన్యం.. నేడు ధన్యం

- నందనవనాల్లా ప్రభుత్వ పాఠశాలలు
- మనబడి నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- తొలి రెండు విడతల్లో రూ.1,114 కోట్లతో 829 స్కూళ్లలో అభివృద్ధి పనులు
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారీ పాఠశాలలు

సాక్షి, మచిలీపట్నం: ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన బడి నాడు–నేడుతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారీ బడులు ఆధునికతను సంతరించుకున్నాయి. నాడు కూలి పనులకు వెళ్లే పేదలు సైతం ఆర్థికంగా భారమైనా పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపేవారు. నేడు మధ్య తరగతి ఆపై కుటుంబాల వారు సైతం పిల్లలను ప్రైవేటు స్కూళ్లు మాన్పించి మరీ ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. 2019కి ముందు అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయిన మైదానం, గోడలపై పేరుకున్న దుమ్ము, విరిగిన వాకిళ్లు, కిటికీలు, పెచ్చులూడిన పైకప్పులు, నీటి వసతి లేని మరుగుదొడ్లతో ప్రభుత్వ పాఠశాలలు దైన్యంగా ఉండేవి. పిల్లలు కూర్చునేందుకు బెంచీలు, సైన్స్ ల్యాబ్‌లు ఉండేవి కావు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. విద్యార్థులను ఆకట్టుకునేలా గోడలపై రంగురంగుల బొమ్మలు, ప్రాంగణంలో పూల మొక్కలు, ఆట వస్తువులు, నిరంతర నీటి వసతితో మరుగు దొడ్లు, ఆధునిక తరగతి గదులు వంటి సకల సౌకర్యాలతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఆధునికతను సంతరించుకున్నాయి. సమకూరిన వసతులు, ఉచితంగా ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి రావడంతో 98 శాతం పాఠశాలలు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. పలు చోట్ల 'నో సీట్' బోర్డులు పెట్టే స్థాయికి చేరుకున్నాయి.

తొలి రెండు విడతల్లో ఇలా..

కృష్ణా జిల్లాలో మనబడి నాడు –నేడు కార్యక్రమాన్ని ప్రభుత్వం 2020లో తీసుకొచ్చింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొదటి విడతలో 341 పాఠశాలలు ఎంపిక చేసి, రూ.953 కోట్ల మంజూరు చేశారు. రెండు విడతలో 441 పాఠశాలలు, 39 అంగన్‌వాడీ కేంద్రాలు, ఎనిమిది జూనియర్ కాలేజీలను ఎంపిక చేశారు. వీటి అభివృద్ధికి రూ.179.81 కోట్లు మంజూరు చేశారు. తరగతి గదులు కొరత ఉన్న 166 స్కూళ్లను గుర్తించి 607 అదనపు గదులను నిర్మిస్తున్నారు.

పనుల పర్యవేక్షణలో తల్లిదండ్రులు

మనబడి నాడు–నేడు పనుల నాణ్యత పర్యవేక్షణకు ప్రభుత్వం తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసింది. ఆయా పాఠశాలల్లో చదివే పిల్లల తల్లులతో పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసి, ఉపాధ్యాయ, అధికారుల పరిశీలనలో పనులు చేయిస్తున్నారు.

మనబడి నాడు నేడు వసతులు ఇలా..

నిరంతర నీటి సరఫరా వసతితో మరుగు దొడ్లు నిర్మించారు. ప్రతి తరగతి గదిలో ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లతో విద్యుద్దీకరణ చేశారు. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం పూర్తిస్థాయిలో ఫర్నిచర్ అందుబాటులోకి తెచ్చారు. ప్రతి తరగతి గదిలో గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల గోడలపై ఆకర్షణీయంగా, ఆలోచనాత్మక పెయింటింగ్‌లు వేయించారు. పాఠశాలకు ప్రహరీ, వంటకు ప్రత్యేకంగా గదుల నిర్మాణం, ఇంగ్లిష్ లాబ్, టెక్నో విద్యకు వసతులు కల్పించారు.



పాఠశాల మరుగుదొడ్లు నాడు



మరుగుదొడ్లు నేడు

రూపు రేఖలు మారాయి



ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలు మారాయి. మేము స్కూళ్లలో చదువుకునే రోజుల్లో కనీస సౌకర్యాలు లేవు. టీచింగ్ బోర్డులు సరిగా ఉండేవి కావు. గదుల డోర్లు ఊడిపోయి, విరిగిపోయి ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన మన బడి నాడు–నేడు ద్వారా ఎంతో అభివృద్ధి చెందాయి. టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. టైల్స్, కుళాయిలు, మంచి నీటి వసతులు, చీటింగ్ బోర్డు, కాంపౌండ్ వాల్స్, గోడలపై రంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా చేశారు.

– తోకల గౌతం, డిగ్రీ విద్యార్థి, మచిలీపట్నం

కార్పొరేట్ స్కూళ్లను మరిపించేలా..



మనబడి నాడు–నేడులో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాలలు అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ స్కూళ్లను మరిపించేలా ఉన్నాయి. ఒకప్పుడు విద్యార్థులకు అత్యవసరమైన తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, టాయిలెట్లు ఉండేవి కావు. ఆరు బయటే ఉండి చదువుకోవాల్సిన పరిస్థితి. నాడు – నేడుతో రూపు రేఖలు మారిపోయాయి. ప్రభుత్వ చర్యలతో ప్రతి పాఠశాలా సుందరంగా రూపొందింది.

– తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

వైభవంగా సామూహిక పాదపూజలు



గోసవీడులో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న పిల్లలు

గంపలగూడెం(తిరువూరు): మాతాపిత పాద సేవ మాధవ సేవేనన్న చందంగా తల్లిదండ్రులకు పిల్లల సామూహిక పాదపూజ కార్యక్రమం గంపలగూడెం మండలం గోసవీడులో సోమవారం నిర్వహించారు. మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నాళ్లా చిన్న సత్యంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా అర్చక బృందం ఆర్య వైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు జరిపారు. అనంతరం నిర్వహించిన పాదపూజా కార్యక్రమంలో 196 మంది దంపతులకు(తల్లిదండ్రులకు) వారికి కల్గిన సంతానం పాదపూజ చేసింది. సుదూర ప్రాంతం నుంచి కుమారులు, కుమార్తెలు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. తల్లిదండ్రులకు చేసే పాదపూజ ప్రత్యేకతను అర్చకులు వివరించారు. తల్లులకు ఆర్య వైశ్య సంఘం మండల శాఖ ద్వారా కన్యకాపరమేశ్వరీ దేవికి సమర్పించిన చీరె, పసుపు కుంకుమ, అమ్మవారి మెమెంటోలను సంఘం అధ్యక్షుడు నాళ్లా చిన్నసత్యంబాబు, వెంకట కృష్ణకుమారి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు రతికంటి రామచంద్రరావు, బొగ్గరపు రాజారావు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు వనమా సూరి, పలువురు ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

జయప్రదంగా ముగిసిన ఎడ్ల పోటీలు



పోటీలో పాల్గొన్న ఎడ్ల జత యజమానులకు జ్ఞాపికను బహూకరిస్తున్న పట్టణ ప్రముఖులు

గుడివాడ టౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), ఆయన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు (చిన్ని) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. గుడివాడలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు రెండు పళ్లు, నాలుగు పళ్లు, ఆరు పళ్లు, సేద్య విభాగం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ప్రతి విభాగంలో రూ.లక్ష నుంచి రూ.5 వేల వరకు తొమ్మిది నగదు బహుమతులను విజేతలకు అందజేశారు. ఆది, సోమవారాల్లో జూనియర్, సీనియర్ విభాగాల పోటీలు నిర్వహించారు.

జూనియర్ విభాగంలో..

ఆదివారం జరిగిన జూనియర్ విభాగంలో మొత్తం ఆరు జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. రోహిన్ బాబు ఎడ్లు మొదటి బహుమతి రూ.70 వేలు, కాకర్ల సురేష్‌బాబు ఎడ్లు రెండో బహుమతి రూ.50 వేలు, పోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు మూడో బహుమతి రూ.40 వేలు, పెద్ది నిఖితా చౌదరి ఎడ్లు నాల్గో బహుమతి రూ.35 వేలు, భావినేని ధర్మికరామ్ చౌదరి, కళ్ల శివారెడ్డి ఎడ్లు ఐదో బహుమతి రూ.30 వేలు, గోపాలం బ్రహ్మయ్య ఎడ్లు ఆరో బహుమతిగా రూ.25 వేలు కైవసం చేసుకున్నాయి.

సీనియర్ విభాగంలో..

చివరి రోజు సోమవారం జరిగిన సీనియర్ విభాగంలో మొత్తం ఏడు జతల ఎడ్లు పోటీలో పాల్గొనగా మొత్తం ఏడు విభాగాల బహుమతులు అందజేశారు. మేకా కృష్ణ మోహన్, లక్కిరెడ్డి నీక్షితా రెడ్డి ఎడ్లు మొదటి బహుమతి రూ.లక్ష, అత్తోట శివ కృష్ణారెడ్డి ఎడ్లు రెండో బహుమతి రూ.80 వేలు, ఎంకేఎం బుల్స్ మేకా కృష్ణ మోహన్‌రెడ్డి ఎడ్లు మూడో బహుమతి రూ.70 వేలు, ప్రగతి రిసార్ట్స్ డాక్టర్ జీబీకే రావ్ ఎడ్లు నాల్గో బహుమతి రూ.60 వేలు, పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లు ఐదో బహుమతి రూ.50 వేలు, గొరిటి రవి తేజేశ్వర్‌రెడ్డి ఎడ్లు ఆరో బహుమతి రూ.40 వేలు, పావులూరి సత్యకృష్ణ అజయ్‌కుమార్ చౌదరి ఎడ్లు ఏడో బహుమతి రూ.30 వేలు గెలుచుకున్నాయి. పోటీల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించిన వల్లభనేని భాను ప్రకాష్, రిఫరీలు సూరపనేని రాధాకృష్ణ, మొవ్వా రమేష్, శ్రీనివాస్‌రెడ్డిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

బ్రదర్ జోసఫ్ తంబి ధన్యుడు

ఉంగుటూరు(గన్నవరం): తన జీవితంలో అద్భుతాలు చేసి, మరణానంతరం కూడా ఎంతో మంది కోరికలు తీరుస్తున్న దైవ సేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి ధన్యుడని బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. పెద అవుటపల్లిలో మూడు రోజులు కొనసాగిన 79వ తంబి వర్ధంతి మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు జోసఫ్ రాజారావు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. కుల, మత భేదాలు లేకుండా అందరినీ ఆదరించిన తంబి ధన్యుడని కొనియాడారు. ప్రతిపాటి రమేష్ నిర్వహణలో పెద అవుటపల్లి గాయక బృందం స్తుతి గీతాలు ఆలపించింది. మధ్యాహ్నం రెండు గంటలకు ఫాదర్ ఇన్నబాబు దివ్య సత్ప్రసాద ఆరాధన నిర్వహించి, తంబి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఐదు గంటలకు తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్, విచారణ ఫాదర్‌లతో కలసి కృతజ్ఞత సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. అనంతరం గురువులను సన్మానించారు. తంబి పేరిట నిర్వహించిన బైబిలు క్విజ్ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మహోత్సవాలు ముగిసినా మంగళవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. మేరీమాత కపూచియన్ ప్రావిన్స్ ప్రొవెన్షియల్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు, విచారణ ఫాదర్లు అభిలాష్, ప్రవీణ్ గోపు తదితరులు పాల్గొన్నారు.



సమష్టి పూజాబలి సమర్పిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు



తంబి సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



ప్రసంగిస్తున్న దోగిపర్తి శంకరరావు

విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు అన్నారు. శారదా కళాసమితి, హనుమంతరాయ గ్రంథాలయం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం నీరజహరి ప్రభల రచించిన నీరజ కథా కదంబం, ఊహల అల్లికలు కవితా సంపుటి ఆవిష్కరణ, పరిచయ సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన శంకరరావు మాట్లాడుతూ సమాజంలో నుంచి వచ్చిన సాహిత్యం కాలానికి నిలుస్తుందన్నారు. కవులు రచయితలు సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలని సూచించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచందు, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద, హనుమంతరాయ గ్రంథాలయం కార్యదర్శి నీలం దుర్గారావు పాల్గొన్నారు. సంగీత కళాకారిణి పాటిబండ్ల మాధురీకృష్ణ అన్నమయ్య కీర్తనలను మధురంగా గానం చేశారు. రచయిత్రిని ఆత్మీయంగా సత్కరించారు.

అద్భుత ఘట్టంలా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడ): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ కార్యక్రమాన్ని చరిత్రలో ఓ అద్భుత ఘట్టంగా నిలిచేలా విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణపై స్థానిక తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జేసీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలి రానున్న 1.35 లక్షల మంది ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఆహ్లాదకర వాతావరణంలో జిల్లా యంత్రాంగం నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. 19వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం మైదానంలో విగ్రహావిష్కరణ చేస్తారని చెప్పారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సచివాలయ కార్యదర్శులు, ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించేందుకు తగిన సిబ్బందిని ఆయా శాఖల నుంచి సమీకరించుకోవాలని ఆదేశించారు. ఏ ప్రాంతం నుంచి వచ్చే బస్సులను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలిపేలా పోలీస్ శాఖ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో నాగేశ్వరరావు, విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆర్డీఓ సాయిబాబు, డ్వామా పీడీ జె.సునీత, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వి.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మకర జ్యోతిని దర్శించుకున్న భక్తులు



అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి గీతా మందిరం వద్ద సోమవారం రాత్రి అయ్యప్పస్వామి మకరజ్యోతిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తొలుత అయ్యప్పస్వామి చిత్రపటాలను ఊరేగించి అనంతరం ప్రత్యేక వేదికపై కర్పూర దీపాన్ని వెలిగించారు. మకర జ్యోతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల శరణఘోషతో శ్రీహనుమద్గీతా మందిరం పరిసరాలు ప్రతిధ్వనించాయి. అమరావతిలో మొదటిసారిగా అయ్యప్పమాల ధరించిన మద్దికామయ్య ప్రారంభించిన ఈ జ్యోతి ప్రజ్వలన 38 సంవత్సరాలుగా వారి వారసులు కొనసాగించటం విశేషం. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సంక్రాంతి కప్- 2024 విజేత చెన్నై

ముగిసిన దక్షిణ భారత స్థాయి క్రికెట్ పోటీలు



మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన 30వ టీ–20 క్రికెట్ టోర్నీ విజేతగా సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు చిక్కోల్ చీతాస్ శ్రీకాకుళం జట్టు హాజరు కాలేదు. మూడో విజేతగా నిలిచిన జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ ఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో సౌత్‌జోన్ సీసీ చెన్నై– జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జట్ల మధ్య ఫైనల్ నిర్వహించారు. మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో 12 ఓవర్లకు అంపైర్లు కుదించారు. టాస్ గెలిచిన సౌత్ జోన్ చెన్నై జట్టు బ్యాటింగ్ తీసుకొని నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. 126 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి కేవలం 114 పరుగులు మాత్రమే చేసింది. దీంతో సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్టు గెలిచి సంక్రాంతి కప్, రూ.3లక్షల నగదు బహుమతిని గెలుచుకుంది. జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు రెండో స్థానంలో నిలిచి షీల్డ్, రూ.2 లక్షలు గెలుచుకోగా మూడో స్థానంలో శ్రీసీసీ చెన్నై జట్ల షీల్డ్, రూ.లక్ష నగదును గెలుచుకున్నారు. అలాగే బెస్ట్ బ్యాటర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ బౌలర్‌లుగా ఎంపికైన క్రీడాకారులకు కప్‌లను అందజేశారు.

తొలుత మూడో స్థానం కోసం మ్యాచ్

ఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య మూడో స్థానానికి పోటీ జరిగింది. తొలుత టాస్ గెలిచి శ్రీసీసీ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన జీసీఈ చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం 172 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన శ్రీసీసీ చెన్నై జట్టు 18 ఓవర్లలో 106 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది.

ప్రజారోగ్యానికి పకడ్బందీ వ్యూహం

- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ వైద్య కార్యక్రమాలు
- జగనన్న ఆరోగ్య సురక్షతో లక్షలాది మందికి వైద్య పరీక్షలు
- ప్రతిరోగిపై ప్రత్యేక శ్రద్ధ చూపడానికి ఆస్కారం
- వినూత్న కార్యక్రమాలతో ప్రజలకు మేలు

జీవనశైలి వ్యాధుల నియంత్రణే లక్ష్యం



ఆరోగ్య సురక్ష శిబిరంలో జీవనశైలి వ్యాధులకు మందులను ఇస్తున్న వైద్య సిబ్బంది

ఇది కదా.. అభివృద్ధి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న పథకాలను ప్రవేశ పెడుతోంది. అనుక్షణ అప్రమత్తంగా ఉంటూ, సకాలంలో వ్యాధులను గుర్తించి, అవసరమైన వైద్యం పొందేలా వైద్య సిబ్బందిని ఇంటింటికీ పంపుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలు ప్రవేశ పెట్టి, ఆయా పథకాల ద్వారా ప్రజల చెంతకే వైద్యులను తీసుకెళ్తోంది. దీంతో తొలిదశలోనే వ్యాధుల నిర్ధారణ జరిగి, వైద్య సేవలు పొందగలుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వైద్యులు సిబ్బంది నియామకాలు పెద్ద ఎత్తున చేపట్టి, సిబ్బంది కొరత లేకుండా చూశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింత విస్తృతం చేయడంతో పాటు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు, వాటి నుంచి టెలీమెడిసిన్ ద్వారా నిపుణులైన వైద్యుల సలహాలు వైద్యం చేస్తూ ప్రతి ఒక్కరికీ సేవలు అందించేలా చూస్తున్నారు.

గ్రామీణ వైద్యం పటిష్టం..

ప్రతి 2,500 వేల మంది జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున జిల్లాలో 257 ఏర్పాటు చేశారు. వాటిలో బీఎస్సీ నర్సింగ్ చేసిన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌తో పాటు, అక్కడ ఏఎన్ఎం, ఆశ, హెల్త్ అసిస్టెంట్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో బీపీ, సుగర్ వంటి పరీక్షలతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో సత్వరమే వైద్య సేవలు అందించేలా అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పాము కాటు, పాయిజన్‌కు గురైనప్పుడు సత్వరమే ఏమి చేయాలనే అంశాలపై కూడా వారికి శిక్షణ ఇవ్వడంతో ప్రాణాపాయం నుంచి తప్పించగలుగుతున్నారు. అంతేకాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడు ద్వారా ఆధునికీకరించారు. అత్యాధునిక లేబొరేటరీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

జగనన్న సురక్ష వరం..

ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణులతో పాటు, పట్టణ ప్రాంత ప్రజలకు వరంలా మారింది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో స్పెషలిస్టు వైద్యులతో శిబిరం నిర్వహించి, అన్ని రకాల పరీక్షలతోపాటు, ఉచితంగా మందులు అందిస్తున్నారు. స్త్రీల గర్భకోశ సమస్యలు, రక్తహీనత వంటి వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ఆరోగ్య కార్యకర్తలు ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

అసాంక్రమిక వ్యాధులపై దృష్టి..

ప్రస్తుతం జీవనశైలి వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వాటిని తొలిదశలో గుర్తించి సకాలంలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇటీవల ఇంటింటి సర్వే చేసి, మధుమేహం, రక్తపోటు, హైపో థైరాయిడ్ వంటి వ్యాధులతో బాధపడే వారిని గుర్తించారు. వారికి సకాలంలో వైద్యం పొందేలా చర్యలు తీసుకున్నారు. జీవనశైలి వ్యాధులున్న వారు కచ్చితంగా మందులు వాడేలా చూసేందుకు వారిని సమీపంలోని పీహెచ్‌సీలకు మ్యాపింగ్ చేశారు. దీంతో ప్రతి పదిహేను రోజులకోసారి నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వారికి పరీక్షలు చేసి మందులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే గుండె, కిడ్నీ, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వ్యాధుల బారిన పడకుండా చూస్తున్నారు.

జిల్లాలో గుర్తించిన జీవనశైలి వ్యాధిగ్రస్తులు	
రక్తపోటు:	84,690 మంది
మధుమేహం:	76,618 మంది
హైపోథైరాయిడ్:	8,320 మంది



ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్పెషలిస్టు వైద్యుడు

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి



మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య కార్యక్రమాలను వందశాతం ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో నిరంతరం కృషి చేస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్షలతో పాటు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, ఇమ్యునైజేషన్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, వైద్య ఆరోగ్యశాఖాధికారి, ఎన్టీఆర్ జిల్లా

వ్యాధులపై అవగాహన ముఖ్యం..



వ్యాధులపై ప్రజల్లో అవగాహన కలిగించడం అనేది చాలా ముఖ్యం. సరైన అవగాహనతోనే మధుమేహం, రక్తపోటు లాంటి వ్యాధులను అదుపులో ఉంచుకోగలుగుతాం. చాలామంది సుగర్ లెవల్స్ పెరిగినప్పటికీ తమకు దుష్ఫలితాలు ఏమీ లేవని నిర్లక్ష్యం చేయడంతో గుండె, కిడ్నీ, మెదడులపై ప్రభావం చూపుతోంది. ఇప్పుడు గ్రామీణ స్థాయిలో వైద్యం పటిష్టం చేయడంతో జీవనశైలి వ్యాధులను అదుపు చేసేందుకు అవకాశం కలిగింది.

– డాక్టర్ ఎం శ్రీకాంత్, మధుమేహ నిపుణుడు

పెనమలూరు గడ్డ.. వైఎస్సార్ సీపీ అడ్డా

- మళ్లీ పార్టీ జెండా ఎగరేస్తాం
- మంత్రి జోగి రమేష్



వీరమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు/ఉయ్యూరు: పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసి జగనన్నను మళ్లీ సీఎం చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. పెనమలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి జోగి రమేష్ సంక్రాంతి పర్వదినమైన సోమవారం తొలిసారిగా పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించి బాధ్యతలు చేపట్టారు. ఉయ్యూరు వీరమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ముదునూరు గ్రామం నుంచి పార్టీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయమే శిరోధార్యమన్నారు. తాను ఈ జిల్లాలోనే పుట్టి పెరిగి, ఈ ప్రాంతంలోనే తిరిగానన్నారు. లోకేష్ లాగా చిత్తూరు నుంచి మంగళగిరి వచ్చి పోటీ చేయటం లేదని చెప్పారు. చంద్రబాబు లాగా నారావారిపల్లి వదిలి కొత్త ప్రాంతం వెతుక్కోవడం లేదన్నారు. నమ్మిన నాయకుడు కోసం వెన్నంటి నడిచేవాడే నమ్మకస్తుడన్నారు. జగనన్నను ప్రతిపక్షాలు విమర్శిస్తే.. ప్రతి విమర్శ చేయలేనప్పుడు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు. మహానేత వైఎస్సార్ తనకు దైవమని, వీఎం రంగా శిష్యరికంలో పెరిగానని, రాజకీయాల్లో అంటూ ఉంటే అది జగనన్నతోనే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, జెడ్పీటీసీ బాకీ బాబు, వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి జంపాన పూర్ణిమ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ నేతలు దేవభక్తుని చక్రవర్తి, కిలారు శ్రీనివాసరావు తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

తెలుగు సాహిత్యపు చైతన్యదీప్తి త్రిపురనేని



త్రిపురనేని రామస్వామి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

విజయవాడ కల్చరల్: తెలుగు సాహిత్యపు చైతన్య దీప్తి త్రిపురనేని రామస్వామి అని సాహితీవేత్త గోళ్ల నారాయణరావు అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్యా కళాక్షేత్రం వద్ద మంగళవారం సాహితీవేత్త త్రిపురనేని రామస్వామి జయంతి, వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయవచ్చని త్రిపురనేని నిరూపించారన్నారు. అరసం జిల్లా బాధ్యులు మోతుకూరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మూఢనమ్మకాలపై త్రిపురనేని పోరాటం చేశారన్నారు. అరసం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ మాట్లాడుతూ త్రిపురనేని సాహిత్యం నేటితరం సాహితీవేత్తలు అధ్యయనం చేయాలని సూచించారు. సాంస్కృతిక, కళారంగాల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, సాహితీవేత్తలు త్రిపురనేని విగ్రహం వద్ద ఘనంగా నివాళి సమర్పించారు.

కేరళలో అయ్యప్ప దీక్షాధారి మృతి



తమ్ము చంద్రరావు(ఫైల్)

చల్లపల్లి: పండుగ వేళ అయ్యప్ప భక్తుడు మృతి చెందటంతో చల్లపల్లి మండలం కొత్తమాజేరులో విషాద ఛాయలు అలముకున్నాయి. అయ్యప్ప మాల ధరించి మకర జ్యోతి దర్శనానికి శబరిమలకు వెళ్లిన భక్తుడు మార్గమధ్యలో అస్వస్థతకు గురై మృతి చెందాడు. చల్లపల్లి మండలం కొత్తమాజేరు నుంచి నలభై మంది అయ్యప్ప మాలధారులు ప్రైవేట్ బస్సులో ఈ నెల 10వ తేదీ రాత్రి కేరళ బయలుదేరారు. ఈ బృందంలో సభ్యుడైన మాజేరు గ్రామ రైతు తమ్ము చంద్రరావు(60) ఐదోసారి అయ్యప్ప మాల ధరించి కేరళ వెళ్లారు. ఈ నెల 13న మార్గమధ్యలో చంద్రరావు అస్వస్థతకు గురికావటంతో సహచర మాలధారులు ఆయనను కొట్టాయం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి, అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కొండపైకి వెళ్లారు. కాగా అక్కడే చికిత్స పొందుతూ చంద్రరావు సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కేరళ బయలుదేరి వెళ్లారు. చంద్రరావు భౌతిక కాయానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టంనకు తరలించారు. బుధవారం మధ్యాహ్నం చంద్రరావు భౌతిక కాయం స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, వారందరికీ వివాహాలు జరిగాయి.

మునేటిలో దూకి యువకుడు ఆత్మహత్య



కంచికచర్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు మునేటిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు నందిగామ మండలం చందాపురం గ్రామానికి చెందిన నల్లమోతు గోపీచంద్(25) అనే యువకుడు తన కుటుంబంలో జరిగిన గొడవ వల్ల కంచికచర్ల మండలం కీసర మునేటిలో ఆదివారం సాయంత్రం దూకాడు. సోమవారం శవమై తేలటంతో మునేటికి వెళ్లిన వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫోన్ మెసేజే పట్టించింది!

వీడిన కానూరు మహిళ హత్య కేసు మిస్టరీ

- వివాహేతర సంబంధం కోసమే హత్య
- ప్రియుడితో కలిసి భర్తపై నేరం నెట్టేసేందుకు భార్య యత్నం
- బెడిసికొట్టిన వ్యూహం
- కటకటాల పాలైన ముగ్గురు వ్యక్తులు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

పెనమలూరు: భర్తపై భార్య రాసిన క్రైం కథా చిత్రంలో ఓ మహిళ బలైంది. ప్రియుడితో కలిసి భర్తను జైలుకు పంపుదామని స్కెచ్ వేసి.. అందుకు పరిచయం ఉన్న ఓ మహిళను సాయం కోరి.. చివరకు ఆ మహిళనే చంపేసి.. నేరం భర్తపై తోసేందుకు ప్రయత్నించి అడ్డంగా బుక్ అయ్యింది. సినిమా కథకు ఏ మాత్రం తీసిపోని రీతిలో జరిగిన ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. గన్నవరం సర్కిల్ డీఎస్పీ జయసూర్య మంగళవారం పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు..

అసలు ఏమైంది?

విజయవాడ కృష్ణలంక బాలాజీనగర్‌కు చెందిన గరిగల నాగమణి (30) కానూరు 100 అడుగుల రోడ్డులో ఈ నెల 14వ తేదీన శవమై కనిపించింది. సమాచారం తెలుసుకున్న సీఐ రామారావు ఘటనా స్థలం వద్దకు వెళ్లారు. మృతురాలు నాగమణి ఫొటోను సోషల్‌మీడియాలో పెట్టగా నాగమణి ఫొటోను గుర్తించిన ఆమె భర్త కిరణ్‌గోపాల్ పోలీసుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేశాడు. ఈ కేసును విచారించేందుకు సీఐ రామారావుతో పాటు నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. సీన్ కట్ చేస్తే..

లవ్ స్టోరీ ఇలా..

ప్రసాదంపాడుకు చెందిన రిషేంద్ర, ఐతాబత్తుల మృదులాదేవి(40) 2007లో ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ప్రైవేటు కంపెనీలో డెప్యూటీ మేనేజర్‌గా పని చేస్తుండగా, మృదులాదేవి బాడీకేర్ సెంటర్‌లో పని చేస్తుంది. మృదులాదేవి కృష్ణలంకు చెందిన పోలాసి సాయిప్రవీణ్ (30) అనే వ్యక్తి 2021లో కస్టమర్‌గా వచ్చి పరిచయం అవ్వటంతో అది కాస్త పెరిగి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆ తర్వాత మృదులాదేవి భర్తను పిల్లలను విడిచిపెట్టి ప్రియుడు సాయిప్రవీణ్‌తో 2022లో వెళ్లిపోయింది. పోలీసుల సాయంతో తిరిగొచ్చినా.. మరలా వెళ్లిపోయింది. ఆ తర్వాత తానే మళ్లీ 2023 ఫిబ్రవరిలో భర్త రిషేంద్ర వద్దకు తిరిగి వచ్చి, తాను మారిపోయానని నమ్మించి, అతని పంచన చేరింది.

అసలు కథ ఇక్కడే..

సాయిప్రవీణ్‌కు మృదులాదేవికి ఆమె భర్త రిషేంద్ర అడ్డుగా ఉండటంతో ఇద్దరూ కలిసి పథకం రచించారు. మృదులాదేవి తన భర్త రిషేంద్రను శాశ్వతంగా జైలుకు పంపితే అడ్డు తొలగి పోతుందని ఆలోచన చేసింది. దీనిలో భాగంగా కృష్ణలంకలో గతంలో సాయిప్రవీణ్ ఇంట్లో అద్దెకు ఉన్న నాగమణిని పావుగా వాడారు. నాగమణికి ఆర్థికసాయం చేస్తానని సాయిప్రవీణ్ ఎరవేశాడు. నాగమణి భర్త 13వ తేదీ ఏలూరుకు వెళ్లిన తరువాత ఆమెను ఎనికేపాడుకు రప్పించాడు. ఆమెను ఆటోలో కానూరు 100 అడుగుల రోడ్డులోకి తీసుకు వచ్చాడు. నాగమణి ఫోన్‌లోనే ఆమె వాయిస్‌ను సాయిప్రవీణ్ రికార్డు చేశాడు. మృదులాదేవి భర్త రిషేంద్ర తనను శారీరకంగా వాడుకున్నాడని, బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడని, నాకు ఏదైనా జరిగితే రిషేంద్రే కారణమని నాగమణి వాయిస్ రికార్డు చేశాడు. ఆ తర్వాత నాగమణిపై దాడి చేసి చున్నీతో మెడకు బిగించి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి, ఆమె ఫోన్ మాత్రం తీసుకొని అక్కడి నుంచి కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన తన మిత్రుడు ఎస్. మూర్తిబాబు(28) సహకారంతో వచ్చేశారు. రాత్రి 9.45 గంటలు దాటిన తరువాత నాగమణి వాయిస్ మెసేజ్‌తో పాటు కొన్ని టైప్ చేసిన మెసేజ్‌లు నాగమణి ఫోన్ నుంచే ఆమె భర్త కిరణ్‌గోపాల్‌కు అలాగే మృదులాదేవికి సాయిప్రవీణ్ పంపాడు. దీంతో ఈ హత్య మృదులాదేవి భర్త రిషేంద్ర చేశాడని పోలీసులు అతనిని అరెస్టు చేస్తారని, ఇక తమకు అడ్డుండదని సాయిప్రవీణ్, మృదులాదేవి భావించారు.

ఎవిడెన్స్ సేకరణ..

ఈ హత్యకు సంబంధించిన పూర్తి టెక్నికల్ ఎవిడెన్స్, సీసీ ఫుటేజీలు సేకరించామని డీఎస్పీ జయసూర్య చెప్పారు. నిందితులైన మృదులాదేవి, సాయిప్రవీణ్‌తో పాటు వీరికి సహకరించిన మూర్తిబాబును కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ టీవీవీ రామారావు, ఎస్ఐలు ఏసేబు, రమేష్, ఫిరోజ్, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కడ దొరికింది క్లూ..

నాగమణి భర్త కిరణ్‌గోపాల్‌కు వచ్చిన మెసేజ్‌లు పోలీసులు పరిశీలించారు. అస్సలు చదువుకోని నాగమణి ఇంగ్లిష్‌లో మెసేజ్ పంపడం, వాయిస్ మెసేజ్‌లో నాగరాణి చాలా కూల్‌గా మాట్లాడటంపై పోలీసులు అనుమానించి లోతుగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో మృదులాదేవి భర్త రిషేంద్రను కూడా అదుపులోకి తీసుకొని విచారించారు. తన భార్య మృదులాదేవికి కూడా ఈ విధంగానే మెసేజ్‌లు వచ్చాయని రిషేంద్ర పోలీసుల దృష్టికి తీసుకు వచ్చాడు. దీంతో అనుమానంతో పోలీసులు మృదులాదేవి గురించి విచారణ చేయగా సాయిప్రవీణ్‌తో ఉన్న వివాహేతర సంబంధం వెలుగు చూసింది. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించగా హత్య కేసు వెలుగు చూసింది. వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తులకు సాయం చేసేందుకు వెళ్లిన నాగమణి హత్యకు గురైంది.

కొండచిలువ కలకలం



రైస్‌మిల్ ఆవరణలో కొండచిలువ

తోట్లవల్లూరు: దేవరపల్లిలో కొండచిలువ కలకలం సృష్టించింది. స్థానిక గొడపాలెం వద్ద ఉన్న పాడుబడ్డ రైస్‌మిల్‌లో మంగళవారం రాత్రి కొండచిలువ కనిపించటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. అటవీశాఖ సిబ్బంది వచ్చే వరకు కొండచిలువ ఎటూ వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు వల ఏర్పాటు చేశారు. గతంలో కూడా పలుమార్లు ఇదే ప్రాంతంలో రాత్రి వేళల్లో కొండచిలువ సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు.

మస్తాన్ దర్గా ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పట్నంబజారు: కుల, మతాలకు అతీతంగా దశాబ్దాలుగా జరుపుకుంటున్న గొప్ప పండుగ గుంటూరు మస్తానయ్య ఉరుసు మహోత్సవమని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని రెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి కార్యాలయంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించనున్న ఉరుసు మహోత్సవ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్, మస్తాన్ షా వలి దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైజాగ్ వాసి విజయవాడలో అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైజాగ్‌కు చెందిన వ్యక్తి విజయవాడలో అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్‌కు చెందిన మరుపిళ్ల అప్పలరాజు(50) ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంటాడు. అప్పలరాజు గత 45 రోజులుగా విజయవాడ వన్‌టౌన్‌లోని షిర్డి లాడ్జీలో ఉంటూ ఉద్యోగ పనిపై తిరుగుతున్నాడు. ఈ నెల 5వ తేదీ నుంచి అప్పలరాజు ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కంపెనీ వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పలరాజు సోదరుడైన కనక సురేష్ లాడ్జి వద్దకు వచ్చి ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన అన్న కనిపించడం లేదంటూ సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన జర్రిపోతుల జానకి, మల్లేష్ భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. మల్లేష్ అట్ట పెట్టెలు తయారు చేస్తుంటాడు. కొంత కాలంగా మల్లేష్‌కు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మద్యం అధికంగా తాగుతున్నాడు. మంగళవారం మల్లేష్ ఇంటిలోని మైలతుత్తం తిన్నాడు. దీంతో పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

10 తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పాలకొల్లు ప్రాంతానికి చెందిన సురేష్ అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి బస్సులో బయలుదేరి మంగళవారం బస్టాండ్‌కు చేరుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బస్టాండ్ వద్ద అతనిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పది మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అవధూతస్వామి ఆరాధనోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం అవధూత శ్రీ రామిరెడ్డి తాత స్వామి 31వ ఆరాధన దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన విశేష పూజ, హారతి నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పారాయణం చేశారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- రెవెన్యూ కాలనీ పార్కుకు సరికొత్త హంగులు
- రూ.60 లక్షలతో ఆధునికీకరణ
- వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు
- పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు


పార్కులో పిల్లల ఆటవస్తువులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ నగరంలోని పార్కుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా 8వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ పార్కును సరికొత్త హంగులతో తీర్చిదిద్దింది. ఒకప్పుడు ఎండిన మొక్కలతో నిరుపయోగంగా ఉన్న పార్కులో ఇప్పుడు పచ్చదనం పరుచుకుంది. సుమారు రూ.60 లక్షల వ్యయంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లల కోసం ఆటపరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం సాయంత్రం వేళల్లో కాలనీ వాసులు అక్కడికి వచ్చి సేదతీరుతున్నారు.

అందుబాటులోనే పచ్చదనం..

పార్కులో రకరకాల మొక్కలను పెంచారు. ఉద్యానశాఖ సహకారంతో నగర పాలక సంస్థ అరుదైన మొక్కలను ఏర్పాటు చేసింది. పార్కును సందర్శించిన వారికి మానసికోల్లాసం కలిగేలా రూపొందించారు. దీంతో అన్ని వయస్సుల వారు పార్కును సందర్శిస్తున్నారు.

ఇంటి సమీపంలోనే..

వాకింగ్ చేయాలంటే ఒకప్పుడు దూర ప్రాంతంలోని గ్రౌండ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వాకింగ్ ట్రాక్ తమ కాలనీలో అందుబాటులో ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులో వాకింగ్ చేసేందుకు మహిళలే ఎక్కువగా సందర్శిస్తున్నారు. కొందరు మహిళల తమ పిల్లలను తీసుకుని పార్కుకు వచ్చి, వాళ్లు ఆడుకుంటుంటే, తల్లులు వాకింగ్ చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా..

పార్కులో ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి రావడంతో ఆదరణ పెరిగింది. భార్యభర్తలు, పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్నారు. మరోవైపు వృద్ధులు కూడా కాలక్షేపం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.


పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్

రాజ్యాంగ నిర్మాతకు సముచిత గౌరవం

వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సముచిత గౌరవం కల్పించారని వాణిజ్య పన్నులశాఖ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ విజయవాడకే ఐకాన్‌లా నిలిచేలా విగ్రహం, గ్రీనరీ, మ్యూజియం వంటివి ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. ఇదొక పర్యాటక ప్రాంతంగా రూపొందుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విషయంలో ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ నెల 19న వేడుకలా నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, ఉద్యోగులు, అంబేడ్కర్ అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో మకర సంక్రాంతి సందర్భంగా మకరజ్యోతి దర్శనం పురస్కరించుకుని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జ్యోతుల ఉత్సవం జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు బల్లెం పూర్ణయ్య గురుస్వామి పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా నెయ్యాభిషేకం, పంచామృత అభిషేకం చేశారు. ఆలయంలో దీపాలను వెలిగించి జ్యోతుల ఉత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వాములు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో భాగంగా మాంగల్యధారణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సుబ్రమ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఉభయదాతలు, ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించగా, పెద్ద ఎత్తున భక్తులు వీక్షించారు. షష్ఠి, మంగళవారం కలిసి రావడంతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించడం అదృష్టంగా బావిస్తున్నామని పలువురు భక్తులు పేర్కొన్నారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారి ఊరేగింపులో అర్చకులు, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కనుమ పండుగ స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా జ్యోతి దర్శనం


పాతశివాలయంలో జ్యోతి దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో జ్యోతి దర్శనం సోమవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీధరన్ నంబూద్రి ఆధ్వర్యంలో ఉదయం నెయ్యాభిషేకం, పాలాభిషేకం, ఇతర పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం విశేష అలంకారాన్ని నిర్వహించారు. సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి విశేష హారతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణ చేసి స్వామి వారికి విశేష అర్చనను నిర్వహించారు. అనంతరం ఆలయంపైన జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారి జ్యోతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు స్వామి వారిని దర్శించుకొని జ్యోతి వేడుకల్లో పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకొని పూజించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బాయన బాబ్జీ, పోతిన వెంకటేశ్వరస్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరాల సామాజిక వర్గం నూతన ఏడాది అన్ని రంగాల్లోనూ రాణించాలని ఏపీ నగరాల సంఘం అధ్యక్షుడు బాయన బాబూజీ (బాబ్జీ) అన్నారు. ఏపీ నగరాల సంఘం రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆ సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌ను బాయన బాబూజీ ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరస్వామితో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నగరాల సామాజిక వర్గానికి చెందిన ప్రజానీకం దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో మంచి గుర్తింపు పొందుతున్నారన్నారు. రానున్న ఏడాది మరింత విస్తృతంగా అభ్యున్నతిని సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కోశాధికారి రాజగిరి సోమేశ్వరరావు, సంఘ పెద్దలు సూర్యనారాయణ, ముదిలి మోహనరావు, అరసవిల్లి అప్పారావు, మజ్జి ఈశ్వరరావు, చీపిళ్ళ అశోక్‌బాబు, కొరగంజి భాస్కరరావు, గర్రె నరసింహరావు, పిళ్లా రవి పాల్గొన్నారు.

ఘనంగా లూర్ధుమాత దేవాలయ రజతోత్సవం


మాట్లాడుతున్న మువ్వల ప్రసాద్, చిత్రంలో ఫాదర్ చిన్నప్ప తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోగల విజయవాడ కథోలిక పీఠానికి చెందిన లూర్ధు మాత దేవాలయం రజతోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగాయి. న్యూ జోజినగర్ విచారణ గురువులు ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప ఆధ్వర్యంలో కుమ్మరిపాలెం సంఘస్తులు నిర్వహించిన ఈ వేడుకల్లో తొలుత స్థానిక పురవీధుల్లో లూర్ధు మాత విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం దేవాలయంలో జరిగిన దివ్యబలి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మోన్ సిగ్నూర్ మువ్వల ప్రసాద్, జోజినగర్ విచారణ సహాయక గురువులు ఫాదర్ రాజేష్, ఫాదర్ మరియదాసు, వన్‌టౌన్ విచారణ కర్తలు ఫాదర్ దామాల విజయ్‌కుమార్ తదితర గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ ఈ చర్చి స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది గురువులు ఈ సంఘ అభివృద్ధికి, విచారణ అభివృద్ధికి, చర్చి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. లూర్ధు తల్లి ఎంత సాధుశీలని ఆమె మంచి మనసు గురించి వివరించారు. మన జీవితంలో కూడా సహృదయంతో తోటివారిపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని అన్నారు. నలుగురికి సహాయపడే విధంగా క్రైస్తవ జీవితం ఉండాలని ఆకాంక్షించారు. ఎక్కడైతే దివ్యబలి పూజ సమర్పణ జరుగుతుందో అక్కడ సమావేశమైన అందరితోపాటు దేవదూతలు, పునీతలు మనకు కనిపించని రీతిలో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సంఘస్తులు వనం బత్తిన ప్రవీణ్, జక్కి రమేష్, చలపతిరావు, పీతా కుమార్, కన్య స్త్రీలు, సంఘ పెద్దలు, జోజినగర్ విచారణ కౌన్సిల్ సభ్యులు, కుమ్మరిపాలెం యువతీ యువకులు, సంఘస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న దృష్ట్యా దళిత సామాజికవర్గం పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సుమారు రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డున స్వరాజ్యమైదానంలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ అంబేడ్కర్ స్మృతివనం ప్రపంచం గర్వపడే విధంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటం సీఎం జగనన్న ప్రభుత్వానికే సాధ్యమయ్యిందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చి అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని కోరారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పరిపాలన సాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక విధాలుగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహ కమిటీ చైర్మన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునలకు ఐదు కోట్ల ఆంధ్రుల తరుపున అభినందనలు తెలియజేసుకుంటున్నామన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి


నగరోత్సవంలో ఊరేగుతున్న నగరాల శ్రీరామచంద్రమూర్తి


విజేతలకు బహుమతులను అందజేస్తున్న అతిథులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న యామినీ శర్మ, దిలీప్


ఆళ్వార్లకు పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో సంక్రాంతి పర్వదినాన్ని వన్‌టౌన్ వాసులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా వన్‌టౌన్‌లోని అన్ని ఆలయాలు సందడిగా దర్శనమిచ్చాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి సంక్రాంతి శోభ ఆలయాల్లో దర్శనమిచ్చింది. ప్రధానంగా వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజామున అభిషేకాలను నిర్వహించి తిరుప్పావై సేవతో పాటుగా సహస్రనామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి మూలవిరాట్‌ను అత్యంత రమణీయంగా అలంకరించారు. అండాళ్, లక్ష్మీదేవి అమ్మవార్లను సుందరంగా తీర్చిదిద్దారు. రంగనాథ స్వామికి, గోదాదేవి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి రామచంద్రరావు పర్యవేక్షించారు.

నగరాల సీతారామస్వామి దేవస్థానంలో..

కొత్తపేటలోని నగరాల సీతారామస్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం మధ్యాహ్నం సీతా, లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రమూర్తి ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై ప్రతిష్టించి నగరోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

కొత్తపేట వేణుగోపాలస్వామి చౌక్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రుక్మిణీ, అండాళ్ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవాన్ని నిర్వహించారు.

పాండురంగస్వామి దేవస్థానంలో..

కొత్తగుళ్ల ప్రాంగణంలోని పాండురంగస్వామి దేవస్థానంలో స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సంక్రాంతి సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, పూలంగి సేవను నిర్వహించారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను యువత కాపాడుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సీపీఐ 48వ డివిజన్ సహాయ కార్యదర్శి బెవర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సారంగం రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కొత్త అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, ఈది రాజారావులు విచ్చేశారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో సుమారు వంద మంది మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి, న్యాయనిర్ణేతగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ మాట్లాడుతూ ముగ్గులు వేయడం వలన శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. మరో అతిథి కిలారి దిలీప్ మాట్లాడుతూ ధనుర్మాసంలో వచ్చే సంక్రాంతి పండుగ రోజున రైతులకు పంటలు చేతికి వచ్చే సమయమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి శివన్నారాయణ, కార్యదర్శులు కాలవ ప్రసాద్, కోతారి భాస్కర్, ఉపాధ్యక్షుడు ఆకుల వీరయ్య, తాండవ రంగలక్ష్మి, రాజరాజేశ్వరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా ఆళ్వార్ మర్యాదోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా, శ్రీరామ నగరేశ్వరస్వామి వార్ల దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఆళ్వార్ మర్యాదోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకొని ముగింపు కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో వేణుగోపాలస్వామివారిని ఉభయదేవేరులతో అధిష్టింపజేసి పూజలు నిర్వహించారు. అనంతరం వైష్ణవ సంప్రదాయాన్ని ఆచరించిన ప్రముఖులు 12 మంది ఆళ్వార్లను విశేషంగా అలంకరించి వారికి ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. వేణుగోపాలునికి సహస్రనామార్చనలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు తిరుప్పావైను పఠించి పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవచార్యులు నిర్వహించారు.

క్యాలెండర్ పండుగకు విశేష స్పందన


క్యాలెండర్ ప్రదర్శిస్తున్న వినియోగదారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంలో ఎల్లవేళలా ముందుండే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీ) సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్యాలెండర్ పండుగ పేరుతో కార్యక్రమం నిర్వహించింది. బందరు రోడ్డులోని ఐఓసీఎల్ పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్ లో సోమవారం నిర్వహించిన క్యాలెండర్ పండుగకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 800 మంది వినియోగదారులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఫొటోలు దిగారు. నిర్వాహకులు ఆ ఫొటోలను నూతన సంవత్సరం క్యాలెండర్‌లో ముద్రించి ఖాతాదారులకు అందజేశారు. సంస్థ అధిపతి ఎంవీపీ సత్యనారాయణ, నిమ్మరాజు చలపతిరావు, ఎన్టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కే వరప్రసాద్, సంస్థ మేనేజర్ కే వెంకటప్పయ్య, ఐఓసీ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్ కుమార్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

శివతీర్థ డైరీ ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివతీర్థ ఛారిటబుల్ ట్రస్ట్ డైరీని మంగళవారం చుట్టుగుంట దుర్గాదేవి ఆలయంలో వేద పండితులు బాల శివశంకర్‌శర్మ, ప్రకాష్, శివ సమక్షంలో సెంట్రల్ నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడు 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శివతీర్థ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. ట్రస్ట్ సెక్రటరీ అంగిరేకుల గొల్లభామ మాట్లాడుతూ శివతీర్థ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లోక కల్యాణార్థం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో తమకు స్థలం కేటాయిస్తే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే తాము అరుణాచలంతో పాటు పలు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతి వ్యక్తికీ పనికొచ్చే చట్టం

ల్యాండ్ టైట్లింగ్ చట్టం.. అనాలోచితంగా చేసింది కాదు

- ఈ చట్టాన్ని అర్థం చేసుకోకుండా కొందరు మాట్లాడుతున్నారు
- ఇది భూములు లాక్కోవడానికి చేసింది కాదు
- దీన్ని తేవడానికి ఎన్డీఏ, యూపీఏ ప్రభుత్వాలు కూడా ప్రయత్నించాయి
- ఇది ఉన్న హక్కుల్ని రికార్డు చేసి వాటికి గ్యారంటీ కల్పిస్తుంది
- భూ చట్టాల నిపుణుడు, నల్సార్ లా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సునీల్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం భూమి ఉన్న ప్రతి వ్యక్తికీ పనికొచ్చే చట్టమని భూ చట్టాల నిపుణులు, నల్సార్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.సునీల్ కుమార్ చెప్పారు. ఇది అనాలోచితంగా చేసింది కాదన్నారు. ఈ చట్టాన్ని అర్థం చేసుకోకుండా కొందరు మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడానికి గతంలో కేంద్రంలో ఎన్డీయే, యూపీఏ ప్రభుత్వాలు కూడా ప్రయత్నించాయని గుర్తు చేశారు. గత 120 ఏళ్లుగా ఇలాంటి చట్టాన్ని తేవడానికి దేశంలో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. కొన్ని రాజకీయ పక్షాలు, న్యాయ పరిజ్ఞానం ఉన్నవారు కూడా భూములు లాక్కోవడానికి చేసిన చట్టంగా దీని గురించి మాట్లాడడం సరికాదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం.. ఇతర చట్టాల ద్వారా ఇచ్చిన భూమి హక్కుల్ని లాక్కోదని తెలిపారు. ఉన్న హక్కుల్ని రికార్డు చేసి ఆ హక్కులకు గ్యారంటీ కల్పిస్తుందన్నారు. చుక్కల భూముల చట్టం, ఎస్టేట్ ఎబాలిషన్ చట్టం వంటి అనేక చట్టాల కింద ఉన్న హక్కులన్నీ ఉంటాయని తెలిపారు. ఇది కేవలం ఆర్ఓఆర్ చట్టం స్థానంలో వచ్చిన కొత్త చట్టం మాత్రమేనన్నారు. ఏపీ ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై జరుగుతున్న రకరకాల ప్రచారాలపై ఆయన సాక్షితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..



ఒకే ఒక రికార్డు.. ప్రభుత్వం గ్యారంటీ..

ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రకారం ఇప్పుడున్న రెవెన్యూ రికార్డులన్నీ మాయమై ఒకే ఒక రికార్డు వస్తుంది. ఆ రికార్డుల్లో ఉన్న వివరాలకు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది. రిజిస్ట్రేషన్ జరిగితే హక్కులు రిజిస్టర్ అవుతాయి. రిజిస్ట్రార్ అమ్మేవాడికి హక్కు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తాడు. రిజిస్ట్రేషన్ అయిందంటే కొన్న వ్యక్తి పేరు మీదకు భూమి మారిపోయినట్లే. ఇది ఈ చట్టం ద్వారా వచ్చే మార్పు. దీనికి అదనంగా రికార్డులో ఉన్న వివరాలకు ప్రభుత్వమే హామీ ఇస్తుంది కాబట్టి పొరపాటున ఎవరికైనా నష్టం జరిగితే ప్రభుత్వమే నష్ట పరిహారం ఇస్తుంది. అది టైటిల్ ఇన్సూరెన్స్.

సివిల్ కోర్టుల అధికారాలన్నీ పోవు..

టైటిల్ వివాదాలను సివిల్ కోర్టులు పరిష్కరించాలి తప్ప టైటిలింగ్ అధికారులు పరిష్కరించడం తప్పని అంటున్నారు. ప్రజలకు సివిల్ కోర్టుల్లో తప్ప రెవెన్యూ కోర్టుల్లో న్యాయం జరగదని వాదిస్తున్నారు. కానీ కొత్త చట్టంలో సివిల్ కోర్టుల అధికారాలన్నీ పోవు. రికార్డుల తయారు చేసేటప్పుడు వచ్చే అంశాలు మాత్రమే సివిల్ కోర్టుల పరిధిలోకి రావు.

ఇప్పుడున్న వ్యవస్థలో ఫైనల్ రికార్డు ఏదీ లేదు..

ఇప్పుడున్న వ్యవస్థలో భూ యజమాని ఆ భూమి నాదని చెప్పుకునే ఫైనల్ రికార్డు ఏదీ లేదు. రెవెన్యూ రికార్డులన్నీ ఒకప్పుడు పన్ను వసూలు కోసం తయారైనవే. ఆర్ఓఆర్ చట్టం మాత్రమే కొద్దిగా ఉపశమనం ఇస్తుంది. పాస్‌బుక్ ఉంటే వేరే ఎవరైనా అభ్యంతరం చెప్పనంతవరకు అతనే భూ యజమాని అని ఆ చట్టం చెప్పింది. అంతే తప్ప ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ ఫలానా రికార్డు.. భూమి హక్కుల నిరూపణకు అంతిమ సాక్ష్యంగా పనికిరాదు. భూముల రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పుడు ఇద్దరి మధ్య లావాదేవీ జరిగిన కాగితానికి రిజిస్ట్రేషన్ జరుగుతుంది తప్ప హక్కుల బదలాయింపు కోసం రిజిస్ట్రేషన్ జరగదు. వివిధ ప్రభుత్వ శాఖలు తయారు చేసిన రికార్డుల్లోని వివరాలకు గ్యారంటీ లేదు. అలాగే భూ కమతానికి, ఇంటి స్థలానికి ఐడెంటిటీ లేదు.. హద్దులు కూడా సరిగా లేవు. ఈ సమస్యలన్నింటినీ తీర్చడం కోసమే ఏపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకువచ్చింది. దీనికి ముందే రీ సర్వే ప్రారంభించింది. ఈ సర్వే ద్వారా ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. దాని ప్రకారం ఎవరి భూముల హద్దులను వాళ్లు చూసుకోవచ్చు. మొబైల్ ద్వారా కూడా చూసుకునే సదుపాయం ఉంది. ప్రతి వ్యక్తికీ ఆధార్ వచ్చినట్లే భూమికి కూడా యూనిక్ ల్యాండ్ పార్సిల్ నంబర్ వస్తుంది.

రెవెన్యూ కోర్టులే ప్రజలకు అందుబాటులో ఉంటాయి..

ఇప్పుడున్న భూ రికార్డులన్నీ రెవెన్యూ అధికారులు తయారు చేసినవే. అలాంటప్పుడు ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రకారం కొత్త రికార్డులు తయారు చేయడం వారికి కాకుండా ఎవరికి ఇస్తారు? సివిల్ కోర్టుల కంటె రెవెన్యూ కోర్టులే ప్రజలకు ఎక్కువ అందుబాటులో ఉంటాయి. లాయర్ లేకుండా కూడా జేసీ దగ్గర మాట్లాడవచ్చు. లాయర్ లేకుండా సివిల్ కోర్టులో కేసు వేయగలరా? ప్రజలకు సత్వర న్యాయం జరగాలంటే ఇలాంటి వ్యవస్థ ఉండాలని ప్రభుత్వం చెబుతోంది. సివిల్ కోర్టుల్లో 66 శాతం భూమికి సంబంధించిన కేసులున్నాయి. ఈ చట్టం అమలైతే అవన్నీ తగ్గిపోయి సివిల్ కోర్టుల్లో భూమి తగాదాలు తగ్గుతాయి. కానీ లాయర్లకు వేరే పని పెరుగుతుంది. టైటిల్ వెరిఫికేషన్, ట్రిబ్యునల్ అప్పీళ్లు పెరుగుతాయి. ఇంతకుముందులా ఏళ్ల తరబడి సివిల్ కోర్టుల్లో వ్యాజ్యాలు నడిపించడం కుదరదు.

అప్పీల్‌కు రెండేళ్లు అవకాశం..

టైటిల్ రిజిస్టర్‌లో ఒకసారి పేరు నమోదయ్యాక ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీల్‌కి రెండేళ్లు అవకాశం ఇస్తారు. రెండేళ్లలోపు ఎవరైనా అభ్యంతరపెడితే అది వివాదాల రిజిస్టర్‌లోకి వెళుతుంది. రెండేళ్లలోపు ఎలాంటి అభ్యంతరం రాకపోతే అది తుది రికార్డవుతుంది. తర్వాత దాన్ని చాలెంజ్ చేయడానికి ఉండదు. ఆర్ఓఆర్ చట్టంలో ఒకసారి రికార్డయితే దాన్ని చాలెంజ్ చేయడానికి ఉన్న సమయం సంవత్సరమే. మ్యుటేషన్‌పై అభ్యంతరాలను అప్పీల్ చేయడానికి ఉన్న సమయం 19 రోజులు. కానీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంలో రెండేళ్లు అవకాశం ఇస్తున్నారు. ఒక రికార్డును ఎప్పుడో ఒకప్పుడు ఫైనల్ చేయకపోతే టైటిల్ గ్యారంటీ ఎలా వస్తుంది? ఎవరైనా, ఎప్పుడైనా ఉన్న రికార్డును చాలెంజ్ చేసే పరిస్థితి ఉంటే అది అంతిమ రికార్డు ఎలా అవుతుంది? దానికి ప్రభుత్వం గ్యారంటీ ఎలా ఇస్తుంది? ఏదో ఒక నిర్దిష్ట సమయం ఉండాలి కదా? సక్సెషన్ సర్టిఫికెట్ సివిల్ కోర్టులు ఇవ్వాలిగానీ టైటిల్ గ్యారంటీ ఆఫీసర్ ఎలా ఇస్తారని అంటున్నారు. కొత్త చట్టంలో సక్సెషన్ సర్టిఫికెట్ టైటిల్ ఆఫీసర్ ఇవ్వడు. గతంలో మ్యుటేషన్ జరిగినట్లే ఇక్కడా జరుగుతుంది. ఒకవేళ వారసత్వ వివాదాలుంటే సివిల్ కోర్టులకు వెళ్లాల్సిందే. ఆర్ఓఆర్ చట్టంలోనూ అదే ఉంది.

ఈ చట్టం ఎవరో ఒకరి కోసం చేసింది కాదు..

ఈ చట్టం ఎవరో ఒకరి కోసం చేసింది కాదు. భూమి ఉన్న ప్రతి ఒక్కరికి పనికి వచ్చే చట్టం ఇది. ఏ భూ యజమాని అయినా తన భూమికి స్పష్టమైన హద్దులుండాలని, కాగితాలు స్పష్టంగా, భద్రంగా ఉండాలని, మార్పులు చేర్పులు ఉంటే వెంటనే జరగాలని కోరుకుంటాడు. వివాదాలు వస్తే త్వరగా పరిష్కారం కావాలని ఆశిస్తాడు. ఇప్పటివరకు ఇవన్నీ లేవు కాబట్టే ఈ చట్టం చేశారు. భూమి హక్కులకు భద్రత ఇవ్వడానికి చేసిన చట్టం లాక్కోవడం ఎలా అవుతుంది? రికార్డు తయారైన తర్వాత పబ్లిక్ డొమైన్‌లో ఉంటుంది. దానిపై అభ్యంతరం ఉంటే వినాల్సిందే. దానిపై ట్రిబ్యునల్‌కు, ఆపైన హైకోర్టుకు కూడా వెళ్లవచ్చు.

గతంలో అన్ని రాజకీయ పార్టీలు సమర్థించాయి..

ఈ చట్టం గురించి మాట్లాడుతున్న రాజకీయ పక్షాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు ఈ విధానం కావాలని సమర్థించిన పార్టీలే. యూపీఏ హయాంలో కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో టైటిల్ గ్యారంటీ చట్టం ఉంది. లెఫ్ట్ పార్టీలు అందులో ఉన్నాయి. నీతి అయోగ్.. టైటిల్ గ్యారంటీ చట్టం రావాలని చెప్పింది. దాని ప్రకారమే ముసాయిదా చట్టాలు వచ్చాయి. ఎన్డీఏలో అన్ని పక్షాలు దానికి మద్దతిచ్చాయి. ప్రజల కోణంలో చూసినా, రాజకీయ కోణంలో చూసినా ఈ చట్టాన్ని అభ్యంతర పెట్టడానికి అవకాశం లేదు.

యువతిపై ప్రేమోన్మాది దాడి

- అడ్డుపడిన తల్లిపైనా దాడి..
- తల్లీకూతుళ్లకు గాయాలు
- పశ్చిమ గోదావరి జిల్లా ఉప్పులూరులో ఘటన



ఉండి: ప్రేమ పేరుతో ఓ బాలికపై ప్రేమోన్మాది కొడవలితో దాడి చేసి గొంతు కోశాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలంలోని ఉప్పులూరుకు చెందిన కొణతం వెంకట కేశవ శివ సుబ్రహ్మణ్యం(42) అనే వ్యక్తి అదే గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతిని ప్రేమించానంటూ వెంటపడుతున్నాడు. ఆమె అతన్ని పట్టించుకోకపోవడంతో ఆగ్రహానికి గురయ్యాడు. మంగళవారం యువతి తన తల్లితో కలసి ఇంట్లో ఉండగా, కొడవలి పట్టుకుని వెళ్లి ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో యువతి గొంతు, చేతులకు గాయాలయ్యాయి. అడ్డుపడిన ఆమె తల్లిపైనా దాడి చేయడంతో ఆమె కూడా గాయపడింది. ఇది గమనించిన వారి కుటుంబ సభ్యులు, స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. గాయపడినవారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. స్థానికుల దాడిలో గాయపడిన నిందితుడిని కూడా భీమవరం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎ.సూర్యనారాయణ తెలిపారు. చికిత్స పొందుతున్న యువతికి ప్రాణాపాయం లేదని చెప్పారు. కాగా, 2021 అక్టోబరులో కూడా సదరు యువతిని ప్రేమ పేరుతో వెంకట కేశవ శివ సుబ్రహ్మణ్యం వేధించడంతో ఆమె తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై ఉండి పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు.

మత్తుమందిచ్చి ఆపై నగ్నంగా వీడియోలు తీసి..

ఓ మహిళను బ్లాక్‌మెయిల్ చేసిన మహిళా వస్త్ర వ్యాపారి, ఆమె స్నేహితుడు

పలమనేరు(చిత్తూరు జిల్లా): ఓ మహిళా వస్త్ర వ్యాపారి, ఆమె స్నేహితుడు కలసి తనకు మత్తుమందు ఇచ్చి నగ్నంగా ఫొటోలు, వీడియోలు తీసి వేధిస్తున్నారని, ఇప్పటికే తన వద్ద డబ్బులు వసూలు చేశారని ఓ మహిళ సోమవారం స్థానికులకు తెలియజేయడంతో పాటు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెకు మద్దతుగా గ్రామస్తులు ఏకమై కారణమైన వారిని సోమవారం సాయంత్రం చితకబాదారు. పలమనేరులో అఖిలాష అనే మహిళ వస్త్ర వ్యాపారం చేస్తోంది. చిన్నూరుకు చెందిన మరో మహిళ ఆమె దుకాణానికి వస్తూండేది. ఓ రోజు అఖిలాష, ఓ మెడికల్ షాపులో పనిచేసే తన స్నేహితుడు రెడ్డెప్పతో సన్నిహితంగా ఉండడాన్ని చిన్నూరుకు చెందిన మహిళ చూసింది. దీంతో చిన్నూరు మహిళను భయపెట్టాలని వారిద్దరూ నిర్ణయించుకున్నారు. ఒకరోజు ఆమె దుకాణానికి రాగా వ్యాపారి ఆమె స్నేహితుడు కలసి ఆమెకు కాఫీలో మత్తుమందు ఇచ్చారు. స్పృహ కోల్పోయాక నగ్నంగా వీడియోలు, ఫోటోలు తీసి వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేసి తన వద్ద నుంచి ఇప్పటి వరకు రూ.లక్షల్లో వసూలు చేశారని వాపోయింది.

కొత్త అల్లుళ్లకు బాహుబలి విందు

అనకాపల్లి/నాయుడుపేట టౌన్(తిరుపతి జిల్లా): సంక్రాంతి పండుగకు ఇంటికొచ్చిన కొత్త అల్లుళ్లకు అత్తమామలు మరిచిపోలేని ఆతిథ్యం ఇచ్చారు. ఏకంగా 325 పదార్థాలతో భోజనం పెట్టి తమ ప్రేమను చాటుకున్నారు. అనకాపల్లికి చెందిన గుండా సాయిగోపాల్, మాధవి దంపతులు తమ కుమార్తె రిషితను విశాఖకు చెందిన పసుమర్తి దేవేందర్‌నాథ్‌కు ఇచ్చి గత నెల డిసెంబర్ 15న వివాహం చేశారు. మొదటి సంక్రాంతి పండుగకు కుమార్తెను, అల్లుడిని పిలవడంతో వారు సోమవారం అనకాపల్లి వచ్చారు. వారికి అరిసెలు, లడ్డూలు, కాజాలు, రకరకాల స్వీట్స్, ఫ్రూట్స్, జ్యూస్‌లు, చేగోడిలు, జంతికలు వంటి స్నాక్ ఐటమ్స్‌తో 325 రకాల పదార్థాలను వడ్డించి చక్కటి ఆతిథ్యమిచ్చారు. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన కందనూరు విజయ్, భార్గవి దంపతులు కూడా పండుగకు ఇంటికి వచ్చిన అల్లుడు శ్రీకర్, కుమార్తె దీప్తిలకు సుమారు 175కు పైగా పదార్థాలతో ట్రీట్ ఇచ్చి ఔరా అనిపించారు.



అనకాపల్లి అల్లుడికి స్వీట్స్ తినిపిస్తున్న అత్తమామలు

తిరుమలలో సుప్రభాత సేవ పునఃప్రారంభం

▶ మొదటి పేజీ తరువాయి

మహా భక్తురాలైన (ఆండాళ్ అమ్మవారు) శ్రీగోదాదేవి పరిణయోత్సవాన్ని పురస్కరించుకుని గోదామాలలు శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం అలంకరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు పాల్గొన్నారు. కాగా, తిరుమలలో ప్రతి ఏడాది కనుమ పండుగను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం నిర్వహించే కాకబలి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఇందులో భాగంగా అర్చక స్వాములు పసుపు, కుంకుమ వేర్వేరుగా కలిపిన అన్నాన్ని ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరస్వామి వారికి నివేదించారు.

టీటీడీకి రూ.22 లక్షల విలువైన ఆర్గానిక్ నెయ్యి విరాళం

పూణేకి చెందిన పరాగ్ ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ నేతృత్వంలోని భాగ్యలక్ష్మీ డెయిరీ సోమవారం టీటీడీకి రూ.22 లక్షల విలువైన 1,000 కేజీల ఆర్గానిక్ నెయ్యిని విరాళంగా అందించింది. ఆ సంస్థ చైర్మన్ దేవేందర్ షా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీఅక్షాలీ షా తరఫున పలమనేరులోని భాగ్యలక్ష్మి డెయిరీ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ నక్రా బృందం ఈ విరాళాన్ని అందజేశారు. ఈ నెయ్యిని ఉగ్రాణంలో పడిపోటు సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి అందించారు.

జిల్లా వార్తలు

అరచేతిలో అనారోగ్యం!

- ప్రైవేటు సంస్థలో పనిచేసే పవన్ ఇంటి వద్ద ఉన్న భార్యతో మధ్యాహ్న సమయంలో మాట్లాడుతుంటాడు. ఒకరోజు సాయంత్రం 4 గంటలకు భార్య ఫోన్ చేసింది. దీంతో ఈ సమయంలో ఎందుకు ఫోన్ చేసిందోనని టెన్షన్ ప్రారంభమైంది. ఇలా భార్య నుంచే కాదు. సమయం కానీ సమయంలో తల్లిదండ్రులు, స్నేహితులు ఫోన్ చేసినా ఎందుకు చేశారో తెలుసుకునే లోపే ఆందోళన చెందుతున్నాడు. సడన్‌గా బీపీ కూడా పెరుగుతుంది. ఇలాంటి సమస్య చాలా మందిలో ఉంటుందని వైద్యులు అంటున్నారు.
- ప్రభుత్వ ఉద్యోగం చేసే సురేష్ రోజులో 60 నుంచి 70 కాల్స్‌పైనే మాట్లాడుతుంటారు. ఒక్కో రోజు వంద వరకూ మాట్లాడుతుంటాడు. ఫోన్ మాట్లాడుతూ టెన్షన్‌కు గురవుతుంటాడు. ఇటీవల కాలంలో తలనొప్పితో పాటు, తలతిప్పినట్లు ఉండటంతో ఆస్పత్రికి వెళ్లాడు. రక్తపోటు పరీక్షిస్తే 150/90 ఉంది. అతని వయస్సు 35 సంవత్సరాలే. ఫోన్ మాట్లాడే సమయంలో ఒత్తిడితోనే ఈ వయస్సులోనే రక్తపోటుకు గురైనట్లు వైద్యులు తేల్చారు.

అదే పనిగా సెల్‌ఫోన్ వినియోగిస్తే అనర్థమే

- అధికంగా ఫోన్ మాట్లాడే వారిలో శారీరక, మానసిక సమస్యలు
- అధిక రక్తపోటుకు దారితీస్తున్న పరిస్థితి
- ఆందోళన, ఒత్తిడికి లోనవుతున్నట్లు నిర్ధారణ
- రేడియేషన్ ప్రభావం ఉంటుందంటున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మనిషి జీవితంలో సెల్‌ఫోన్ భాగమైపోయింది. స్మార్ట్‌ఫోన్ చేతిలో లేనిదే నిమిషం కూడా గడవని పరిస్థితులు నెలకొన్నాయి. అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని అవసరం మేరకు వాడితే ఫర్వాలేదు. కానీ దానితో గంటల కొద్దీ కాలక్షేపం చేసే వారికే ముప్పు పొంచి ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. రోజులో ఎక్కువ కాల్స్ మాట్లాడితే మాత్రం ప్రమాదమే అంటున్నారు వైద్యులు. కాల్స్ ఎక్కువ మాట్లాడే వారితో పాటు, ఎక్కువసేపు ఫోన్ చూసే వారిలో శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. రేడియేషన్ ప్రభావంతో కొందరు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వివరిస్తున్నారు.



మానసిక సమస్యలివే..

సెల్ ఎక్కువగా మాట్లాడే వారిలో, చూసే వారిలో బ్లూలైట్ కంటిమీద పడి బ్రెయిన్‌లోని మెలటోనిన్ దెబ్బతింటుంది. దీంతో స్లీప్ సైకిల్ అన్‌బ్యాలెన్స్ కావడంతో నిద్రపట్టకపోవడం, మధ్యరాత్రిలో మెలకువ రావడం జరుగుతుంది. ఇలాంటి వారిలో కోపం, చిరాకు, అసహనం పెరిగిపోతుంది. విద్యార్థులైతే చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, జ్ఞాపకశక్తి లోపించడం జరుగుతోంది. దీంతో అకడమిక్స్ దెబ్బతింటాయి. ఉద్యోగులైతే పనిపై దృష్టిపెట్టలేక పోవడం, కింది స్థాయి సిబ్బందితో ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం, బిహేవియర్‌లో మార్పు వస్తుంది. కోపం విపరీతంగా పెరిగిపోతుంది. ఆకలిలేకపోవడం, తినకపోవడంతో పోషకాహారం లోపించి ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

ఆరోగ్య సమస్యలివే..

రోజులో ఎక్కువ గంటలు ఫోన్ మాట్లాడే వారిపై రేడియేషన్ ప్రభావం మెదడుపై చూపే అవకాశం ఉంది. కొందరిలో బ్రెయిన్ ట్యూమర్స్ రావచ్చు. సంతాన సాఫల్య సమస్యలు తలెత్తుతాయి. కొందరిలో వీర్యకణాల ఉత్పత్తి తగ్గడం, లైంగిక సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

సెల్‌తో ఆరోగ్య సమస్యలు..



రోజులో ఎక్కువ సమయం సెల్ మాట్లాడే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. స్ట్రెస్, యాంగ్జయిటీ కారణంగా నిద్రలేమి సమస్య తలెత్తుతోంది. ఆ ఫలితంగా రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు చుట్టుముడతాయి. రేడియేషన్ ప్రభావం వలన నరాల సమతుల్యత దెబ్బతిని, దీర్ఘకాలంలో బ్రెయిన్ ట్యూమర్స్ వచ్చే అవకాశం ఉన్నట్లు ఇటీవల పలువురు విశ్లేషిస్తున్నారు. రేడియేషన్‌లో ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు.

– డాక్టర్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్,జనరల్ మెడిసిన్, జీజీహెచ్

మానసిక ఒత్తిళ్లు ఎక్కువ..



సెల్ ఎక్కువ సేపు చూసే వారిలో, మాట్లాడే వారిలో మానసిక ఒత్తిళ్లు పెరుగుతాయి. కోపం, చిరాకు, అసహనం పెరిగిపోతుంది. ఏకాగ్రత ఉండదు. జ్ఞాపకశక్తి సమస్యలు వస్తాయి. ప్రవర్తనలో మార్పు వస్తుంది. ఇంట్లో వారిపైనా, కార్యాలయంలో సహచర సిబ్బందిపై అరవడం కేకలు వేయడం చేస్తుంటారు. అసలు ఆహారం తీసుకోకపోవడం, లేకుండా ఎక్కువ ఆహారం తీసుకోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

– దీప్తి దామర్ల, సైకాలజిస్టు, విజయవాడ

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

రాష్ట్ర సమాచార కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

రావెల(తాడికొండ): సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ టి. విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు భీమవరపు ధర్మారెడ్డి, ఈమని, భాస్కర్‌రెడ్డి, వంగపాటి బ్రహ్మం, ఏరువ లూర్దురెడ్డి, సింహాద్రి మధుసూదన్‌రెడ్డి, వరగాని వెంకటేష్ పాల్గొన్నారు.



విజయకుమార్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రతినిధులు

బావ కోసం భలే విందు

ఏకంగా 250 రకాల రుచులతో సంక్రాంతి ఆతిథ్యం

ఘంటసాల(అవనిగడ్డ): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బావకు పసైందన విందు ఇచ్చాడు బావమరిది. అది అలాంటి ఇలాంటి విందు కాదు ఏకంగా 250 రకాల రుచులతో ఇచ్చిన విందు. ఈ ఆతిథ్యాన్ని చూసిన ఆ బావ మైమరిచి పోగా.. ఈ తంతును వీక్షించిన ఆ ప్రాంత ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలంలోని చిట్టూర్పుకు చెందిన లుక్కా శ్రీనివాసరావు(వాసు) మేనల్లుడు గుర్రం వెంకట సాయినాథ్ ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లిలో ఉంటారు. సాయినాథ్ తండ్రి 18 ఏళ్ల క్రితం చనిపోగా అప్పటి నుంచి ప్రతి సంక్రాంతి పండుగకు మేనమామ ఊరైన చిట్టూర్పు వచ్చి పండుగ మూడు రోజులు ఉండి ఎంజాయ్ చేసి వెళుతుంటారు. సాయినాథ్ చెల్లెలు నవ్యని పమిడిముక్కల మండలం కృష్ణాపురానికి చెందిన కాగిత రేవంత్‌కు ఇచ్చి గత ఏడాది మేలో పెళ్లి చేశారు. రేవంత్ కేరళలోని కొచ్చిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సాయినాథ్ తన బావను తొలి పండుగ సంక్రాంతికి పిలిచి ఘనంగా విందు ఏర్పాటు చేయాలనుకున్నారు. మేనమామ ఊరైన చిట్టూర్పుకు సంక్రాంతి పండుగకు వచ్చిన సాయినాథ్ తన చెల్లి, బావను పండుగకు ఆహ్వానించారు. అన్ని రకాల పిండి వంటలు, అన్ని రకాల నాన్‌వెజ్, కూరగాయలు, ఆకుకూరలు, అన్ని రకాల చెట్నీలు, అన్ని రకాల ఫ్రూట్ జ్యూస్, అన్ని రకాల కూల్ డ్రింక్స్‌తో పాటు మొత్తం 250 రకాల వంటకాలను వడ్డించి చెల్లి, బావపై ప్రేమానురాగాలను చాటుకున్నారు.



చెల్లి, బావకు జ్యూస్ తాగిస్తున్న సాయినాథ్ దంపతులు

జాతీయస్థాయి టీ-20 విజేత బళ్లారి

- ఉత్కంఠభరితంగా ఫైనల్ మ్యాచ్
- 7 పరుగుల తేడాతో బళ్లారి విజయం
- బహుమతులు అందజేసిన సమన్వయకర్త చిన హనిమిరెడ్డి, ఎంపీ సురేష్

జే.పంగులూరు: పండగ వాతావరణం అంతా క్రికెట్ మైదానంలోనే ఉంది.. క్రికెట్ చూడటం కంటే ఆడటమే నాకు తనకు ఇష్టం అని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పానెం హనిమిరెడ్డీస్ జాతీయ స్థాయి టీ-20 క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ మనవాడు అని నన్ను ఆశీర్వదించి ఎంపీని చేసినట్లే, హనిమిరెడ్డిని కూడా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. క్రీడల్లో ఎవరూ గెలిచినా మనవాళ్లే గెలిచారనుకోవాలన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దమ్మున్న నాయకుడిని ఇన్‌చార్జ్‌గా నియమించారన్నారు. అద్దంకి నుంచి గెలిచిన అనంతరం ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ, అద్దంకి ప్రభుత్వ వైద్యశాలను 30 పడకల ఆసుపత్రి నుంచి 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషిచేస్తారన్నారు. అనంతరం హనిమిరెడ్డి మాట్లాడుతూ తాను ఆటను ఆటగానే చూస్తానని, రాజకీయకోణంలో ఆలోచించనన్నారు. కొండమంజులూరులో ఈ స్థాయిలో క్రికెట్ పోటీలు జరుగుతాయని ఊహించలేదన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. విజేత బళ్లారి జట్టుకు రూ. 6 లక్షలు, షీల్డ్‌ను ఎంపీ నందిగం సురేష్ ఇవ్వగా, బహుమతిని హనిమిరెడ్డి స్పాన్సర్ చేశారు. రెండో బహుమతిని చిక్కోలు చీతాస్‌కు రూ. 4 లక్షలు, షీల్డ్‌ను హనిమిరెడ్డి అందించారు. మూడో బహుమతిని జార్ఖండ్ జట్టుకు రూ. 2 లక్షలు, షీల్డ్‌ను కృష్ణారెడ్డి అందించారు.



బళ్లారి జట్టుకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న ఎంపీ నందిగం సురేష్

హోరీహోరీగా సాగిన మ్యాచ్‌లు..

సోమవారం మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌ఎంఏకే క్రికెట్ క్లబ్ (బళ్లారి), లెవన్ బ్రదర్స్ క్రికెట్ క్లబ్ (కామారెడ్డి) మధ్య జరిగింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బళ్లారి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కామారెడ్డి 18.5 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. 51 పరుగులు తేడాతో బళ్లారి జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

- 2వ సెమీ ఫైనల్ మ్యాచ్ మస్తాన్ లెవన్ (జార్ఖండ్), చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం) మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ నిర్ణీత 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం 11.4 ఓవర్లలో 2 వికెట్లు నష్టానికి 134 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో శ్రీకాకుళం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

విజేతగా నిలిచిన బళ్లారి..

మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్ మ్యాచ్ ఎంఏకే క్రికెట్ క్లబ్ (బళ్లారి), చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం) జట్ల మధ్య జరిగింది. ఈమ్యాచ్‌లో మొదట టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న బళ్లారి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 7 పరుగుల తేడాతో బళ్లారి జట్టు విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా జరిగింది. చివరి 6 బంతుల్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా ఆ జట్టు 13 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో బళ్లారి విజయం సాధించింది.

అయోధ్య రామునికి 'బ్రహ్మాండ' లడ్డూ


భారీ లడ్డూతో నిర్వాహకులు

పలమనేరు (చిత్తూరు జిల్లా): ఈనెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ సందర్భంగా పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం మండలం కూర్నిపల్లికి చెందిన నాగభూషణం రెడ్డి 1,265 కిలోల భారీ లడ్డూను ప్రత్యేక వాహనం ద్వారా అయోధ్యకు పంపనున్నారు. కూర్నిపల్లికి చెందిన నాగభూషణంరెడ్డి కొన్నేళ్ల క్రితం సికింద్రాబాద్‌లో స్వీట్స్ దుకాణాన్ని నడుపుతున్నారు. ఇటీవల ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని 73 కిలోల లడ్డూను అందించారు. ఈ నేపథ్యంలో శ్రీరామఆలయ కమిటీ నిర్వాహకుల ద్వారా పరిచయం ఏర్పడి ఆలయ ప్రారంభోత్సవానికి ఈ లడ్డూను అందజేస్తున్నట్లు తెలిపారు. అయోధ్యలో ఆలయ నిర్మాణాన్ని 2020 ఆగస్టు 5 ప్రారంభించిన నేపథ్యంలో.. ఈ నెల 22న ఆలయాన్ని ప్రారంభించే నాటికి 1,265 రోజులయినందుకు గుర్తుగా అన్ని కిలోల బరువున్న లడ్డూను స్వామివారికి అందజేస్తున్నట్లు ఆయన వివరించారు.

కనుల పండువగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం


ఆలయంలో నంది వాహనసేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీగిరిలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు అంబరాన్నంటాయి. సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పార్వతీ పరమేశ్వరుల లీలాకల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రవీంద్రారెడ్డి దంపతులు స్వామివార్ల కల్యాణానికి తీసుకువచ్చిన నూతన వస్త్రాలకు, చెంచులు ప్రత్యేకంగా అడవి ఆకులతో తయారు చేసిన ఆభరణాలకు ఆలయ రాజగోపురం వద్ద ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేయించి స్వామివార్లకు అలంకరించి కల్యాణానికి తీసుకుని వచ్చారు.

జల్లికట్టు.. గిత్తను పట్టు

జనసంద్రమైన రంగంపేట.. గుడివాడలో ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు



గుడివాడలో నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి సాధించిన ఎడ్ల జత

రంగంపేట జల్లికట్టులో పోట్ల గిత్తని లొంగదీసుకుంటున్న యువకులు

చంద్రగిరి/గుడివాడ టౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం కనుమ పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. చిత్తూరు జిల్లాలో జల్లికట్టు పోటీలు సందడిగా సాగాయి. జల్లికట్టులో దిగి.. కోడెగిత్తల మెడల వంచి.. వాటికి కట్టిన పలకల్ని సొంతం చేసుకునేందుకు యువకులు ఉత్సాహం చూపారు. చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో మంగళవారం నిర్వహించిన జల్లికట్టును వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున విచ్చేశారు. వీధులన్నీ ఇసుకవేస్తే రాలనంత జనంతో నిండిపోయాయి. మహిళలు మేడలు, మిద్దెలు ఎక్కి ఆసక్తికరంగా జల్లికట్టును వీక్షించారు. పౌరుషంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపారు. ఎద్దులకు కట్టిన పలకలను సొంతం చేసుకునేందుకు పోటీపడ్డారు. పశువుల యజమానులు వాటికి వెండి దేవతామూర్తుల విగ్రహాలను కట్టి బరిలోకి దింపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అక్కడక్కడా చెదురుమదురు గొడవలు తప్ప, ఆద్యంతం ఎడ్ల పందేలు ప్రశాంతంగా ముగిశాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గ్రామ దేవతకు పూజలను నిర్వహించి జల్లికట్టును వీక్షించారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

కృష్ణా జిల్లా గుడివాడలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఎడ్ల పోటీలు విజయవంతంగా ముగిశాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), ఆయన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు (చిన్ని) ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న జతలకు తొమ్మిది విభాగాలలో బహుమతులు అందజేశారు. రూ.లక్ష నుంచి రూ.5 వేల వరకు నగదు బహుమతులు అందించారు.

తగ్గని వేడి.. పందెం కోడ్ఢీ

గోదావరి జిల్లాల్లో మూడో రోజూ తలపడిన పుంజులు

కృష్ణా జిల్లాలోనూ తగ్గని జోరు



భీమవరం/అమలాపురం టౌన్: గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడి పందేలు మూడో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. పశ్చిమ గోదావరి జిల్లా పెదఅమిరం, సీసలి, పెన్నాడ, యలమంచిలి మండలం కలగంపూడి, పూలపల్లి, పోడూరు మండలం కవిటం, వీరవాసరం మండలం జొన్నలపాలెం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం ప్రాంతాల్లో పందేలు జోరుగా సాగాయి. ఏలూరు జిల్లా పరిధిలోని ఉంగుటూరు, కైకలూరు, నూజివీడు, దెందులూరు, చింతలపూడి, ఏలూరు తదితర నియోజకవర్గాల్లో పందేల జోరు కొనసాగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు రోజుల్లో దాదాపు రూ.500 కోట్లకు పైగా చేతులు మారినట్టు చెబుతున్నారు. కోడి పందేలతో పాటు గుండాట, పేకాట వంటి జూదాలు విచ్చలవిడిగా నిర్వహించారు. పందేల రాయుళ్లను ఆకర్షించేందుకు భీమవరం సమీపంలోని పెన్నాడ శిబిరం వద్ద ఎక్కువ పందేలు గెల్చుకున్న వారికి బుల్లెట్, స్కూటీ వంటి వాహనాలను బహుమతులుగా ఇచ్చారు. చిన్న గ్రామాల్లో సైతం కోడి పందేల జోరు కనిపించింది.

తూర్పున 80 బరుల్లో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 80 ప్రధాన బరుల్లో కోడి పుంజులు తలపడ్డాయి. హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డ వారంతా కుటుంబాలతో సహా సొంతూళ్లకు వచ్చి కోడి పందేల బరుల వద్దకు వెళ్లి ఆసక్తిగా తిలకించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో వెలిసిన భారీ పందెం బరిలో రూ.కోట్లు చేతులు మారాయి. మలికిపురం, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట, అమలాపురం రూరల్, అల్లవరం, రాయవరం తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో వెలిసిన బరుల్లో కోడి పందేలు జోరుగా జరిగాయి. కాకినాడ జిల్లా వేట్లపాలెం, మేడపాడు, ఉండూరు, అచ్చంపేట, పులిమేరు, తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, అనపర్తి తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో పందెం కోళ్లు సై అంటే సై అన్నాయి. కృష్ణా జిల్లాలోని ఈడుపుగల్లు, ఉప్పులూరు, గొడవర్రు, అంపాపురం, కంకిపాడు, కొత్తూరు తాడేపల్లి, మేకావానిపాలెం, ఎన్టీఆర్ జిల్లా వెలగలేరు తదితర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు.


పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెద అమిరం వద్ద ఫ్లడ్ లైట్ల వెలుతురులో కోడి పందేలు

'ప్రభ'వించిన సంక్రాంతి శోభ

ప్రభల తీర్థాలతో మురిసిన కోనసీమ


జగ్గన్నతోట వద్ద ప్రభను కౌశిక నదిని దాటిస్తున్న భక్తులు

సాక్షి, అమలాపురం: కోనసీమ వాసుల సంస్కృతీ సంప్రదాయాల్లో భాగంగా సంక్రాంతి వేళ నిర్వహించే ప్రభల తీర్థాల సంబరం అంబరాన్ని తాకింది. జిల్లా వ్యాప్తంగా మకర సంక్రాంతి, కనుమ సందర్భంగా పలుచోట్ల జరిగిన ప్రభల తీర్థాలకు భక్త జనం పోటెత్తారు. పెద్దఎత్తున తరలి వచ్చిన జనంతో తీర్థ ప్రాంతాలు కిటకిటలాడాయి. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 'జగ్గన్న తోట' ప్రభల తీర్థం జన సంద్రమైంది. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోట వద్ద మంగళవారం జరిగిన ఈ తీర్థానికి భక్తులు పోటెత్తారు. గత ఏడాది రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా జగ్గన్న తోట తీర్థాన్ని నమూనాగా ప్రదర్శించిన విషయం తెలిసిందే. అంతకు ముందు ఏడాది స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ తీర్థ ప్రాశస్త్యాన్ని అభినందించిన విషయం తెలిసిందే. ఇలా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ తీర్థాన్ని చూసేందుకు ఈ ఏడాది స్థానిక భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సుమారు 1.50 లక్షల మందికి పైగా భక్తులు ఈ తీర్థానికి వచ్చారు. అంచనాలకు మించి జనం రావడంతో తీర్థానికి వెళ్లే రహదారులన్నీ స్తంభించిపోయాయి. ఈ తీర్థానికి ఎన్ఆర్ఐలు, వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న స్థానికులు, ఇతర ప్రాంతాలకు చెందిన వారి మిత్రులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఏకాదశ రుద్రులు (11 ప్రభలు) పంట పొలాలు, కాలువలు దాటుకుని వచ్చి భక్తులను అనుగ్రహించారు. అంబాజీపేట మండలం వాకలగరువు సరిహద్దులో జరిగిన ప్రభల తీర్థంలో 52 అడుగుల ఎత్తున నిర్మించిన వాకలగరువు, తొండవరం ప్రభలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కొత్తపేటలోనూ..

కొత్తపేటలో సోమవారం నిర్వహించిన ప్రభల తీర్థంలో బాణసంచా కాల్చడాన్ని చూసేందుకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీటితోపాటు జిల్లాలోని మామిడికుదురు మండలం కొర్లగుంటలో జరిగిన తీర్థానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి 12 ప్రభలు తరలివచ్చాయి. పి.గన్నవరం, కొత్తపేట, ఆత్రేయపురం, అమలాపురం, ముమ్మిడివరం, మలికిపురం మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 60 గ్రామాల్లో ప్రభల తీర్థాలు జరిగాయి.

గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి


పూజల్లో భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి రూరల్/తిరుమల: వేదాలు, పురాణాల్లో పేర్కొన్న విధంగా సకల దేవతాస్వరూపాలైన గోవులను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. గోసంరక్షణ ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గో మహోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ గోవు గొప్పతనాన్ని భావితరాలకు అందించేందుకు గోపూజ కార్యక్రమాన్ని టీటీడీ చేపట్టినట్లు తెలిపారు. తిరుపతి, పలమనేరులోని గోశాలల్లో 2,500కు పైగా గోవులు ఉన్నట్లు చెప్పారు. టీటీడీ సహకారంతో రామచంద్ర పుష్కరిణి ఆవరణలోని కళావేదికపై శ్రీ హనుమద్దీక్షా పీఠం ఆధ్వర్యంలో 14 నుంచి కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం చేపట్టారు. భూమన పాల్గొని పూజలు నిర్వహించారు. కాగా, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

బాబుపై స్కిల్ కేసును కొట్టేయలేం

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

సాక్షి, అమరావతి: యువతలో ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుస్తామంటూ వందల కోట్లు కొట్టేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సుప్రీంకోర్టు కోలుకోలేని షాక్ ఇచ్చింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు పేరిట షెల్ కంపెనీల ద్వారా వందల కోట్ల రూపాయల్ని కాజేసినందుకు చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. బాబుకు రిమాండ్ విధిస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. అంతేకాకుండా ఈ కేసులో ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు, ప్రభుత్వ కక్షసాధింపులు లేనేలేవని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన సుప్రీం ధర్మాసనం మంగళవారం తీర్పునిచ్చింది. సీమెన్స్ సంస్థకు తెలియకుండానే ఆ కంపెనీ మాజీ అధికారులను తెరపైకి తెచ్చి... బోగస్ ఒప్పందాలతో... ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు నేరుగా వందల కోట్లను తన ఖాతాల్లోకి మళ్లించుకున్న వ్యవహారంలో ఆయనపై ఆధారాలతో సహా ఏపీ సీఐడీ విభాగం కేసు నమోదు చేయటం తెలిసిందే. కేసులో బాబును అరెస్టు చేసి, ఏసీబీ ప్రత్యేక కోర్టు ఎదుట హాజరు పరచటంతో... కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. 52 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉండి... ఆరోగ్యం బాగాలేదని, ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటానని చెప్పి షరతులతో బెయిలు తీసుకుని బయటకు వచ్చారు.

ఈ కేసులో అరెస్టయిన తరవాత చంద్రబాబు నాయుడు ఢిల్లీ నుంచి పెద్దపెద్ద న్యాయవాదులను ప్రత్యేక విమానాల్లో తెప్పించారు. మొదటి నుంచీ తనకు ఈ కేసుతో సంబంధం లేదనిగానీ, తాను అక్రమాలకు పాల్పడలేదని గానీ, డబ్బుల్ని షెల్ కంపెనీల్లోకి మళ్లించలేదని గానీ, సీమెన్స్ సంస్థ పేరిట బోగస్ ఒప్పందం చేసుకోలేదని గానీ వాదించకుండా... తాను మాజీ ముఖ్యమంత్రిని కాబట్టి, తనను అరెస్టు చేయాలంటే అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నరు అనుమతి తీసుకోవాలని, అలా తీసుకోకుండా సీఐడీ తనను అరెస్టు చేసింది కాబట్టి ఈ అరెస్టు చెల్లదని... కాబట్టి మొత్తం కేసును కొట్టేయాలని (క్వాష్ చెయ్యాలని) చంద్రబాబు వాదిస్తున్నారు. కింది కోర్టు నుంచి అత్యున్నత సుప్రీంకోర్టు వరకూ చంద్రబాబు తరఫు లాయర్లు ఇదే వాదన వినిపిస్తూ వచ్చారు. కేసును కొట్టేయడానికి కింది కోర్టు, రాష్ట్ర హైకోర్టు నిరాకరించటంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ మధ్యలోనే అనారోగ్య కారణాలు చూపించి బాబు బెయిలుపై విడుదలయ్యారు. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును వాయిదా వేసిన సర్వోన్నత న్యాయస్థానం... మంగళవారం తీర్పు వెలువరించింది. కేసును క్వాష్ చెయ్యాలన్న చంద్రబాబు అభ్యర్థనను తిరస్కరించింది. సీఐడీ పెట్టిన ఎఫ్ఐఆర్‌ను, ప్రత్యేక న్యాయస్థానం విధించిన రిమాండ్‌ను... అన్నింటినీ సుప్రీంకోర్టు బెంచ్ సమర్థించింది. అయితే గవర్నరు అనుమతి తీసుకున్నాకే చంద్రబాబును అరెస్టు చేయాలన్న సెక్షన్ 17ఏ విషయంలో ధర్మాసనంలోని ఇరువురు న్యాయమూర్తులూ భిన్నమైన తీర్పును వెలువరించారు. చంద్రబాబు నాయుడికి సెక్షన్ 17ఏ వర్తిస్తుందని, ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం గవర్నరు నుంచి అనుమతి తీసుకోవచ్చని జస్టిస్ అనిరుద్ధ బోస్ పేర్కొనగా... సెక్షన్ 17ఏ రాకముందే ఈ నేరం జరిగింది కాబట్టి చంద్రబాబుకు ఆ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా ఎం త్రివేదీ స్పష్టంచేశారు. నిజాయితీపరులైన అధికారులను వేధింపుల నుంచి కాపాడాలన్న ఉద్దేశంతోనే సెక్షన్ 17ఏను తెచ్చారని, అవినీతి పరులను కాపాడేందుకు కాదని ఆయన స్పష్టంచేశారు. చంద్రబాబు రిమాండ్ విషయంలో ఏసీబీ కోర్టు సరిగ్గానే వ్యవహరించిందని, తన పరిధి మేరకే నిర్ణయం తీసుకుందని విస్పష్టంగా చెప్పారు.

మరి ఇప్పుడేం జరుగుతుంది?

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణమనేది రాజకీయ దురుద్దేశాలతో పెట్టినదని, తనను కక్షసాధింపుతోనే అరెస్టు చేశారని చంద్రబాబు చెబుతున్నారు. సుప్రీంకోర్టు మాత్రం ఈ వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఇది అవినీతికి సంబంధించిన స్పష్టమైన కేసు అని, దీన్లో రాజకీయ దురుద్దేశాలు గానీ, కక్ష సాధింపుగానీ లేవని తేల్చిచెప్పింది. సీఐడీ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చెయ్యడానికి సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో... ఎఫ్ఐఆర్‌లో ఐపీసీ 409 (ప్రజల నమ్మకాన్ని నేరపూరితంగా వంచించటం), సెక్షన్ 120బి (దురుద్దేశపూర్వక కుట్ర) వంటివి సెక్షన్ 17ఏతో సంబంధం లేనివి కనుక యథాతథంగా కొనసాగుతాయి. ఐపీసీ 409 కింద నేరం గనక రుజువైతే యావజ్జీవ శిక్ష పడుతుంది. కాకపోతే సెక్షన్ 17ఏ వర్తిస్తుందా? లేదా? అన్న విషయంలో మాత్రం బెంచ్‌లోని ఇద్దరు న్యాయమూర్తులూ భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు కాబట్టి... ఈ అంశాన్ని ఇద్దరికన్నా ఎక్కువ మంది న్యాయమూర్తులుండే విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సిందిగా కోరుతూ... కేసు ఫైళ్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఉంచాలని కోర్టు రిజిస్ట్రీని బెంచ్ ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం మేరకు బెంచ్ ఏర్పాటు ఉంటుంది. తీర్పుల కాపీలు అప్‌లోడ్ చేయకపోవడంతో అందులోని పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

జస్టిస్ బోస్ ఏం చెప్పారంటే...

చంద్రబాబుపై కేసు నమోదు చేసే ముందు సెక్షన్ 17(ఏ) ప్రకారం ముందస్తు అనుమతి (గవర్నర్ నుంచి) తీసుకోవడం తప్పనిసరి అని జస్టిస్ బోస్ తన తీర్పులో పేర్కొన్నారు. అలా ముందస్తు అనుమతి తీసుకోకుండా చేపట్టే విచారణ లేదా దర్యాప్తు చట్ట విరుద్ధమవుతుందని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. అందువల్ల అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(1)(సీ), 13(1)(డీ), 13(2) ప్రకారం చంద్రబాబు విషయంలో ముందుకు వెళ్లడానికి వీల్లేదన్నారు. అయితే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గవర్నరు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవచ్చని, తదనంతరం అవినీతి నిరోధక చట్టం కింద (పీసీ యాక్ట్) చంద్రబాబు విషయంలో ముందుకెళ్లవచ్చునని తెలిపారు. అలాగే తనపై సీఐడీ నమోదు చేసిన కేసును, తనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేయాలన్న చంద్రబాబు అభ్యర్థనను తోసిపుచ్చుతున్నట్లు జస్టిస్ బోస్ తన తీర్పులో స్పష్టంగా పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద ముందస్తు అనుమతి తీసుకోనంత మాత్రాన రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కాకుండా పోవని ఆయన తేల్చి చెప్పారు.


జస్టిస్ బేలా త్రివేది...

17 (ఏ) ప్రకారం ముందస్తు అనుమతి తీసుకోవాలని జస్టిస్ బోస్ తన తీర్పులో వ్యక్తం చేసిన అభిప్రాయాలతో మరో న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం త్రివేది విభేదించారు. సెక్షన్ 17(ఏ) అమల్లోకి రాకమునుపే ఈ నేరం జరిగిందని... అది అమల్లో లేని కాలానికి దానిని వర్తింప చేయలేమని జస్టిస్ త్రివేది తీర్పునిచ్చారు. అవినీతి నిరోధక చట్టానికి 2018లో సవరణలు చేసి సెక్షన్ 17(ఏ)ను చేర్చిన నేపథ్యంలో... 2018కి ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17(ఏ) వర్తించదని, 2018, ఆ తరవాత జరిగిన నేరాలకే ఈ సెక్షన్ వర్తిస్తుందని ఆమె స్పష్టంగా పేర్కొన్నారు. చట్ట సవరణ చేసిన శాసనవ్యవస్థ ఉద్దేశం కూడా ఇదేనన్నారు. "17(ఏ)ను పూర్వ నేరాలకు వర్తింప చేయడానికి ఎంత మాత్రం వీల్లేదు. 17(ఏ) రావడానికి ముందున్న కాలానికి దీన్ని వర్తింప చేస్తే కొత్తగా అనేక వివాదాలకు తెరలేపినట్లవుతుంది. 2018కి ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17(ఏ)ను వర్తింప చేస్తే చట్ట సవరణ చేసిన ఉద్దేశం నెరవేరకుండా పోతుంది" అని ఆమె తేల్చి చెప్పారు.

ప్రాథమిక దశలోనే దర్యాప్తునకు విఘాతం కలిగించినట్లవుతుంది...

శాసనవ్యవస్థ సెక్షన్ 17(ఏ)ను తీసుకొచ్చిన ఉద్దేశానికి మరో రకమైన భాష్యం చెప్పినా కూడా అది అసమంజసమే అవుతుందని జస్టిస్ బేలా త్రివేదీ తెలిపారు. అంతేకాక ప్రాథమిక దశలోనే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలిగించినట్లు అవుతుందన్నారు. "2018కి ముందు కేసులకు కూడా సెక్షన్ 17(ఏ) వర్తిస్తుందన్న సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనతో ఏకీభవిస్తే, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లోని విచారణలు, దర్యాప్తులు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. దీని వల్ల చాలా కేసులు నిరర్థకంగా మారతాయి. అవినీతిని రూపుమాపేందుకు తీసుకొచ్చిన చట్టం తాలుకు ముఖ్య ఉద్దేశం నెరవేరకుండా పోతుంది. అసలు అధికార విధుల్లో భాగంగా తీసుకున్న నిర్ణయాలపై వేధింపులకు గురికాకుండా నిజాయతీపరులైన అమాయక అధికారులను కాపాడటానికే సెక్షన్ 17ఏను తీసుకువచ్చారు. అంతేతప్ప అవినీతిపరులైన పబ్లిక్ సర్వెంట్లకు రక్షణ కల్పించడానికి కాదు" అని జస్టిస్ బేలా తన తీర్పులో విస్పష్టంగా చెప్పారు.

విధుల్లో భాగం కాని నిర్ణయాలకు రక్షణ ఇవ్వకూడదు..

అవినీతి నిరోధక చట్టం సెక్షన్లతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద కూడా కేసు నమోదైనప్పుడు, కేసు నమోదుకు ముందు సెక్షన్ 17(ఏ) కింద అనుమతి తీసుకోలేదన్న కారణంతో ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడం సాధ్యం కాదన్నారు. అధికార విధుల్లో భాగం కాని నిర్ణయాలకు సెక్షన్ 17(ఏ) కింద రక్షణ ఇవ్వడానికి వీల్లేదన్నారు. ఏసీబీ కోర్టు తనకున్న పరిధి మేరకే రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. చంద్రబాబును రిమాండ్‌కు పంపడం ద్వారా ఏసీబీ ప్రత్యేక కోర్టు ఎలాంటి తప్పు చేయలేదని జస్టిస్ బేలా త్రివేది తన తీర్పులో పేర్కొన్నారు. హైకోర్టు తీర్పులో సైతం ఎలాంటి దోషం గానీ, చట్ట విరుద్ధత గానీ లేదన్నారు. హైకోర్టు తీర్పులో ఏ రకంగానూ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ఆమె తన తీర్పులో స్పష్టం చేశారు.

మూడు నెలల తరువాత తీర్పు...

ఈ తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం విచారణ జరిపింది. ప్రధానంగా సెక్షన్ 17(ఏ)పై సుదీర్ఘ వాదనలు జరిగాయి. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, అభిషేక్ సింఘ్వీ, సిద్దార్థ లూత్రా వాదనలు వినిపించగా, సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్, ఎస్.నిరంజన్ రెడ్డి, అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. వాదనల అనంతరం అక్టోబర్ 17న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. దాదాపు 3 నెలల తరువాత మంగళవారం తీర్పును వెలువరించింది. ఇరువురు న్యాయమూర్తులు కూడా సెక్షన్ 7(ఏ) విషయంలో భిన్న తీర్పులు వెలువరించారు.

ఇక ఇప్పుడేమని అరుస్తారు..?

కేసు కొట్టివేతకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం తనపై అన్యాయంగా కేసు పెట్టిందని, రాజకీయంగా వేధించేందుకు జైల్లో పెట్టారంటూ చంద్రబాబు, ఆయన వందిమాగధులు చేస్తూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తేలిపోయింది. తన తండ్రి విషయంలో ఏసీబీ కోర్టు అన్యాయంగా వ్యవహరించిందంటూ నారా లోకేష్ ఎల్లో మీడియా ఇంటర్వ్యూల్లో చేసిన ఆరోపణలు బూటకమని రుజువైంది. బాబుకు రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు జడ్జిని, రిమాండ్‌లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని సోషల్ మీడియాలో దారుణంగా దూషించిన టీడీపీకి సుప్రీం తీర్పు చెంపదెబ్బ కన్నా ఎక్కువే.

సెక్షన్ 17(ఏ)ను తేల్చనున్న సీనియర్ న్యాయమూర్తి...

ఇరువురు న్యాయమూర్తులు భిన్న తీర్పులు వెలువరించిన నేపథ్యంలో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం ఏర్పాటవుతుంది. ఈ విషయంలో సీజే జస్టిస్ చంద్రచూడ్ పాలనాపరమైన నిర్ణయం తీసుకుంటారు. జస్టిస్ బోస్ కన్నా సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలో విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేస్తారు. జస్టిస్ బోస్ ఇప్పుడు సీనియారిటీలో 5వ స్థానంలో ఉన్నారు. కాబట్టి ఆయనకన్నా సీనియర్లు అయిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ లేదా రెండవ స్థానంలో ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా, లేదా మూడవ స్థానంలో ఉన్న జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ లేదా నాల్గవ స్థానంలో ఉన్న సూర్యకాంత్.. ఈ నలుగురిలో ఒకరి నేతృత్వంలో విస్తృత ధర్మాసనం ఏర్పాటవుతుంది. ఈ విస్తృత ధర్మాసనంలో కొత్తగా వచ్చే సీనియర్ న్యాయమూర్తితో పాటు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేది కూడా ఉంటారు. ఈ ముగ్గురు కలిసి తిరిగి మొదటి నుంచి చంద్రబాబు కేసును విచారిస్తారు. జస్టిస్ బోస్, జస్టిస్ బేలా త్రివేది ఇప్పటికే ఓ నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో విస్తృత ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి నిర్ణయం కీలకమవుతుంది. అలాగే జస్టిస్ బోస్, జస్టిస్ బేలా త్రివేది కేవలం సెక్షన్ 17(ఏ) విషయంలోనే భిన్నమైన తీర్పులు ఇచ్చిన నేపథ్యంలో విస్తృత ధర్మాసనం సైతం ఇదే అంశంపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. విస్తృత ధర్మాసనంలో ఉండే సీనియర్ న్యాయమూర్తి ఇప్పటికే నిర్ణయం వెలువరించిన ఇరువురు న్యాయమూర్తుల్లో ఒకరి నిర్ణయాన్ని సమర్థించవచ్చు. ఎవరి తీర్పును సమర్థిస్తారో అప్పుడు 2 :1గా మెజారిటీతో ఆ తీర్పు ఖరారు అవుతుంది. ఒకవేళ జస్టిస్ బోస్, జస్టిస్ బేలా త్రివేదిల నిర్ణయాలతో ఏకీభవించకుండా ఆ సీనియర్ న్యాయమూర్తి మరో భిన్నమైన నిర్ణయాన్ని వెలువరిస్తే, అప్పుడు ప్రధాన న్యాయమూర్తి ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి ఈ కేసును పంపాల్సి ఉంటుంది.

మొట్టమొదటిసారి.... విచారణ ముంగిట చంద్రబాబు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసును కొట్టేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో చంద్రబాబు ఈ కేసులో తొలిసారిగా కోర్టు విచారణను ఎదుర్కోనున్నారు. స్కిల్ కేసులో సీఐడీ తన దర్యాప్తును పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసిన తరువాత ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం విచారణను (ట్రయల్) మొదలు పెడుతుంది. విచారణ జరిగే ప్రతీ సందర్భంలోనూ చంద్రబాబు కోర్టు ఎదుటకు హాజరు కావడం తప్పనిసరి. ఈ విధంగా చంద్రబాబు ఓ కేసులో కింది కోర్టులో విచారణను ఎదుర్కోవడం ఇదే తొలిసారి. చంద్రబాబుపై కర్షక పరిషత్ కేసు మొదలుకుని ఇప్పటి వరకు ఎన్నో కేసులు నమోదయ్యాయి. అత్యధిక కేసుల్లో చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందారు. చాలా కేసులను నేరం లోతుల్లోకి వెళ్లనివ్వకుండా సాంకేతిక కారణాలతో కొట్టేయించుకున్నారు. ఏ కోర్టు కూడా ఏ ఒక్క కేసులోనూ పూర్తిస్థాయి విచారణ (ట్రయల్) జరిపి చంద్రబాబు నేరం చేయలేదని క్లీన్‌చిట్ ఇచ్చిన సందర్భాలు లేవు. టెక్నికల్ అంశాలను లేవనెత్తుతూ అన్ని కేసుల్లోనూ తనకు మాత్రమే సాధ్యమైన 'మేనేజ్‌మెంట్ స్కిల్స్'తో చంద్రబాబు ఇప్పటి వరకు బయటపడ్డారు. ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించి లక్ష్మీపార్వతి దాఖలు చేసిన కేసును సైతం హైదరాబాద్ ఏసీబీ కోర్టు సాంకేతిక కారణాలతోనే కొట్టేసింది. ఈ కేసును కొట్టేసిన న్యాయాధికారి అటు తరువాత జస్టిస్ ఎన్వీ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో హైకోర్టు జడ్జి అయ్యారు. ఇప్పుడు స్కిల్ కుంభకోణంలో అలా బయటపడేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. విస్మయకరంగా అరెస్టయిన 3 రోజులకే కేసు కొట్టేయాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే ఈసారి పాచికలు పారలేదు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆయనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేసేందుకు నిరాకరించాయి. దీంతో ఆయన ఏసీబీ కోర్టు విచారణను ఎదుర్కోక తప్పడం లేదు.

బాబు కుంభకోణం నేపథ్యం ఇదీ..

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు పేరుతో షెల్ కంపెనీల ద్వారా ఖజానాకు చెందిన రూ.వందల కోట్లను కొల్లగొట్టారని పేర్కొంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. కేసులో చంద్రబాబును నిందితునిగా చేర్చింది. గతేడాది సెప్టెంబర్ 9న ఆయనను అరెస్ట్ చేసి 10న విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచింది. విచారణ జరిపిన ఏసీబీ కోర్టు చంద్రబాబుకు రిమాండ్ విధించింది. అనంతరం సీఐడీ చంద్రబాబును తమ కస్టడీలోకి తీసుకుని విచారించింది. దీంతో ఈ కుంభకోణంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయడంతో పాటు తనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను కూడా కొట్టేయాలంటూ చంద్రబాబు సెప్టెంబర్ 12న హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అరెస్టయిన 3 రోజులకే ఆయన ఈ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం విశేషం. ఈ పిటిషన్‌లో తన తరఫున వాదనలు వినిపించేందుకు చంద్రబాబు దేశంలోనే అత్యధిక ఫీజులు వసూలు చేసే ప్రముఖ న్యాయవాదులను రంగంలోకి దించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం, చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేసేందుకు జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. ఏసీబీ కోర్టు రిమాండ్ ఉత్తర్వుల్లో సైతం జోక్యానికి నిరాకరించారు. అంతేకాక సెక్షన్ 17(ఏ) కూడా వర్తించదని సెప్టెంబర్ 22న వెలువరించిన తీర్పులో జస్టిస్ శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో చంద్రబాబే అవినీతి తిమింగళం అని మరోసారి నిగ్గు తేలింది. యువతకు నైపుణ్య శిక్షణ పేరిట ఆయన గారు సాగించిన బాగోతం చూసి యావత్ దేశం అవాక్కయ్యింది. అసలు జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో ప్రాజెక్ట్‌ను కాగితాలపై సృష్టించడం.. రూ.370 కోట్ల ప్రాజెక్ట్ వ్యయాన్ని ఏకంగా రూ.3,300 కోట్లకు పెంచడం.. సీమెన్స్ కంపెనీ పేరున జీవో జారీ చేసి, తన బినామీ కంపెనీ డిజైన్ టెక్ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం.. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధులు రూ.271 కోట్లు విడుదల చేయడం.. షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధులు తన నివాసానికే చేర్చడం.. పైగా అంతా పద్ధతి ప్రకారం చేశామంటూ అడ్డగోలుగా వాదించడం.. మరోమారు చర్చకు వచ్చింది.



స్కిల్ దొంగ బాబే

సాక్ష్యాధారాలు బలంగా ఉన్నందుకే జోక్యం చేసుకోని సుప్రీంకోర్టు

ప్రాజెక్ట్ రూపకల్పన నుంచి నిధులు కొల్లగొట్టడం వరకు అంతా ఆయనే

- కుట్రదారు, లబ్ధిదారు చంద్రబాబే
- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్ట్
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్ రూ.3,300 కోట్లకు పెంపు
- తన మురానూ మోహరించి అడ్డగోలుగా లూటీ
- సీఐటీడీ నివేదిక ఇవ్వక మునుపే డిజైన్ టెక్‌కు నిధులు
- ఉన్నతాధికారులు వద్దన్నా బేఖాతరు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు
- అన్ని ఆధారాలు సంపాదించి కోర్టు ముందుంచిన సీఐడి
- అందుకే చంద్రబాబుకు రిమాండ్.. జైల్లో 52 రోజులు

ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసులో నిందితులు


- ఏ1 చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి
- ఏ2 కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి
- ఏ3 గంటా సుబ్బారావు, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ-సీఈవో
- ఏ4 కె.లక్ష్మీ నారాయణ, రిటైర్డ్ ఐఏఎస్, ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారు
- ఏ5 నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, మాజీ ఓఎస్డీ, ఏపీఎస్ఎస్‌డీసీ
- ఏ6 అపర్ణ ఉపాధ్యాయుల, ఐఏఎస్, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవో
- ఏ7 ప్రతాప్ కుమార్ కర్, టీడీపీ ప్రభుత్వంలో ఫైనాన్సియల్ ఆఫీసర్, ఏపీఎస్ఎస్‌డీసీ
- ఏ8 సుమన్ బోస్, సీమెన్స్ ఇండియా మాజీ ఎండీ
- ఏ9 జీవీఎస్ భాస్కర్ ప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ హెడ్
- ఏ10 వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, డిజైన్‌టెక్ ఎండీ

వీరితోపాటు మొత్తం 40 మంది నిందితులు

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ వంటి ఎన్నో కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన అక్రమ నిధుల తరలింపు కోసం ఏర్పాటు చేసుకున్న అవినీతి నెట్‌వర్క్ గుట్టును సీఐడీ ఛేదించడం.. స్కిల్ స్కామ్‌లో ఏసీబీ కోర్టు బాబుకు రిమాండ్ విధించడం.. సాక్ష్యాధారాలన్నీ బలంగా ఉండటంతో ఏసీబీ కోర్టు తీర్పులో, విచారణలో జోక్యం చేసుకోమని సుప్రీంకోర్టు చెప్పడం చూస్తుంటే చంద్రబాబే అసలు దొంగ అని మరోసారి ఎలుగెత్తి చాటినట్లయింది. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ప్రాజెక్ట్‌ను రూపొందించింది ఆయనేనని, అక్రమంగా మళ్లించిన నిధులు చేరింది ఆయన నివాసానికే అన్నది సీఐడీ నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. దాంతో సీఐడీ ఆయనపై కేసు నమోదు చేసింది. కీలక ఆధారాలతో ఈ కేసులో చంద్రబాబును ఏ-1గా పేర్కొంటూ చార్జ్‌షీట్ నమోదు చేసింది. ఆయనపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఏ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1) (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా వ్యవహరించిన కింజరాపు అచ్చెన్నాయుడు ఏ-2గా, మరో 38 మందిని నిందితులుగా పేర్కొంటూ సిట్ కేసు నమోదు చేసింది. గత ఏడాది సెప్టెంబరు 9న చంద్రబాబును అరెస్ట్ చేసి విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరిచింది. ఈ స్కామ్‌లో చంద్రబాబు పాత్రను నిర్ధారిస్తూ సీఐడీ అధికారులు సమర్పించిన నివేదికతో సంతృప్తి చెందిన న్యాయమూర్తి ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. దాంతో పోలీసులు ఆయన్ను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఖైదీ నంబర్ 7691గా ఆయన అక్కడ 52 రోజులు జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. పలుమార్లు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైన తర్వాత అనారోగ్య కారణాలను చూపిస్తూ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. విజనరీగా వేసుకున్న ముసుగు తొలగి చంద్రబాబు ఏ-1 అన్న నిజం ప్రపంచానికి తెలిసింది. స్కిల్ స్కామ్ ఎలా సాగిందంటే..

సీమెన్స్ పేరిట ఉత్తుత్తి ప్రాజెక్టు

- డిజైన్ టెక్ కంపెనీకి చెందిన సంజయ్ దంగాను పిలిపించుకుని యువతకు నైపుణ్యాల శిక్షణ పేరిట ఉత్తుత్తి ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ ముసుగులో ఆ కంపెనీకి ఏమాత్రం తెలియకుండానే ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భారత్‌లో ఆ కంపెనీ ఎండీగా ఉన్న సుమన్ బోస్, డిజైన్‌టెక్ ఎంపీ వికాస్ వినాయక్ కన్విల్కర్ సహకారంతో చంద్రబాబు అక్రమాలకు తెర తీశారు.
- విద్యా శాఖ ద్వారా సీమెన్స్ కంపెనీ పేరుతో 2014 ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకు జీవో జారీ చేశారు. కేబినెట్ ఆమోదం కూడా లేకుండానే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఏర్పాటు చేశారు. తద్వారా సీమెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు మభ్యపుచ్చారు.
- ఈ ప్రాజెక్ట్‌లో చంద్రబాబు బినామీలు, సన్నిహితులే అంతా తామై వ్యవహరించారు. ఏపీఎస్ఎస్‌డీసీకి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, చంద్రబాబు సన్నిహితుడు కే లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. గంటా సుబ్బారావును ఏకంగా ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ-సీఈవో పోస్టుతోపాటు ఉన్నత విద్యా శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ - ఇన్నోవేటివ్ కార్పొరేషన్ కార్యదర్శి, ముఖ్యమంత్రికి ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టారు.
- ఉన్నత విద్య శాఖ ముఖ్య కార్యదర్శికి ఎలాంటి పాత్ర లేకుండా గంటా సుబ్బారావుతో నేరుగా నిధులు మంజూరు ప్రక్రియ కొనసాగించడానికి కుతంత్రం పన్నారు. అనంతరం సీమెన్స్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ జీవీఎస్‌భాస్కర్ సతీమణి, యూపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి అపర్ణను ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవోగా నియమించారు. ఇది పరస్పర ప్రయోజనాల విరుద్ధ చట్టానికి వ్యతిరేకమైనా సరే చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు.
- సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర అంశాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, ప్రాథమిక నివేదిక ప్రకారం ఈ ప్రాజెక్టు విలువ రూ.370 కోట్లు మాత్రమే. చంద్రబాబు దీన్ని అమాంతం రూ.3,300 కోట్లకు పెంచేసి ఆ మేరకు నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం పది శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు.




Note #3
Minutes approved. Circulate file as per business rules.
18/11/2016 3:00 PM
NARA CHANDRABABU NAIDU
(CHIEF MINISTER)
Digitally Signed

Note #6
18/11/2016 4:31 PM
R. P. SISODIA, IAS
(PRINCIPAL SECRETARY)
Digitally Signed

షెల్ కంపెనీల ద్వారా డబ్బులు

- డిజైన్ టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి వివిధ దశల్లో అక్రమంగా తరలించారు. ప్రతి దశలోనూ షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబుకు రూ.241 కోట్లు చేర్చారు. టీడీపీ ప్రభుత్వం పుణేకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించింది.
- డిజైన్ టెక్ కంపెనీ నుంచి పుణెలోని పీవీఎస్పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐ కంపెనీకి రూ.2.71 కోట్లు అంటే మొత్తం రూ.241 కోట్లు తరలించారు.
- మొత్తం రూ.140.53 కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించారు. మనోజ్ పార్థసాని ఆ నగదు మొత్తాన్ని చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో ముట్టజెప్పారు. అంటే ఆ రూ.140.53 కోట్లను చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.



- మిగిలిన రూ.100.47 కోట్లను పీవీఎస్పీ కంపెనీ దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులను మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అనంతరం చంద్రబాబు బంగ్లాకు చేర్చారు. ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన రూ.241 కోట్లు అవినీతి నెట్‌వర్క్ ద్వారా ఇలా గుట్టు చప్పుడు కాకుండా చంద్రబాబు బంగ్లాకు వచ్చి చేరాయి.

అమెరికాకు శ్రీనివాస్.. దుబాయ్‌కి మనోజ్

- అక్రమ నిధుల తరలింపు పాత్రధారులు చంద్రబాబు ఆదేశాలతో విదేశాలకు పరారయ్యారు. విచారణకు రావాలని నోటీసులు జారీ చేయగానే చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు, షాపూర్జీ-పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని దుబాయ్‌కు ఉడాయించారు. టీడీపీ హయాంలోనే 2017లోనే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం గుట్టు రట్టైంది.
- కేంద్ర జీఎస్టీ అధికారులు పుణెలోని పలు షెల్ కంపెనీల్లో సోదాలు చేసి భారీగా నకిలీ ఇన్‌వాయిస్‌లను గుర్తించారు. వాటిలో ఏపీఎస్ఎస్‌డీసీకి సరఫరా చేసిన నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించడంతో ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే దీనిపై విచారణ చేయకుండా ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లను మాయం చేశారు.

ప్రాజెక్ట్ గురించి తెలియదన్న సీమెన్స్

- సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు తమకు ఆ ప్రాజెక్టు గురించే తెలియదని స్పష్టం చేసింది. ఆ వెంటనే సీమెన్స్ కంపెనీ భారత్‌లోని తమ ఎండీ సుమన్ బోస్‌ను పదవి నుంచి తొలగించింది. ఈ కేసులో కీలక సాక్షులైన ఐవైఆర్ కృష్ణారావు, పీవీ రమేశ్, సునీత తదితరులు చంద్రబాబు ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా నిధులను విడుదల చేసినట్లు వాంగ్మూలం ఇచ్చారు. స్కిల్ స్కామ్‌లో కీలక పాత్రధారిగా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా మొత్తం అవినీతి నెట్‌వర్క్‌ను వెల్లడిస్తూ వాంగ్మూలం ఇచ్చారు. ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణానికి కర్త కర్మ క్రియ అంతా చంద్రబాబే అన్నది నిర్ధారణ అయింది.
- తాము ఇచ్చింది మూడో పార్టీ నివేదికే కాదని.. కేవలం ఏపీఎస్ఎస్‌డీసీ ఇచ్చిన పత్రాల పరిశీలన మాత్రమేనని సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) స్పష్టం చేసింది. సీఐటీడీ నివేదిక ఇవ్వక మునుపే డిజైన్ టెక్‌కు టీడీపీ సర్కారు నిధులు విడుదల చేసేసింది.
- ఈ కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. షెల్ కంపెనీల లావాదేవీల విషయాన్ని గుర్తించింది. ఇప్పటికే రూ.70 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు నిర్ధారించింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ శుక్రవారం జప్తు చేసింది. మొత్తం 26 మందికి నోటీసులు జారీ చేసి పలువురిని ఇప్పటికే విచారించింది. పలువురిని అరెస్టు చేసింది. ఈ ప్రాజెక్టులో రూ.355 కోట్ల మేర ఖజానాకు గండి పడిందని కాగ్ కూడా నిగ్గు తేల్చింది. ఈ వాస్తవాల కారణంగానే.. ఈ కేసు 2017లో నమోదైనందున చంద్రబాబుకు 17ఏ వర్తించదని సుప్రీంకోర్టు కూడా చెప్పడం గమనార్హం. న్యాయ నిపుణులు కూడా పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుందని తేల్చి చెబుతున్నారు.

నో రూల్స్.. రూ.371 కోట్లు ఇచ్చేయండి

- సీమెన్స్ కంపెనీకి తెలియకుండా సుమన్ బోస్ నడిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో (నేరుగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబుకు లేఖలు రాశారు) గ్రాంట్ ఇన్ ఎయిడ్ అనే పదం ఎక్కడా లేదు. ఆ స్థానంలో 'గ్రాంట్ ఇన్ కైండ్' అని పేర్కొన్నారు. ప్రాజెక్టు వ్యయంగా చెప్పుకున్న రూ.3,300 కోట్లలో 90 శాతం కాదు కదా కనీసం ఒక్క రూపాయి విలువైన ఆర్థిక సహకారంగానీ, వస్తు సహాయాన్ని గానీ అందించలేదు. అయినా ఏపీఎస్ఎస్‌డీసీ తన వాటా కింద జీఎస్టీ కలిపి డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించేశారు.
- అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్, ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సునీత అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. ఈ విషయాన్ని పీవీ రమేశ్ తన నోట్ ఫైల్‌లో పొందుపరిచారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు కూడా ఒప్పుకోలేదు. అయినప్పటికీ చంద్రబాబు.. గంటా సుబ్బారావు చెప్పినట్లుగా నిధులు విడుదల చేయాలని ఐవైఆర్ కృష్ణారావును ఆదేశించారు.
- దీంతో నోట్ ఫైళ్లలో సీఎం కాలమ్‌లో 'ఏఐ' (ఆఫ్టర్ ఇష్యూ..) అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోట్ చేశారు. అప్పటి సీఎం ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి మొత్తం 13 నోట్ ఫైళ్లలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు సంతకాలు చేశారు. అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు 5 చోట్ల సంతకాలు చేశారు.

సుప్రీం కోర్టుకు పాదాభివందనం

1,206వ రోజు రిలే నిరాహార దీక్షలలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: అవినీతి కేసుల్లో చంద్రబాబును అరెస్టు చేయడం సబబే అని తీర్పిచ్చిన అత్యున్నత న్యాయస్థానానికి రాష్ట్ర ప్రజలు, బహుజనులు పాదాభివందనాలు చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,206వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు మంగళవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. చేయాల్సిన తప్పులన్నీ చేసిన చంద్రబాబు వ్యవస్థలను సైతం మోసం చేసేందుకు లక్షల కోట్లు వెచ్చించి న్యాయవాదులను పెట్టుకొని స్క్వాష్ పిటిషన్ వేయడం న్యాయస్థానాలను తప్పుదారి పట్టించేందుకు కాదా అని ప్రశ్నించారు. ఆధారాలతో సహా దొరికిన చంద్రబాబు తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేయని దొడ్డిదారి యత్నాలు లేవని, కానీ న్యాయస్థానం ఎదుట ఎవరైనా ఒకటే అని నేడు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. వంద గొడ్లు తిన్న రాబందు ఒక్క గాలివానకు కొట్టుకెళ్ళినట్లు బాబుపై వచ్చిన తీర్పు పట్ల యావత్ దేశంలో అవినీతిపరుల వెన్నులో వణుకు పుట్టిస్తుందనడంలో సందేహం లేదన్నారు. అమరావతి పేరుతో ఈ ప్రాంతాన్ని నిలువునా దోచేందుకు సింగపూర్ మంత్రులు, కంపెనీలతో కుమ్మక్కై భారీ అవినీతికి తెర లేపిన బాబుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరింత భారీ కుంభకోణాలు బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. రాజధాని అంటే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు చేరువలో ఉండాలి కానీ బాబు గుప్పెట్లో పెట్టుకునే ఎత్తుగడతో తన సామాజిక వర్గానికి పెద్దపీట వేసి పేదలు ఈ ప్రాంతంలో నివసిస్తే సామాజిక అసమతుల్యత వస్తుందంటూ తప్పుడు కేసులు వేయించడం వెనుక బాబు హస్తం ఉందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి ఇలాంటి వివక్షపూరిత వ్యవహారాలు భవిష్యత్తులో జరగకుండా ఉండేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు పులి దాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, మాదిగాని దినేష్, నూతక్కి జోషి దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అమాయక చక్రవర్తి కాదు

- బాబు బోనులో దొంగలా నిలబడి సమాధానం చెప్పాల్సిందే
- సుప్రీంకోర్టు తీర్పును తప్పుదోవ పట్టించేలా ఎల్లో మీడియా ప్రచారం
- కోర్టులో చంద్రబాబుకు ఏ రకమైన రిలీఫ్ దొరకలేదు
- ఓటుకు నోటు కేసులో దొరికిపోయినప్పుడు సెక్షన్ 8 అన్నాడు..
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ): చంద్రబాబు 'స్కిల్' దొంగేనని, ఆయన అమాయక చక్రవర్తి అని ఏ కోర్టూ సర్టిఫికెట్ ఇవ్వలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. చంద్రబాబు అన్ని కేసుల్లోనూ బెయిల్ తెచ్చుకొని బయట తిరుగుతున్నారని తెలిపారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఒకటైతే.. ఎల్లో మీడియా మరో రకంగా ప్రచారం చేస్తోందని అన్నారు. కొన్ని చానళ్లు బాబు గొప్ప విజయం సాధించారని, ఆయనకు ఏదో ఊరట కలిగిందని, ఆయన సుప్రీం కోర్టులో వేసిన కేసులో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. 2019లో చంద్రబాబుకు వచ్చిన 23 సీట్లను గొప్ప విజయంగా చూపిస్తే ఏ రకంగా ఉంటుందో.. నేడూ అదే విధంగా కనిపిస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పులో చంద్రబాబుకు ఏ రకమైన రిలీఫ్ కలగలేదన్నారు. వాస్తవానికి ముందుగా గమనించాల్సింది సెక్షన్ 17 ఏ వర్తిస్తుందా లేదా అనేది ఒక ప్రొసీజరల్ సెక్షన్ మాత్రమే అని అన్నారు. 2018లో అమల్లోకి వచ్చిన ఈ సెక్షన్ ఈ కేసుకు వర్తించదని, స్కిల్ స్కాం 2015 ప్రాంతంలోనే జరిగిందని చెప్పారు. చంద్రబాబు, పార్టీ నాయకులు తప్పు చేయలేదని వారి లాయర్లు కూడా ఎక్కడా అనడంలేదన్నారు. రూ. 370 కోట్ల ప్రజాధనాన్ని దోచుకోలేదని ఎక్కడా వారి వాదనల్లో చెప్పలేదని గుర్తు చేశారు. గవర్నర్ అనుమతి లేదనో, స్పీకర్‌కు చెప్పలేదనో 17 ఏని చూపించి క్వాష్ చేయాలని కోరారని తెలిపారు. రిమాండ్ ప్రక్రియలో లోపం లేదని ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయాన్ని చెప్పారని, 17 ఏ వర్తించే విషయంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని చెప్పారు. రిమాండ్ అంతా పద్ధతి ప్రకారమే జరిగిందని ఇద్దరు జడ్జీలూ చెప్పారన్నారు.

గతంలోనూ ఇదే ధోరణి


చంద్రబాబు గతంలో ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయినప్పుడు కూడా ఇదే రకమైన వాదనలు చేశారని, సెక్షన్ 8 అమల్లో ఉందని, మీకూ పోలీసులున్నారని.. మాకూ ఉన్నారని.. మీకూ ఏసీబీ ఉందని.. మాకూ ఉంది అంటూ చంద్రబాబు మాట్లాడారని మంత్రి గుర్తు చేశారు. ఇలాంటి వితండ వాదం చేసి తప్పించుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. గతంలో కేసులకు సెక్షన్ 17ఏ వర్తించదని దాదాపు ఆరు కోర్టులు చెప్పాయన్నారు. అంత క్లియర్‌గా ఉందని అన్నారు. ఈ రోజు వచ్చిన తీర్పు చూసిన తర్వాత చంద్రబాబు న్యాయస్థానంలో బోనులో, విచారణ సంస్థల ముందు దొంగలా నిలబడి సమాధానం చెప్పాల్సిందేనన్నారు. బాబు 52 రోజులు జైలు శిక్ష అనుభవించి, ఆరోగ్య కారణాలు చెప్పి బెయిల్‌పై ఉన్న ఒక దొంగే తప్ప నిజాయితీపరుడు, అమాయక చక్రవర్తి అని న్యాయస్థానాలు చెప్పలేదని మంత్రి అన్నారు.

లేని పార్టీకి ఎవరు అధ్యక్షులయితే మాకేంటి?

ఈ రాష్ట్రంలో లేని పార్టీకి ఎవరు అధ్యక్షులు అయితే మాకేంటి అని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 0.4 శాతమేనని, నోటా కంటే తక్కువని అన్నారు. అటువంటి పార్టీ గురించి చర్చించుకోవడం అనవసరమన్నారు. రాజకీయాల్లో ఉన్న వాళ్లకు చాలా మందికి తోబుట్టువులు ఉంటారని, వారంతా ప్రధానులు, రాష్ట్రపతులు కాలేరు కదా అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కి సీట్లు కాదు కదా ఓట్లేసే వారూ లేరన్నారు. ఈ రాష్ట్రానికి వారు చేసిన అన్యాయమే అందుకు కారణమన్నారు. కలిసి నిర్మించుకున్న ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టి, రాష్ట్ర భవిష్యత్తును గొడ్డలితో నరికిన పార్టీ కాంగ్రెస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి పార్టీ ఈ రాష్ట్రానికి ఉండకూడదని ప్రజలు అనుకున్నారని, అలానే లేకుండా చేశారని మంత్రి అన్నారు.

చంద్రబాబుకు శిక్ష తప్పదు

- అవినీతికి పాల్పడిన బాబు...
- చట్టానికి ఎవరూ అతీతులు కారు
- సుప్రీంలో అనుకూలంగా ఉత్తర్వులు రావడం హర్షణీయం
- ఏపీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్: అధికారంలో ఉండగా అడ్డగోలుగా అవినీతికి పాల్పడిన మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకు శిక్ష తప్పదని ఏపీ ప్రభుత్వ అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉండగా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని, వాటికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని చెప్పారు. ఇప్పటికే చంద్రబాబుకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారని తెలిపారు. ఆయనపై పలు కేసులు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు నుంచి ఆదేశాలు వస్తుండడం హర్షణీయమన్నారు. తాను ఎప్పుడూ సీఎం వైఎస్ జగన్‌కు విధేయుడిగా ఉంటానని, చంద్రబాబుపై కేసులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిరంతరం పోరాటం చేస్తామన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌లకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చే ఎన్నికల హామీలను ఎవరూ నమ్మవద్దని కోరారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 17-1-2024

జీవితంలో దిద్దుబాటు చాలా అవసరం.
అక్షరాలను దిద్దుకుంటాం. నడవడిక దిద్దుకుంటాం.
మాటను దిద్దుకుంటాం... చేతను దిద్దుకుంటాం.
ఇన్నింటిని దిద్దుకోవడం వచ్చిన వాళ్లం...
చెదిరిన రూపురేఖల్ని దిద్దుకోలేమా?
కాంతి రేఖలు కొత్త పొద్దుల్ని చూడలేమా?
సూర్యుడు కర్కాటకం నుంచి మకరానికి మారినట్లే...

దిద్దుబాటు

చెదిరిన రూపురేఖలకు కాంతిరేఖలు


ఆళ్ల దాక్షాయణి

క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలేట్‌తో పుట్టిన పిల్లలు కూడా మామూలు పిల్లల్లా బతికి బట్టకట్టాలి కదా! అగ్ని ప్రమాదానికి గురైన వాళ్లు ముడతలు పడిన చర్మంతో బతుకు సాగించాల్సిన దుస్థితి ఎందుకు? ప్రమాదవశాత్తూ ఎముకలు విరిగి ముఖం రూపురేఖలు మారిపోతే... ఇక జీవితమంతా అద్దంలో ముఖం చూసుకోవడానికి భయపడాల్సిందేనా? వీటన్నింటికీ వైద్యరంగం పరిష్కరిస్తుంది. అయితే ఆ వైద్యం సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంటుంది. ఖర్చుపరంగా ఆకాశమంత ఎత్తులో ఉన్న వైద్యప్రక్రియను అవనికి దించాలంటే పెద్ద మనసు ఉండాలి. అలాంటి సమష్టి కృషిని సమన్వయం చేస్తున్నారు ఆళ్ల దాక్షాయణి. బాధితుల జీవితాల్లో కాంతిరేఖలను ప్రసరింపచేయడానికి ఏటా జనవరి నెలలో ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న వివరాలివి.

‘‘ఒకప్పుడు గ్రహణం మొర్రి కేసుల గురించి తరచూ వినేవాళ్లం. కాలక్రమేణా సమాజంలో చైతన్యం పెరిగింది. గర్భస్థ దశలోనే గుర్తించి, పుట్టిన వెంటనే సర్జరీలు చేసి సరి చేసుకునే విధంగా వైద్యరంగం కూడా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ మారుమూల గ్రామాల్లో గ్రహణం మొర్రి బాధితులున్నారు. వాళ్లు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకునే స్థోమత లేని తల్లిదండ్రులు పిల్లల వైకల్యాన్ని సరిచేయలేకపోతున్నారు. ఒక బిడ్డ ఆర్థిక కారణాలతో వైకల్యాన్ని భరించాల్సిన దుస్థితి రావడం దారుణమైన విషయం. అలాగే ఇటీవల అగ్ని ప్రమాద బాధితులు, యాసిడ్ దాడి బాధితులు కూడా పెరుగుతున్నారు. వీటికితోడు వాహన ప్రమాదాల కారణంగా వైకల్యాలు కూడా పెరుగుతున్నాయి. ఈ సమస్యల నుంచి ఆర్థిక వెసులుబాటు ఉన్న వాళ్లు బయటపడగలుగుతున్నారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని వాళ్లు బాధితులుగా మిగిలిపోతున్నారు. అలాంటి వాళ్ల కోసం ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ బాధ్యత చేపట్టాం. నిజానికి ఈ సర్వీస్ మొదలై ఇరవై ఏళ్లు దాటింది.

ముఖం మీద ఒత్తైన జుత్తు

హయతి అనే ఎనిమిదేళ్ల పాపాయి సమస్య మరీ ప్రత్యేకం. హైపర్ ట్రైకోసిస్... అంటే జుత్తు తల వరకే పరిమితం కాకుండా ముఖం మీదకు పాకుతుంది. తలమీద ఉన్నంత దట్టమైన జుత్తు ఒక చెంప మొత్తం ఉంది. ఆ పాపకు నలుగురిలోకి వెళ్లాలంటే బిడియం. స్కూలుకెళ్లాలంటే భయం. ఆమె సమస్య అంటువ్యాధి కాదని టీచర్లకు తెలిసినప్పటికీ క్లాసులో మిగిలిన పిల్లలతో కలిపి కూర్చోబెడితే వాళ్ల పేరెంట్స్ నుంచి కంప్లయింట్స్ వస్తాయి కాబట్టి హయతిని విడిగా కూర్చోబెట్టేవారు. తరగతి గది, ఇంటి నాలుగ్గోడలు తప్ప మరే ప్రపంచమూ తెలియని స్థితిలో రోజులు గడుపుతున్న హయతి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా మామూలైంది.

■ **ఇద్దరు వైద్యుల చొరవ**

రెండు వేల సంవత్సరంలో మొదలైన ఈ కార్యక్రమం కోవిడ్ రెండేళ్లు మినహా ఏటా జరుగుతోంది. డాక్టర్ భవానీ ప్రసాద్ అనస్థీషియనిస్ట్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి ప్లాస్టిక్ సర్జన్. వీళ్ల ఆలోచనతోనే ఈ సర్వీస్ మొదలైంది. మొదటి ఏడాది హైదరాబాద్‌లోని మహావీర్, మెడ్విన్ హాస్పిటళ్లలో సర్జరీలు నిర్వహించారు. ఆ తర్వాత కిమ్స్, కామినేని హాస్పిటళ్లు సపోర్టు చేశాయి. నార్కెట్ పల్లి, నిజామాబాద్, శ్రీకాకుళంలో క్యాంపులు నిర్వహించారు. గత ఏడాది హైదరాబాద్, సీతారామ్ బాగ్‌లో డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్‌ను వేదిక చేసుకున్నాం. ఇందుకోసం హాస్పిటల్ వాళ్లు రెండు ఆపరేషన్ థియేటర్‌లతో హాస్పిటల్‌ను సిద్ధం చేశారు. యూఎస్‌లో స్థిరపడిన ఈ డాక్టర్లు ఏటా 45 రోజులు ఇండియాలో ఉండేటట్లు ప్లాన్ చేసుకున్నారు. అందులో కొంత సమయం ఈ సర్వీస్‌కి కేటాయిస్తున్నారు. యూఎస్‌లోని మెర్సీ మిషన్ వేదికగా వారందిస్తున్న సర్వీస్‌కి హైదరాబాద్‌లో ‘లయన్స్ క్లబ్ – గ్రీన్‌ల్యాండ్స్’ సహకారం అందిస్తోంది. రెండేళ్లుగా మా రాంకీ ఫౌండేషన్ కూడా బాధ్యతలు తీసుకుంది. ఇందుకోసం ఫౌండేషన్ ట్రస్టీగా నేను బోర్డు మెంబర్స్ నుంచి అనుమతి తీసుకుని ఈ కార్యక్రమాలను చేపట్టాను. ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన వాళ్లలో రాయలసీమ జిల్లాలు, నల్గొండ జిల్లా వాళ్లు ఎక్కువగా ఉన్నారు. మా ఈ సర్వీస్‌కి ప్రాంత, భాష, ఆర్థికపరమైన ఆంక్షలు ఏమీ లేవు. పేరు నమోదు చేసుకుని వచ్చి వైద్యం చేయించుకోవడమే.

■ **ఇది సమష్టి దిద్దుబాటు**

ఈ సర్వీస్ కోసం ఇద్దరు డాక్టర్లు అమెరికా నుంచి వస్తారు. మరికొంతమంది డాక్టర్లు, ఇతర వైద్యసిబ్బంది మొత్తం ముప్పైమంది స్థానికులు ఈ సర్వీస్‌లో పాల్గొంటారు. ఈ హెల్త్ సర్వీస్‌ను రెండు దశాబ్దాలుగా విజయవంతంగా నిర్వహించడంలో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్ స్వామి, లయన్స్ క్లబ్ విద్యాభూషణ్ సేవలు విశేషమైనవి. క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలెట్, కాలి ముడుచుకుపోయిన చర్మం, జన్యుపరమైన వైకల్యాలను సరిచేయడం, ప్రమాదవశాత్తూ దవడ, ముక్కు, కాళ్లు, చేతులు విరిగిపోవడం వంటి సమస్యల్లో ప్లాస్టిక్ సర్జరీ ద్వారా సరిదిద్దగలిగిన అన్ని సమస్యలకూ వైద్యం అందిస్తున్నాం. కాస్మటిక్ సర్జరీలు ఈ క్యాంప్‌లో చేపట్టడం లేదు. మా సర్వీస్ గురించి వాల్‌పోస్టర్లు, బ్యానర్‌లతో జిల్లాల్లో ప్రచారం కల్పించాం. వీలైనంత ఎక్కువమంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనేది నా ఆకాంక్ష’’ అన్నారు దాక్షాయణి.

– వాకా మంజులారెడ్డి



ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్

మెర్సీ మిషన్స్ యూఎస్‌ఏ, సేవా భారతి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్- గ్రీన్ ల్యాండ్స్, రాంకీ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి స్క్రీనింగ్ జరుగుతుంది. సర్జరీలు 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతాయి. ఉచితవైద్యంతోపాటు మందులు, ఆహారం, బస సౌకర్యాలను కూడా కల్పిస్తున్నాం. పేషెంట్ పరిస్థితిని బట్టి కొందరికి సర్జరీ తర్వాత ఫాలోఅప్ కోసం మూడు నుంచి నాలుగు రోజులు బస చేయాల్సి రావచ్చు. గడిచిన డిసెంబర్ 20 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. వైద్యసహాయం అవసరమైన వాళ్లు 78160 79234, 98482 41640 నంబర్లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలి. హైదరాబాద్, ఓల్డ్ మల్లేపల్లి, సీతారామ్‌బాగ్‌లోని డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్‌లో వైద్యసహాయం అందిస్తున్నాం.

– ఆళ్ల దాక్షాయణి, మేనేజింగ్ ట్రస్టీ, రామ్‌కీ ఫౌండేషన్

ఆర్థిక నిర్ణయాల్లో ముందంజ


* నేటి మహిళ

మహిళలు షాపింగ్ చేయడంలో ముందుంటారు. కానీ, కుటుంబ శ్రేయస్సు కోసం ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో మాత్రం వెనకుంటారు.. అనేది నాటి మాట. నేడు ఈ మాటను తిరుగ రాస్తోంది మెట్రో మహిళ. ఈ విషయాన్ని డిబిఎస్‌బ్యాంక్, ఇండియన్ క్రిసిల్ చేసిన సర్వేలో స్పష్టమైంది.

మెట్రో నగరాలలో జీవిస్తున్న భారతీయ మహిళలు స్వతంత్రంగా ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలియజేసిన డీబీఎస్-ఇండియా క్రిసిల్ సర్వేలో దేశంలోని పది నగరాల్లో 800 మంది మహిళలు పాల్గొన్నారు. మహిళలు-ఆర్థిక ప్రగతి పేరుతో చేసిన ఈ అధ్యయనంలో స్వయం ఉపాధి పొందుతున్న మహిళల ప్రాధాన్యతను ఈ సర్వే ప్రత్యేకంగా పేర్కొంది.

■ **పొదుపు ఖాతాలు**

పట్టణ ప్రాంతాల్లోని స్త్రీలలో ఎక్కువమంది సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పొదుపు ఖాతాల వంటి సంప్రదాయక ఎంపికల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపింది. కుటుంబంలో దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో భారతదేశంలోని 98 శాతం మంది ఉపాధి, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు గణనీయమైన మార్పును కోరుకుంటున్నారు. వయస్సు, ఆదాయం, వైవాహిక స్థితి, ఆధారపడిన వారు, ఇంటి స్థానం వంటి అంశాలు మహిళల ఆర్థిక ప్రవర్తనపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.

■ **ఫైనాన్స్‌పై మహిళల అవగాహన**

పట్టణాల్లో పనిప్రదేశాల్లో మహిళల సంఖ్య పెరగడం, వారి ఆర్థిక ప్రాధాన్యతలు వయసుతోపాటు ఎలా మారుతున్నాయో హైలైట్ చేస్తుంది ఈ నివేదిక. వైవాహిక స్థితి, వృత్తిపరమైన నిర్ణయాలు, వ్యక్తిగత ఆరోగ్యం, జీవితంలో ఊహించని సంఘటనలు వంటి అంశాలు వివిధ దశల్లో మహిళల ఆర్థిక ప్రాధాన్యతలను ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు.. 25 నుంచి 35 సంవత్సరాల వయసు గల మహిళలు ఇంటిని కొనుగోలు చేయడం లేదా అప్‌గ్రేడ్ చేయడం, 35-45 సంవత్సరాల మధ్య ఉన్న వారు పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, 45 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు వైద్య సంరక్షణకు మారడం వంటి వాటికి ఎలా ప్రాధాన్యత నిస్తున్నారో నివేదిక హైలైట్ చేస్తుంది.

■ **వయసు ప్రాధాన్యంగా..**

మహిళల నిర్ణయాలు, వారి వయసు ఆర్థిక స్థితిని గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. 45 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళల్లో 65 శాతం మంది స్వయం ప్రతిపత్తి ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటూ కుటుంబ నాయకత్వంలో ఎదిగారు. దాదాపు 47 శాతం మంది మహిళలు స్వావలంబనతో కూడిన ఆర్థిక నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఇది మహిళల్లో పెరుగుతున్న ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నొక్కి చెబుతోందని ఫలితాలు సూచించాయి. ఆర్థిక నిర్ణయాలపైన లీడర్‌షిప్, విభిన్న పెట్టుబడి, లోన్లు, పెరుగుతున్న డిజిటల్ ఛానెల్స్ స్వీకరణ ఇవన్నీ ఆధునిక భారతీయ మహిళ కేవలం భాగస్వామిగా మాత్రమే కాదు, జీవన ప్రయాణాన్ని ప్లాన్ చేస్తోంది.

■ **ఎలా పొదుపు చేస్తున్నారంటే..**

మహిళల ఆర్థిక మార్గాలు వారి వ్యక్తిత్వంలానే భిన్నంగా ఉంటున్నాయి. పొదుపు చేయడం, రుణం తీసుకోవడం, పెట్టుబడి విధానం, వయసు, ఆదాయం, సాంస్కృతిక నేపథ్యం, వనరులను పొందడం వంటి అనేక అంశాలు పొదుపు మీదనే ఆధారపడి ఉంటాయి. ఒక సర్వే ప్రకారం.. మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో సంపాదించే మహిళలు తక్కువ రిస్క్ పెట్టుబడులకు ప్రాధాన్యతనిస్తున్నారు. వారి నిధులలో 51 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలకు కేటాయిస్తున్నారు. బంగారంలో 16 శాతం, మ్యూచువల్ ఫండ్స్‌లో 15 శాతం, రియల్ ఎస్టేట్‌లో 10 శాతం, స్టాక్‌లలో కేవలం ఏడు శాతం ఉన్నాయి.

■ **ఆధారపడిన వారు..**

జీవిత భాగస్వామిపై ఆధారపడిన మహిళల పెట్టుబడి ప్రవర్తన కూడా గణనీయంగా మారుతుంది. దాదాపు 43 శాతం మంది వివాహితలు 10 నుంచి 29 శాతం పెట్టుబడులకు కేటాయిస్తున్నారు. ఆదాయాన్ని పొందే మహిళలు తమ ఆదాయంలో సగానికి పైగా పెట్టుబడులుగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

■ **క్రెడిట్ కార్డ్ వినియోగం...**

మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో ముఖ్యంగా హైదరాబాద్, ముంబై నగరాలలో మహిళలు క్రెడిట్ కార్డ్ వినియోగంలో ముందంజలో ఉన్నారు. సగం మంది మహిళలు తాము ఎప్పుడూ రుణం తీసుకోలేదని తెలియజేశారు. రుణం తీసుకున్న వారిలో గణనీయంగా గృహరుణం తీసుకోవడాన్ని ఎంచుకున్నారు.

■ **నగదును మించి యుపిఐ**

షాపింగ్ చేయడంలో నగదు బదిలీ కన్నా యుపిఐ మార్గాలన్నే ఎక్కువ ఎంచుకుంటున్నారు. 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులలో సుమారు 33 శాతం మంది ఆన్‌లైన్ షాపింగ్ కోసం యూపీఐని ఉపయోగిస్తున్నారు. మనీ ట్రాన్స్‌ఫర్ 38 శాతం, బిల్లుల్లు 34 శాతం, ఇ-కామర్స్ కొనుగోళ్లు 29 శాతం సహా వివిధ చెల్లింపు అవసరాల కోసం యూపీఐ పట్టణ మహిళలకు ఇష్టమైన ఎంపిక అయ్యింది. ఢిల్లీలో కేవలం రెండు శాతం మంది మహిళలు మాత్రమే నగదు చెల్లింపులను ఎంచుకున్నారు. కోల్‌కతాలో 43 శాతం మహిళలు ఈ ఎంపికను ఎంచుకున్నారు.. అని మహిళల ఆర్థిక నిర్ణయాల నివేదికను మన ముందుంచింది డీబీఎస్-క్రిసిల్ సర్వే.

హెయిర్ టిప్స్

జుట్టుకు బలం ఈ చూర్ణం



అరకప్పు డ్రైఫ్రూట్స్ (బాదం, పల్లీలు, పొద్దుతిరుగుడు గింజలు, వాల్‌నట్స్), అరకప్పు ఓట్స్, పచ్చిశనగపప్పు, పెసరపప్పులు కలిపి అరకప్పు, సబ్జా గింజలు అరకప్పు, అవిసె గింజలు అరకప్పు చొప్పున తీసుకుని దోరగా వేయించి చూర్ణం చేసుకుని డబ్బాలో నిల్వ చేయాలి.

ఈ పొడిని టేబుల్ స్పూన్ తీసుకుని టీ లేదా స్మూతీలో వేసుకుని తాగాలి. టీ అలవాటు లేని వాళ్లు వేడినీళ్లలో కలుపుకొని రోజూ ఉదయాన్నే తాగితే రాలడం తగ్గి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. ఈ పొడి జుట్టు సంరక్షణకే గాక ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

యూత్ పల్స్

‘వ్యర్థాల గురించి మాట్లాడుకోవడం పరమ వ్యర్థం’ అనుకోవడం లేదు యువతరం. ఎలక్ట్రానిక్స్ నుంచి ప్లాస్టిక్ వ్యర్థాల వరకు రకరకాల వ్యర్థాలను కళాకృతులుగా రూపొందించి పర్యావరణ సందేశాన్ని అందించడం ఒక కోణం అయితే, ఎలక్ట్రానిక్ వ్యర్థాలలోని విలువైన వాటితో నగలు రూపొందించే ఎమర్జింగ్ ఆర్ట్ ట్రెండ్ లోతుపాతులు తెలుసుకోవడం మరో కోణం...

బంగారంలాంటి కళ



కోల్‌కతాలోని శ్రీశ్రీ అకాడమీ విద్యార్థులు తమ పాఠశాల అవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో అద్భుతాన్ని సృష్టించారు. ‘ట్రాష్ ఇన్‌స్టాలేషన్’ ప్రాజెక్ట్‌లో భాగంగా స్టూడెంట్స్ యుతిక, ఇషాని, రజనీష్, మంజరీ, అదిత్రిలు ప్లాస్టిక్‌తో తయారుచేసిన డాల్ఫిన్ స్టాచ్యూను పాఠశాల ఆవరణలోని వర్టికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. నెలరోజుల వ్యవధిలో తయారు చేసిన ‘డాల్ఫిన్ ఇన్ పెరిల్’ అనే ఈ ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ పాఠశాలకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ‘ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, సముద్ర జీవులకు తీవ్ర హాని కలుగుతుందనే విషయాన్ని ప్రచారం చేయడానికి కళను ఒక మాధ్యమంలా ఉపయోగించుకోవాలనుకుంటున్నాం. భవిష్యత్‌లో ఇలాంటివి మరిన్ని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం’ అంటుంది అదిత్రి.

కేరళలోని తిరువనంతపురంలో ‘కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్’కు చెందిన యంగ్ టీమ్ 20,000 ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఉపయోగించి 90 అడుగుల పాము ఇన్‌స్టాలేషన్‌ను రూపొందించింది. ప్లాస్టిక్ అనే విషసర్పం భూగోళాన్ని కాటు వేస్తున్నట్లుగా కనిపించే ఈ ఇన్‌స్టాలేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటిని దృష్టిలో పెట్టుకొని ‘ఫ్యాషన్ ఆఫ్ ది న్యూ ఎరా 100 శాతం ట్రాష్ అండ్ ప్లాస్టిక్!’ అంటూ ఒక యువ ఆర్టిస్ట్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు.


ఇ-వ్యర్థాల నుంచి హరిబాబు రూపొందించిన కళాకృతి

ముంబైలో ఉంటున్న హరిబాబు ఇ-వేస్ట్ కళలో ఎంతోమంది యూత్‌కు ఇన్‌స్పైరింగ్‌గా నిలుస్తున్నాడు. ఇ-వేస్ట్ కళారూపాలతో ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాడు. కేరళలో పుట్టిన హరిబాబు చెన్నైలో పెరిగాడు. చెన్నై గవర్నమెంట్ ‘కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్’లో చదువుకున్నాడు. ఇ-వ్యర్థాలతో కళాకృతుల తయారీకి ప్రశంసల మాట ఎలా ఉన్నా బ్యాంకు బ్యాలెన్స్ మాత్రం ఎప్పటికప్పుడూ ఖాళీ అవుతుండేది. ‘నీకేమైనా పిచ్చి పట్టిందా?’ అని తిట్టేవారు మిత్రులు.

అయితే బజాజ్ ఆర్ట్ గ్యాలరీ ఫెలోషిప్ అవార్డ్ అందుకున్న తరువాత హరిబాబుకు బ్రేక్ వచ్చింది. ఏడాది తరువాత ‘స్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ స్టూడియో’ ముంబైలో ప్రారంభించాడు. టన్నుల కొద్దీ ఇ-వ్యర్థాల నుంచి ఎన్నో శిల్పాలు రూపొందించిన హరిబాబు దగ్గరికి సలహాలు, సూచనల కోసం ఎంతోమంది యంగ్ ఆర్టిస్టులు వస్తుంటారు.

భువనేశ్వర్‌కు చెందిన మ్యూరల్ ఆర్టిస్ట్ దిబూస్ జెనా, ఆర్టిస్ట్ సిబానీ బిస్వాల్ ఆర్గానిక్ స్క్రాప్, రీయూజ్‌డ్ మెటల్‌లతో ఆర్ట్ ఇన్‌స్టాలేషన్‌లను సృష్టించారు. మానవ తప్పిదాల వల్ల సముద్రానికి జరుగుతున్న హాని గురించి తెలియజేసేలా ఉంటుంది జెనా రూపొందించిన తిమింగలం.

‘ఒషాబా బ్రాండ్ గురించి తెలుసుకున్న తరువాత ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ఆసక్తి పెరిగింది. వృథా అనుకునే వాటి నుంచి ప్రయోజనం సృష్టించాలి అనే వారి ఫిలాసఫీ నాకు నచ్చింది’ అంటుంది భోపాల్‌కు చెందిన ఇరవై రెండు సంవత్సరాల రీతిక. కళ తప్పి మూలన పడ్డ ఎలక్ట్రానిక్ వ్యర్థాలకు కొత్త జీవితాన్ని ఇవ్వడానికి గత సంవత్సరం లండన్ కేంద్రంగా ఒషాబా బ్రాండ్‌కు అంకురార్పణ జరిగింది. వాడి పారేసిన స్మార్ట్‌ఫోన్ సర్క్యూట్ బోర్డులు, ప్లగ్, యూఎస్‌బీ కేబుల్స్, చార్జింగ్ కేబుల్స్..మొదలైన వాటిలోని విలువైన వాటిని ఈ బ్రాండ్ ఆభరణాల తయారీలో ఉపయోగిస్తారు.

నిజానికి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఆభరణాల తయారీలో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. 2018లో అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ‘డెల్’ కాలం చెల్లిన తమ కంప్యూటర్ విడి భాగాల నుంచి సేకరించిన విలువైన వాటితో నగలు రూపొందించడానికి లైఫ్‌స్టైల్ బ్రాండ్ ‘బాయూ విత్ లవ్’తో కలిసి భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. విలువైన పదార్థాల వృథాను నివారించడానికి, ఎలక్ట్రానిక్ వ్యర్థాల గురించి వినియోగదారులలో అవగాహన కలిగించే సృజనాత్మక విధానాన్ని ‘డెల్’ ఎంచుకుంది.


ఇ-వ్యర్థాల నుంచి రూపొందించిన ఈ ఆభరణాన్ని ఎలైజా వాల్టర్ డిజైన్ చేసింది.

‘జువెలరీ బ్రాండ్స్ రీ-సైకిల్డ్ ఆల్టర్‌నేటివ్స్‌పై ఆసక్తి చూపుతున్నాయి. వాడి పాడేసిన స్మార్ట్ ఫోన్లు, లాప్‌టాప్‌లు... మొదలైన వాటిలో గోల్డ్ మైన్ ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూలకు పడి ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో దాగి ఉన్న విలువైన లోహాలు, ఒక టన్ను ఇ-వేస్ట్ నుంచి ఎన్ని గ్రాముల బంగారం వస్తుంది... లాంటి వివరాలు నాకు ఆసక్తికరంగా మారాయి’ అంటుంది ముంబైకి చెందిన నవీన. 23 సంవత్సరాల నవీనకు పాత, కొత్త అనే తేడా లేకుండా నగల డిజైనింగ్ ఐడియాలపై ఆసక్తి. ఈ ఆసక్తి ఆమెను ఎలైజా వాల్టర్ లాగే నలుగురు మెచ్చిన డిజైనర్‌గా మార్చవచ్చు.

నగ దరహాసం

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుంచి నగలు తయారు చేసే బ్రాండ్‌గా బ్రిటన్‌లో మంచి పేరు సంపాదించింది లైలీ జువెలరి. ఎలైజా వాల్టర్ 24వ యేట ఈ బ్రాండ్‌ను ప్రారంభించింది. యువతలో ఎంతోమంది లాగే ఇ-వ్యర్థాలలోని అపురూప అంశాలపై ఆసక్తి పెంచుకుంది. ‘ప్రపంచంలోని బంగారంలో ఏడు శాతం నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్స్‌లో దాగి ఉన్నందున ఆభరణ బ్రాండ్‌లు వాటిని ముఖ్యమైన వనరుగా చూస్తున్నాయి’ అంటున్న ఎలైజా వాల్టర్ ప్రయాణం యువతలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.



లక్ష్య షెరోన్‌కు కాంస్య పతకం

ఆసియా ఒలింపిక్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీలో భారత షూటర్ లక్ష్య షెరోన్ కాంస్య పతకం సాధించాడు. కువైట్ సిటీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల ట్రాప్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో లక్ష్య మూడో స్థానంలో నిలిచి పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సంపాదించలేకపోయాడు. ఆరుగురు షూటర్లు ఎలిమినేషన్ పద్ధతిలో పోటీపడ్డ ఫైనల్లో 25 ఏళ్ల లక్ష్య 33 పాయింట్లు స్కోరు చేశాడు. ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల కుర్రాడు మొహమ్మద్ బెరాన్‌వంద్ స్వర్ణం, 32 ఏళ్ల చైనా షూటర్ గువో యుహావో రజతం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

‘ఫిఫా’ అత్యుత్తమ ప్లేయర్‌గా మెస్సీ...

అర్జెంటీనా సూపర్‌స్టార్ మెస్సీ 2023 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో ‘ఫిఫా బెస్ట్ ప్లేయర్‌’గా నిలిచాడు. మెస్సీకి నార్వే ఫార్వర్డ్ ఎర్లింగ్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. ఇద్దరు 48 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచినప్పటికీ కెప్టెన్ల ప్యానెల్ నుంచి ఎర్లింగ్ కంటే మెస్సీకే ఎక్కువ ఓట్లు రావడంతో ‘ఫిఫా’ మెస్సీనే ఎంపిక చేసింది. లీగ్‌లతో బిజీగా ఉండటంతో మెస్సీ ఈ వేడుకకు హాజరుకాలేదు.





సెమీస్‌లో భారత్

రాంచీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలను భారత మహిళల హాకీ జట్టు సజీవంగా నిలబెట్టుకుంది. ఇక్కడ జరుగుతున్న ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో సవితా పూనియా సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ ‘బి’లో భాగంగా ఇటలీ జట్టుతో జరిగిన చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 5-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున ఉదిత రెండు గోల్స్ (1వ, 55వ ని.లో) చేయగా... దీపిక (41వ ని.లో), సలీమా టెటె (45వ ని.లో), నవ్‌నీత్ కౌర్ (53వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఇటలీ జట్టుకు కామిలా మాచిన్ (ప్లస్ 60వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో అమెరికా 1-0తో న్యూజిలాండ్‌ను ఓడించింది. దాంతో గ్రూప్ ‘బి’లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన అమెరికా 9 పాయింట్లతో టాపర్‌గా నిలువగా... రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్ 6 పాయింట్లతో రెండో స్థానం సంపాదించి సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో జపాన్‌తో అమెరికా; జర్మనీతో భారత్ తలపడతాయి. ఈ టోర్నీలో టాప్-3లో నిలిచిన జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి.

పట్నా పైరేట్స్‌కు షాక్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌కు ఏడో పరాజయం ఎదురైంది. తమిళ్ తలైవాస్ 41-25తో పట్నా పైరేట్స్‌కు షాక్ ఇచ్చింది. తలైవాస్ తరఫున అజింక్య పవార్ 10 పాయింట్లు, అభిషేక్ 7 పాయింట్లు, నరేందర్ 6 పాయింట్లు స్కోరు చేశారు. పట్నా తరఫున సుధాకర్ 8 పాయింట్లు సాధించాడు.

బంగ్లాదేశ్ క్రికెటర్ నాసిర్ హొస్సేన్‌పై నిషేధం

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ నాసిర్ హొస్సేన్‌పై రెండేళ్ల నిషేధం విధించింది. ‘అబుదాబి టి10’ టోర్నమెంట్‌లో ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న అతనిపై మంగళవారం ఐసీసీ శిక్ష ఖరారు చేసింది. నాసిర్ బంగ్లాదేశ్ తరఫున 19 టెస్టులు, 65 వన్డేలు, 31 టి20 ఆడాడు. చివరిసారిగా జాతీయ జట్టు తరఫున అతను 2018లో బరిలోకి దిగాడు.

సుమిత్ సంచలనం

- ప్రపంచ 27వ ర్యాంకర్ బుబ్లిక్‌పై వరుస సెట్‌లలో విజయం
- 1989 తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సీడెడ్ ప్లేయర్‌ను ఓడించిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత



సుమిత్

మెల్‌బోర్న్: ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఆడితే అద్భుతం చేయవచ్చని భారత టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ నిరూపించాడు. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 26 ఏళ్ల సుమిత్ చిరస్మరణీయ విజయంతో శుభారంభం చేశాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 137వ స్థానంలో ఉన్న సుమిత్ వరుస సెట్‌లలో 6-4, 6-2, 7-6 (7/5)తో ప్రపంచ 27వ ర్యాంకర్, 31వ సీడ్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)పై సంచలన విజయం సాధించి ఈ టోర్నీలో తొలిసారి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. అంతేకాకుండా 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సీడెడ్ ప్లేయర్‌పై గెలిచిన తొలి భారతీయ ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందాడు. 1989 ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ మాట్స్ విలాండర్ (స్వీడన్)పై రమేశ్ కృష్ణన్ గెలుపొందాడు. బుబ్లిక్‌తో 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సుమిత్ ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. ఒక ఏస్ కొట్టిన సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 29 విన్నర్స్ షాట్‌లతో రాణించిన సుమిత్ 26 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 32 సార్లు దూసుకొచ్చి 26 సార్లు పాయింట్లు దక్కించుకున్నాడు. మరోవైపు 6 అడుగుల 5 అంగుళాల ఎత్తు, 82 కేజీల బరువున్న బుబ్లిక్ 13 ఏస్‌లతో విరుచుకుపడ్డా... 9 డబుల్ ఫాల్ట్‌లు, 44 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

ఏఐటీఏ సహకరించకపోయినా...

ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో జరగాల్సిన డేవిస్ కప్ మ్యాచ్‌లో తాను ఆడలేనని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) అధికారులకు గత నెలలో సుమిత్ నగాల్ సమాచారం ఇచ్చాడు. దాంతో సుమిత్‌పై ఏఐటీఏ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ ‘డ్రా’లో ఆసియా కోటా నుంచి భారత్‌కు అందుబాటులో ఉన్న ‘వైల్డ్ కార్డు’ కోసం సుమిత్ పేరును పంపించకూడదని ఏఐటీఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మెయిన్ ‘డ్రా’లో చోటు కోసం క్వాలిఫయింగ్ టోర్నీలో బరిలోకి దిగాడు. ఏఐటీఏ తనకు సహకరించకపోయినా సుమిత్ నిరాశపడకుండా తన శక్తినంతా ధారపోసి, ఏకాగ్రతతో, పట్టుదలతో ఆడి క్వాలిఫయింగ్ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలుపొందాడు. క్వాలిఫయర్ హోదాలో రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ ‘డ్రా’లో చోటు సంపాదించాడు. 2021లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సుమిత్ ఈసారి మాత్రం గొప్ప విజయంతో రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. అంతకుముందు 2019 యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం ఫెడరర్ చేతిలో ఓడిపోయిన సుమిత్ 2020 యూఎస్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరుకున్నాడు.

900 యూరోలతో...

గత ఏడాది ఆరంభంలో సుమిత్ బ్యాంక్ ఖాతాలో కేవలం 900 యూరోలు (రూ. 80 వేలు) ఉన్నాయి. దాంతో తొలి మూడు నెలలపాటు తాను జర్మనీలో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసే అకాడమీకి వెళ్లలేకపోయాడు. ఈ దశలో అతని మిత్రులు సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్, క్రిస్టోఫర్ మార్కస్, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసి అండగా నిలబడ్డారు. గతంలో తాను గెల్చుకున్న ప్రైజ్‌మనీ, తన ఉద్యోగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా లభించే వేతనాన్ని ఏటీపీ సర్క్యూట్‌లో చాలెంజర్ టోర్నీలు ఆడేందుకు సుమిత్ వెచ్చించాడు. తాను పాల్గొన్న 24 టోర్నీలలో నిలకడగా రాణించి సుమిత్ రూ. 65 లక్షల వరకు ప్రైజ్‌మనీ సంపాదించాడు. కొత్త ఏడాదిలో కాన్‌బెర్రా చాలెంజర్ టోర్నీలో సుమిత్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయినా... ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరుకోవడం ద్వారా సుమిత్‌కు కనీసం 1,85,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1 కోటి) ప్రైజ్‌మనీగా రావడం ఖాయమైంది.

యూకీ బాంబ్రీ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ-హాస్ ద్వయం 6-1, 6-7 (8/10), 6-7 (7/10)తో నికోలస్ బారిన్‌టోస్ (కొలంబియా)-రాఫెల్ మాటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో ఓడిపోయింది.

అల్‌కరాజ్, స్వియాటెక్ ముందంజ



అల్‌కరాజ్

పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) శుభారంభం చేశారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్ 7-6 (7/5), 6-1, 6-2తో రిచర్డ్ గాస్కే (ఫ్రాన్స్)పై గెలుపొందగా... స్వియాటెక్ 7-6 (7/2), 6-2తో సోఫియా కెనిన్ (అమెరికా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఎనిమిదో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్)... మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

‘క్లీన్‌స్వీప్’పై భారత్ గురి

- అఫ్గానిస్తాన్‌తో నేడు ఆఖరి టి20 మ్యాచ్
- సూపర్ ఫామ్‌లో రోహిత్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్-18లో ప్రత్యక్ష ప్రసారం



యశస్వి, శివమ్ దూబే, రోహిత్

బెంగళూరు: టి20 ప్రపంచకప్‌కు ముందు భారత్ ఆఖరి అంతర్జాతీయ టి20 సమరానికి సన్నద్ధమైంది. అఫ్గానిస్తాన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఇప్పటికే 2-0తో సిరీస్ చేజిక్కించుకున్న భారత్‌కు చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ కీలకం కాదు! కానీ రెండు మ్యాచ్‌ల్లోనూ ఖాతా తెరవలేకపోయిన రోహిత్... ఈ సిరీస్ బరిలోకి దిగిన కోహ్లిలకు మాత్రం కీలకమే! తర్వాత అన్నీ ఐపీఎల్ మ్యాచ్‌లే ఉండటంతో పొట్టి ఫార్మాట్‌లో వీరిద్దరు గట్టి స్కోర్లు చేసేందుకు ఈ మ్యాచ్‌ను బాగా సద్వినియోగం చేసుకోవాలి. కాబట్టి సులువైన ప్రత్యర్థిపై టీమిండియా ఆదమరిచే ఆలోచనే ఉండబోదు. యువ ఆటగాళ్లు ఫామ్‌లో ఉండటం, బౌలింగ్ పదునెక్కడంతో భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదు. అయితే ఈ ఫార్మాట్ దృష్ట్యా అఫ్గానిస్తాన్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. పైగా పుష్కలమైన ఆల్‌రౌండ్ ఆటగాళ్లున్న ప్రత్యర్థి తప్పకుండా పరువు కోసం పోరాడుతుంది.

దూబేను ఆపతరమా...

ఈ సిరీస్‌లో శివమ్ దూబే ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రెండు మ్యాచ్‌ల్లోనూ అజేయంగా అర్ధ సెంచరీలు బాదాడు. షాట్ల ఎంపిక, విరుచుకుపడిన తీరు చూస్తుంటే మిడిలార్డర్‌లో భర్తీ చేయదగ్గ బ్యాటర్‌లా ఉన్నాడు. యశస్వి జైస్వాల్‌కు వచ్చిన ఏకైక అవకాశాన్ని వినియోగించుకోగా, కెప్టెన్ రోహిత్ శర్మ పరుగుల పరంగా ఈ సిరీస్‌కు బాకీ పడ్డాడు. జితేశ్ శర్మ, రింకూ సింగ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు ఏ ఢోకా లేదు. అలాగే బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగానే ఉంది. పేస్‌తో అర్ష్‌దీప్, ముకేశ్ కుమార్... స్పిన్‌తో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ అదరగొడుతున్నారు. మరోవైపు అఫ్గాన్ పరిస్థితే పూర్తి భిన్నంగా ఉంది. నిలకడలేని బ్యాటింగ్ ఆర్డర్ జట్టుకు ప్రతికూలంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో సిరీస్ కోల్పోయిన ప్రత్యర్థి జట్టు ఆఖరి గెలుపుతో ఊరట చెందాలని గంపెడాశలతో బరిలోకి దిగుతోంది.

ప్రణయ్, ప్రియాన్షు శుభారంభం

- తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్ నిష్క్రమణ
- పోరాడి ఓడిన గాయత్రి-ట్రెసా జోడీ



ప్రణయ్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో తొలి రోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ప్రపంచ 9వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్, 30వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... 19వ ర్యాంకర్ లక్ష్య సేన్, 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రణయ్ 21-6, 21-19తో ప్రపంచ 13వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)ను బోల్తా కొట్టించగా... ప్రియాన్షు 16-21, 21-16, 21-13తో లక్ష్య సేన్‌కు షాక్ ఇచ్చాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి 12-21, 15-21తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, రితూపర్ణ-శ్వేతపర్ణ (భారత్) జోడీలు తొలి రౌండ్‌ను దాటలేకపోయాయి. గాయత్రి-ట్రెసా ద్వయం 21-18, 14-21, 13-21తో నాలుగో ర్యాంక్ జోడీ నమి మత్సుయామా-షిడా చిహారు (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. టింగ్ యెంగ్-పుయ్ లామ్ యెంగ్ (హాంకాంగ్) జంట 21-6, 21-7తో రితూపర్ణ-శ్వేతపర్ణ జోడీపై గెలిచింది.

సినిమా



చిరంజీవి

సంక్రాంతికి విశ్వంభర

హీరో చిరంజీవి సంక్రాంతి కానుకగా అభిమానులకు ఖుషీ కబురు చెప్పారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి ‘విశ్వంభర’ అనే టైటిల్ ఖరారు చేసి, టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు మేకర్స్. అంతేకాదు.. ఈ సినిమాని 2025 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. ‘బింబిసార’ వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న చిత్రమిది. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ‘‘ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న చిత్రం ‘విశ్వంభర’. చిరంజీవిగారి కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న సినిమా ఇది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది’’ అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె.నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.



ప్రభాస్

నలుదిక్కులా కంగువ

సూర్య హీరోగా నటించిన చారిత్రాత్మక చిత్రం ‘కంగువ’. శివ దర్శకత్వంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది పది భాషలకు పైగా థియేటర్స్‌లో విడుదల కానుంది. కాగా ‘కాలం కంటే బలమైనది విధి. గతం, వర్తమానం, భవిష్యత్ ... కాలం ఏదైనా నలుదిక్కులా మార్మోగే పేరు ఒక్కటే.. కంగువ’ అనే క్యాప్షన్‌తో ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 17వ శతాబ్దంలో మొదలయ్యే ఈ సినిమా కథ సమకాలీన పరిస్థితులకు కనెక్ట్ అయి ఉంటుందనే వార్తలు వచ్చాయి. ఈ వార్తలు నిజమే అన్నట్లుగా రెండు డిఫరెంట్ లుక్స్ ఉన్న సూర్య పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ‘‘సూర్య స్క్రీన్ ప్రెజెన్స్‌తో ‘కంగువ’ గ్రాండ్‌గా ఉంటుంది. త్రీడీలోనూ ఈ సినిమాను రిలీజ్ చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహనిర్మాత: నేహా జ్ఞానవేల్ రాజా.



సూర్య



రాశీ ఖన్నా

శతమానం భవతి నెక్ట్స్ పేజి

శర్వానంద్, అనుపమా పరమేశ్వరన్ జంటగా సతీష్ వేగేశ్న దర్శకత్వం వహించిన చిత్రం ‘శతమానం భవతి’. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై ‘దిల్’ రాజు నిర్మించిన ఈ సినిమా 2017 సంక్రాంతికి విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ‘శతమానం భవతి నెక్ట్స్ పేజి’ నిర్మించనున్నట్లు ప్రకటించారు ‘దిల్’ రాజు. ‘‘చక్కని కుటుంబ కథా చిత్రంగా రూపొందిన ‘శతమానం భవతి’ మా బ్యానర్‌కి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అలాగే ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డును దక్కించుకుని తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పతనాన్ని చాటింది. మా బ్యానర్ విలువలకు తగ్గట్లు ‘శతమానం భవతి నెక్ట్స్ పేజి’ని ఘనంగా రూపొందించనున్నాం. 2025 సంక్రాంతికి సినిమాని విడుదల చేస్తాం’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.



‘దిల్’ రాజు

ప్రభాస్ రాజా సాబ్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి ‘రాజా సాబ్’ అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్‌ని ప్రకటించి, వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. మారుతి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ‘‘ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ‘రాజా సాబ్’ని తెరకెక్కిస్తున్నారు మారుతి. ప్రభాస్‌ను ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో ఈ మూవీలో అలాగే చూస్తారు. ‘రాజా సాబ్’ మా బ్యానర్‌లో ఒక మరపురాని సినిమాగా మిగిలిపోతుంది. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతుంది’’ అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని, సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: డా. వాసుదేవ లెంబూరు, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ఎస్‌కేఎన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

వేసవికి వాయిదా



విక్రమ్

ఏప్రిల్‌కు షిఫ్ట్ అయ్యాడు ‘తంగలాన్’. హీరో విక్రమ్, దర్శకుడు పా. రంజిత్ కాంబినేషన్‌లో రూపొందిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా ‘తంగలాన్’. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతీ హీరోయిన్లుగా నటించగా, డేనియల్ కాల్టాగిరోన్, వేట్టై ముత్తుకుమార్ కీలక పాత్రలు పోషించారు. బంగారు గనుల తవ్వకం నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఈ సినిమాను తొలుత జనవరి 26న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ ఏప్రిల్‌లో విడుదల చేయనున్నట్లుగా ఓ కొత్త పోస్టర్‌తో సంక్రాంతి పండగ సందర్భంగా వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

సబర్మతి రిపోర్ట్‌లో రాశీ

దక్షిణాదిలో బాగా పాపులర్ అయిన కథానాయికల్లో రాశీ ఖన్నా ఒకరు. ఈ ఢిల్లీ బ్యూటీ ప్రస్తుతం ఇటు తెలుగు, తమిళ్‌తో పాటు హిందీ చిత్రాల్లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం హిందీలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందుతున్న ‘యోధ’ సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రాశీ ఖన్నా. దిశా పటానీ మరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదల కానుంది. అలాగే తాజాగా ‘ది సబర్మతి రిపోర్ట్’ అనే హిందీ చిత్రానికి పచ్చజెండా ఊపారు రాశీ ఖన్నా.

విక్రాంత్ మెస్సీ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు రంజన్ చందేల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. కాగా 2002 ఫిబ్రవరిలో జరిగిన సబర్మతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదం నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా కథనం ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. మరోవైపు ఈ చిత్రాలే కాకుండా తెలుగులో ‘తెలుసు కదా’, తమిళంలో ‘అరణ్మనై 4’ సినిమాల్లో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రాశీ ఖన్నా.

ఈ ఏడాదే స్వయంభూ



నిఖిల్

నిఖిల్ హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ ‘స్వయంభూ’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ‘స్వయంభూ’ సినిమా అప్‌డేట్‌ను షేర్ చేశారు నిఖిల్. ‘‘నాన్‌స్టాప్‌గా మా సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాలో నేను హనుమాన్ భక్తుడి పాత్రలో నటిస్తున్నాను. ఈ సినిమాలో నా ఫేవరెట్ డైలాగ్ జై శ్రీరామ్. అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నాం. దసరా లేదా దీపావళికి ఈ సినిమాను విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నాం’’ అంటూ ‘ఎక్స్’లో షేర్ చేశారు నిఖిల్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.



సుమయ రెడ్డి

ప్రేమ.. సందేశం

సుమయ రెడ్డి హీరోయిన్‌గా నటించి, స్వీయ కథతో నిర్మించిన చిత్రం ‘డియర్ ఉమ’. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్‌పై రూపొందిన ‘డియర్ ఉమ’ చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి, సాయి రాజేశ్ మహాదేవ్ మాట్లాడుతూ– ‘‘అందమైన ప్రేమకథ, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామాతో పాటు చక్కని సందేశంతో ఈ మూవీ రూపొందింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే వాణిజ్య అంశాలు ఉన్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి, సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం’’ అన్నారు. కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూపాలక్ష్మి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రథన్.

సాక్షి బిజినెస్
బుధవారం
17-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
199	65
73,427	22,032

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,976	△	3
డోజోన్స్	37,415	▽	178
ఎఫ్‌టీఎస్ఈ 100	7,568	▽	27
డాక్స్	16,562	▽	61
షాంఘై	2,894	△	8
నికాయ్	35,619	▽	283

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,608
బంగారం (99.5 స్వచ్ఛత)	62,357
వెండి (కిలో)	71,666

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.55	83.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.67
€	యూరో	ఎస్‌బీఐ	91.74	91.93
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.24	57.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.89	56.01
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.72	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.43	12.50

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం 39% జంప్

క్యూ3లో రూ. 17,718 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెరుగైన ఫలితాలను ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో (2023–24, క్యూ3) బ్యాంక్ కన్సాలిడేటెడ్ (అనుబంధ సంస్థలన్నింటితో కలిపి) నికర లాభం రూ. 17,718 కోట్లకు ఎగబాకింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ. 12,735 కోట్లతో పోలిస్తే 39 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 54,123 కోట్ల నుంచి రూ. 1,15,015 కోట్లకు చేరింది. 112 శాతం ఎగసింది. స్టాండెలోన్ నికర లాభం 34 శాతం వృద్ధితో రూ.16,373 కోట్లకు దూసుకెళ్లింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.12,259 కోట్లుగా ఉంది. ఇక స్టాండెలోన్ ఆదాయం 60 శాతం వృద్ధి చెంది, రూ. 51,208 కోట్ల నుంచి రూ. 81,720 కోట్లకు పెరిగింది.



ఎన్‌పీఏలు ఇలా...

బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) క్యూ3లో స్వల్పంగా పెరిగాయి. 1.23 శాతం నుంచి 1.26 శాతానికి చేరాయి. అయితే నికర ఎన్‌పీఏలు మాత్రం 0.33 శాతం నుంచి స్వల్పంగా 0.31 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ధర మంగళవారం 0.31 శాతం పెరిగి రూ. 1,678 వద్ద ముగిసింది.

నిత్యావసరాల ధరల మంట

డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 0.7%



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం వరుసగా రెండవనెలలోనూ ఎగువబాటనే కొనసాగింది. ఏడు నెలల్లో ఎన్నడూ లేని తీవ్ర స్థాయిలో 0.73 శాతంగా (2022 డిసెంబర్‌తో పోల్చి) నమోదయ్యింది. 2023 మార్చిలో టోకు ద్రవ్యోల్బణం 1.41 శాతం ఎగసింది. అటు తర్వాత ఈ స్థాయిలో పెరుగుదల ఇదే తొలిసారి. ఆహార, కూరగాయల ధరలు సహా పలు విభాగాల్లో ధరల తీవ్రత తాజా టోకు ద్రవ్యోల్బణం తీవ్రతకు ప్రధాన కారణం. 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ టోకు ద్రవ్యోల్బణం మైనస్ (ప్రతి ద్రవ్యోల్బణం)లో కొనసాగింది. నవంబర్‌లో 'యూటర్న్' తీసుకుని 0.26 శాతంగా నమోదయ్యింది. తాజా సమీక్షా నెల డిసెంబర్‌లో మరింత పెరిగి 0.73 శాతానికి ఎగసింది. ఒక్క ఆహార ద్రవ్యోల్బణాన్ని చూస్తే, నవంబర్‌లో ఈ రేటు 8.18 శాతం ఉంటే, డిసెంబర్‌లో 9.38 శాతానికి ఎగసింది. కూరగాయల విషయంలో ద్రవ్యోల్బణం భారీగా 26.30 శాతం పెరగ్గా, పప్పు ధాన్యాల ధరలు 19.60 శాతం పెరిగాయి. 2023 ఆగస్టు నుంచి ఈ నిత్యావసర వస్తువల ధర రెండంకెలపైన కొనసాగుతోంది.

ఒడిదుడుకుల బాటనే ఎగుమతులు

- డిసెంబర్‌లో మళ్లీ ప్లస్‌లోకి..
- విలువ 38.45 బిలియన్ డాలర్లు
- క్షీణతలోనే దిగుమతులు;4.8% డౌన్
- 58.25 బిలియన్ డాలర్లుగా నమోదు
- వాణిజ్యలోటు 19.80 బి. డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ వస్తు ఎగుమతులు తీవ్ర ఒడిదుడుకుల బాటలోనే కొనసాగుతున్నాయి. నవంబర్‌లో క్షీణతను నమోదుచేసుకున్న ఈ కీలక రంగం డిసెంబర్‌లో స్వల్పంగా ఒక శాతం పెరుగుదలను నమోదుచేసుకుంది. విలువలో ఇది 38.45 బిలియన్ డాలర్లు. అయితే వస్తు దిగుమతుల విభాగం మాత్రం క్షీణతలోనే కొనసాగింది. విలువ 4.85 శాతం తగ్గి 58.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల విలువ మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 19.80 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

కొన్ని ముఖ్యాంశాలు...

- పెట్రోలియం ప్రొడక్టులు, రెడీమేడ్ దుస్తులు, రసాయనాలు, తోలు ఉత్పత్తులుసహా పలు విభాగాల్లో డిసెంబర్ ఎగుమతులు తగ్గాయి.
- ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ గూడ్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాల విభాగాలు వృద్ధిని నమోదుచేసుకున్నాయి.
- క్రూడ్ దిగుమతులు సమీక్షా నెలలో 22.77% తగ్గి 15 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- పసిడి దిగుమతులు మాత్రం 156 శాతం ఎగసి 3 బిలియన్ డాలర్లుకు చేరాయి.

9 నెలల్లో క్షీణతే..

మరోవైపు ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఆర్థిక సంవత్సరం 9 నెలల్లో భారత్ వస్తు ఎగుమతులు 5.7 శాతం క్షీణించి 317.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు కూడా ఇదే కాలంలో 7.93% క్షీణించి 505.15 బిలియన్ డాలర్లుకు దిగాయి. వెరసి వాణిజ్యలోటు 188.02 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2022 ఇదే కాలంలో ఈ లోటు 212.34 బిలియన్ డాలర్లు.

సేవల రంగం కూడా నిరాశే...

సేవల రంగం ఎగుమతులు డిసెంబర్‌లో క్షీణతను నమోదుచేసుకుని, 27.88 బిలియన్ డాలర్లకు తగ్గాయి. 2022 ఇదే కాలంలో ఈ విలువ 31.19 బిలియన్ డాలర్లు. ఇక ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఈ విలువ 239.5 బిలియన్ డాలర్ల నుంచి 247.92 బిలియన్ డాలర్లకు ఎగసింది.

మారుతీ కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా అన్ని కార్ల ధరలను సవరిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. సగటు పెరుగుదల 0.45 శాతం ఉంటుందని వెల్లడించింది. తాజాగా తీసుకున్న నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని మారుతీ సుజుకీ స్పష్టం చేసింది. కంపెనీ మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.3.54 లక్షలు మొదలుకుని రూ.28.42 లక్షల వరకు ఉంది.

హ్యుందాయ్ కొత్త క్రెటా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా కొత్త క్రెటా విడుదల చేసింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.10.99 లక్షలు మొదలుకుని రూ.19.99 లక్షల వరకు ఉంది. 6 స్పీడ్ మాన్యువల్/సీవీటీ 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్, 6 స్పీడ్ మాన్యువల్/6 స్పీడ్ ఆటోమేటిక్ 1.5 లీటర్ డీజిల్, 7 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌తో మొత్తం 7 ట్రిమ్స్‌లో లభిస్తాయి. లెవెల్–2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్‌తో తయారైంది. రెండు 10.25 అంగుళాల స్క్రీన్స్‌తో ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 6 ఎయిర్ బ్యాగ్స్ వంటి హంగులు జోడించింది.

రికార్డు స్థాయిల్లో లాభాల స్వీకరణ

- ఐటీ, ఇంధన, రియల్టీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- అయిదు రోజుల ర్యాలీకి బ్రేక్
- ఇంట్రాడేలో తాజా గరిష్టాల నమోదు



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల అందడంతో రికార్డు గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా స్టాక్ సూచీల అయిదు రోజుల వరుస ర్యాలీకి మంగళవారం ముగింపు పడింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని ప్రథమార్థంలోనే జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ 100 పాయింట్లు పెరిగి 73,428 వద్ద, నిఫ్టీ 27 పాయింట్లు బలపడి 22,124 వద్ద ఆల్‌టైం హై స్థాయిలు తాకాయి. సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఐటీ, రియల్టీ, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ చేసుకోవడంతో సెన్సెక్స్ 199 పాయింట్ల నష్టపోయి 73,427 వద్ద, నిఫ్టీ 65 పాయింట్లు పతనమై 22,032 వద్ద ముగిశాయి. చిన్న, మధ్య తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.31%, 0.43% చొప్పున పతనమయ్యాయి. మరోవైపు మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు.

''ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలతో ఇటీవల భారీగా ర్యాలీ చేసిన ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటుకుంది. చిన్న, మధ్య తరహా షేర్ల విలువలు భారీ పెరిగిపోవడంతో మార్కెట్ ర్యాలీ కొనసాగకపోవచ్చు. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే తాజా అంశాలేవీ లేకపోవడంతో ఎఫ్ఐఐలు నుంచి ఎలాంటి సంకేతాలు లేవు. భౌగోళిక ఉద్రిక్తతలతో క్రూడాయిల్ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర(రూ.331)తో పోలిస్తే షేరు బీఎస్‌ఈలో 12% ప్రీమియంతో రూ.372 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 34% ఎగసి రూ.445 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. చివరికి 31% లాభపడి రూ.433 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,851 కోట్లుగా నమోదైంది.
- క్యూ3 లో నికర లాభం 56% క్షీణించడంతో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 7% నష్టపోయి రూ.249 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 8% పతనమై రూ.247 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ ఒక్క రోజులోనే రూ.11,372 కోట్ల మార్కెట్ క్యాప్‌ను కోల్పోయింది.
- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో గత రెండు రోజుల్లో భారీగా పెరిగిన దేశీయ అగ్రగామి ఐటీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్ 2%, విప్రో 2%, టెక్ మహీంద్ర 1.40%, ఇన్ఫోసిస్ 1.27%, టీసీఎస్ 1% చొప్పున నష్టపోయాయి.
- గతవారంలో 8% ర్యాలీ చేసిన రిలయన్స్ ఇండస్ట్రీస్ క్యూ3 ఆర్థిక ఫలితాల వెల్లడి(శుక్రవారం)కి ముందు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.2747 వద్ద ముగిసింది.

స్వల్పకాల డిపాజిట్లపై 7.6% వరకూ వడ్డీ: బీఓబీ



ముంబై: స్వల్పకాలిక రిటైల్ డిపాజిట్లపై వడ్డీరేటును 7.1 నుంచి 7.6 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.6 శాతం, ఇతరులకు 7.1 శాతం రేటు వర్తిస్తుందని బ్యాంక్ ప్రకటన పేర్కొంది. 'బీఓబీ360' పేరుతో ప్రారంభించిన ఈ తాజా బల్క్ డిపాజిట్ స్కీమ్ సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. బ్యాంక్ ప్రస్తుత లేదా కొత్త కస్టమర్లు ఈ బల్క్ డిపాజిట్ స్కీమ్‌ను ఏదైనా బ్రాంచ్‌లో, ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్ ద్వారా తెరవవచ్చు. కాగా, రెండు వారాల క్రితమే బీఓబీ రూ.2 కోట్ల లోపు స్వల్పకాలిక స్థిర డిపాజిట్లపై వడ్డీరేట్లను 125 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు 1%) వరకూ పెంచింది. 7–14 రోజుల డిపాజిట్ రేట్లు అత్యధికంగా 3 శాతం నుంచి 1.25% పెరిగి 4.25 శాతానికి చేరింది. 15–45 రోజుల డిపాజిట్ రేటు 1 శాతం పెరిగి 4.50%కి చేరింది. 271 రోజుల బల్క్ డిపాజిట్లపై బ్యాంక్ 6.25 శాతం వడ్డీరేటును ఆఫర్ చేసింది.

కీళ్లు, కండరాల నొప్పుల నివారిణి రుమా ఆయిల్

హైదరాబాద్: కీళ్లు, కండరాల నొప్పులను నివారించేందుకు రుమా ఆయిల్ చక్కగా పనిచేస్తుందని బైద్యనాథ్ ఆయుర్వేద్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎరాండ్‌మూల్, దతూర పంచాంగ్, అశ్వగంధ, శాతావారి, అమ్మలేద్, కుచల, ప్రసార్ని ఆయిల్, గంధపురి, టర్పెంటైన్ వంటి ఆయుర్వేద మూలికలతో ఈ రుమా ఆయిల్‌ను తయారు చేసినట్లు పేర్కొంది. ప్రతి రోజూ ఈ నూనెతో మసాజ్ చేసుకుంటే ఎముకలు, కండరాలు పటిష్టంగా తయారవుతాయని కంపెనీ తెలిపింది.



భవిత

జాబ్ పాయింట్

డీఆర్‌డీవో-సీవీఆర్‌డీఈ, చెన్నైలో 60 ఐటీఐ అప్రెంటిస్‌లు

చెన్నై అవడిలోని డీఆర్‌డీవో–కంబాట్ వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అస్టాబ్లిష్‌మెంట్(సీవీఆర్‌డీఈ).. అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 60
- **ట్రేడులు:** కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెడికల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, మెకానిక్, టర్నర్, వెల్డర్.
- **అర్హత:** సంబంధిత ట్రేడులో ఐటీఐ 2021/2022/2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:** 01.12.2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,050
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** వార్తాపత్రికలో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** drdo.gov.in

నార్త్ వెస్ట్రన్ రైల్వేలో 1646 యాక్ట్ అప్రెంటిస్‌లు

జైపూర్(రాజస్థాన్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–నార్త్ వెస్ట్రన్ రైల్వే ఎస్‌డబ్ల్యూఆర్ పరిధిలోని వర్క్‌షాప్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 1646
- **వర్క్‌షాప్‌లు/యూనిట్లు:** డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీసర్(అజ్‌మేర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(బికనీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జైపూర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జోధ్‌పూర్), బీటీసీ క్యారేజ్(అజ్‌మేర్), బీటీసీ లోకో(అజ్‌మేర్), క్యారేజ్ వర్క్‌స్షాప్(బికనీర్), క్యారేజ్ వర్క్‌స్షాప్(జోధ్‌పూర్).
- **అర్హత:** కనీసం పదోతరగతిలో 50శాతం మార్కులతో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ట్రేడులు:** ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, మెకానికల్, డీజిల్ మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.
- **వయసు:** 10.02.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2024
- **వెబ్‌సైట్:** www.rrcjaipur.in

సర్కారీ కొలువుల మేళా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో.. నూతన సంవత్సరంలో ఉద్యోగార్థులకు సర్కారీ కొలువులు స్వాగతం పలుకుతున్నాయి. ఉన్నత స్థాయి పోస్టులైన గ్రూప్-1, గ్రూప్-2 సహా పలు ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ ఇప్పటికే ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది! టెక్ కొలువులు, నాన్-టెక్నికల్ ఉద్యోగాలు, గతంలో భర్తీకానీ పోస్టులు.. ఇలా అన్నింటికీ నోటిఫికేషన్లు ఇచ్చి.. లక్షల మంది అభ్యర్థుల సర్కారీ కొలువుల ఆశలు నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అంతేకాకుండా పండగ తర్వాత డీఎస్సీకి సన్నాహకాలు చేస్తున్నట్లు మరో తీపి కబురు చెప్పింది. ఇలాంటి కొలువుల నామ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలువడిన ఉద్యోగ నోటిఫికేషన్లపై ప్రత్యేక కథనం..

» ఏపీలో గ్రూప్-1, 2 సహా పలు కీలక నోటిఫికేషన్లు
» త్వరలోనే డీఎస్సీకి ప్రభుత్వం సన్నాహకాలు
» ఒకే అర్హతతో పలు పరీక్షలకు పోటీ పడే అవకాశం
» ఉమ్మడి ప్రిపరేషన్‌తో సర్కారీ కొలువు ఖాయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్స్(పాల్యూషన్ కంట్రోల్ బోర్డ్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

గ్రూప్-1 సర్వీసెస్

ఏపీపీఎస్సీ తాజాగా విడుదల చేసిన గ్రూప్1 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 81 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(పురుషులు), డివిజినల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్స్, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, కో–ఆపరేటివ్ సర్వీస్ డిప్యూటీ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–1), అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్,డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్,అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ తదితర ఉన్నతస్థాయి పోస్టులు ఉన్నాయి.

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. మొత్తం 240 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 (జనరల్ స్టడీస్ 120 ప్రశ్నలు –120 మార్కులు); పేపర్–2 (జనరల్ ఆప్టిట్యూడ్ 120 ప్రశ్నలు–120 మార్కులు).
- **మెయిన్ ఎగ్జామినేషన్:** మెయిన్‌లో అయిదు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 150 మార్కులు చొప్పున 750 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. అవి.. పేపర్–1 జనరల్ ఎస్సే; పేపర్–2–ఏపీ, భారతదేశ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం; పేపర్–3–పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా,ఎథిక్స్; పేపర్–4 ఎకానమీ, భారతదేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి; పేపర్–5 సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ అంశాలు. మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా.. చివరగా 75 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- **గ్రూప్–1 ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 21, 2024
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** మార్చి 17, 2024

899 పోస్టులతో గ్రూప్-2

ఏపీపీఎస్సీ గ్రూప్–2 నోటిఫికేషన్ ద్వారా 899 ఎగ్జిక్యూటివ్, నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. వీటిలో 333 ఎగ్జిక్యూటివ్ పోస్టులు; 566 నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టులలో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **స్క్రీనింగ్ టెస్ట్:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ సబ్జెక్ట్ పేపర్‌తో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** స్క్రీనింగ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశ మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను రెండు పేపర్లుగా 300 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–1లో సెక్షన్–1: సోషల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు); సెక్షన్–2: భారత రాజ్యాంగం సమీక్షల నుంచి 150 ప్రశ్నలు (150 మార్కులు) అడుగుతారు. పేపర్–2లో సెక్షన్–1: భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ; సెక్షన్–2 సైన్స్ అండ్ టెక్నాలజీల నుంచి 150 ప్రశ్నలు(150 మార్కులు) అడుగుతారు.
- **గ్రూప్–2 ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 17, 2024
- **గ్రూప్–2 స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి25, 2024

47 జూనియర్ లెక్చరర్స్

ఏపీ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ సర్వీస్ పరిధిలో మొత్తం 47 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో ఇంగ్లిష్ –9; తెలుగు–2; ఉర్దూ–2; సంస్కృతం–2, ఒరియా–1; మ్యాథమెటిక్స్–1; ఫిజిక్స్–5; కెమిస్ట్రీ–3; బోటనీ–2; జువాలజీ–1; ఎకనామిక్స్–12; సివిక్స్–2; హిస్టరీ–5 పోస్టులు ఉన్నాయి.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్ట్‌తో పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష ఇలా:** రాత పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. అవి.. **పేపర్–1:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ(150 ప్రశ్నలు–150 మార్కులు); **పేపర్–2:** సంబంధిత సబ్జెక్ట్ పేపర్ (150 ప్రశ్నలు–300 మార్కులు). రాత పరీక్ష మొత్తం 450 మార్కులకు జరుగుతుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 31–ఫిబ్రవరి 20, 2024
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్/మేలో నిర్వహించే అవకాశం.

240 డిగ్రీ లెక్చరర్ పోస్టులు


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఆయా సబ్జెక్టులలో మొత్తం 240 డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. బోటనీ–19; కెమిస్ట్రీ–26; కామర్స్–35; కంప్యూటర్ అప్లికేషన్స్–26; కంప్యూటర్ సైన్స్–31; ఎకనామిక్స్–16; హిస్టరీ–19; మ్యాథమెటిక్స్–17; ఫిజిక్స్–11; పొలిటికల్ సైన్స్–21; జువాలజీ–19.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు నెట్ లేదా స్లెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష:** పేపర్–1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 ప్రశ్నలు–150 మార్కులు); పేపర్–2 (సంబంధిత సబ్జెక్ట్ పేపర్)–150 ప్రశ్నలు–300 మార్కులు. మొత్తం 450 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు.
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్/మే నెలలో నిర్వహించే అవకాశం ఉంది.

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్

ఏపీ ఎడ్యుకేషన్ సర్వీస్ విభాగంలో.. 38 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **అర్హత:**బీఈడీ కోర్సు చేసేందుకు అర్హత ఉన్న సబ్జెక్ట్‌తో పీజీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.



- **స్క్రీనింగ్ టెస్ట్:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ పేపర్ 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటుంది.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** స్క్రీనింగ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి రెండో దశలో మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్‌లో మూడు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్–1–జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 ప్రశ్నలు–150 మార్కులు); పేపర్–2–ఎడ్యుకేషన్–1 (150 ప్రశ్నలు–150 మార్కులు); ఎడ్యుకేషన్–2 (150 ప్రశ్నలు–150 మార్కులు). మొత్తం 450 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 9–జనవరి 29, 2024.
- **స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 13, 2024.

అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలిలో.. 21 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది.

- **అర్హత:** సివిల్/మెకానికల్/ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో మూడు ఉంటాయి. పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ 150 ప్రశ్నలు–150 మార్కులు); పేపర్–2 సబ్జెక్ట్ పేపర్ (150 మార్కులు– 150 ప్రశ్నలు; పేపర్–3 (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (150 ప్రశ్నలు – 150 మార్కులు).
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 30–ఫిబ్రవరి 19, 2024.
- **పరీక్ష తేదీ:**ఏప్రిల్ లేదా మేలో నిర్వహించే అవకాశం

99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో 21 సబ్జెక్టులలో మొత్తం 99 పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.

- **అర్హత:** సబ్జెక్ట్‌ను అనుసరించి బీటెక్ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి
- **ఎంపిక విధానం:** రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా 450 మార్కులకు నిర్వహిస్తారు. **పేపర్–1:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ–150 ప్రశ్నలు–150 మార్కులు; **పేపర్–2:** సంబంధిత సబ్జెక్ట్ పేపర్–150 ప్రశ్నలు–300 మార్కులకు ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 29 నుంచి ఫిబ్రవరి 18, 2024.
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ లేదా మేలో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

'ఉమ్మడి'గా రాణించేలా ప్రిపరేషన్

ఏపీపీఎస్సీ ద్వారా పలు నియామక పరీక్షలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. గ్రూప్–1, గ్రూప్–2లకు తొలి దశ పరీక్ష తేదీలను సైతం ప్రకటించారు. మిగతా పోస్టులకు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా పరీక్షలకు సంబంధించి దాదాపు 70 నుంచి 80 శాతం వరకు సిలబస్ అంశాలు ఒకే విధంగా ఉండటం అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. ఒకే ప్రిపరేషన్‌తో పలు పరీక్షల్లో రాణించే అవకాశముంది.

సిలబస్ పరిశీలన

ఒకే సమయంలో పలు పరీక్షలకు హాజరవ్వాలనుకునే విద్యార్థులు తొలుత ఆయా పరీక్షల సిలబస్‌ను పరిశీలించాలి. సిలబస్‌లో వేర్వేరుగా ఉన్న టాపిక్స్ తెలుసుకోవాలి. ఉమ్మడి టాపిక్స్ సిలబస్‌కు, ప్రత్యేక టాపిక్స్ సిలబస్‌కు సమయం కేటాయించుకోవడం; ఆయా సబ్జెక్ట్‌లు, టాపిక్స్‌కు సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌ను సేకరించుకోవడం; సదరు పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడం ద్వారా విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

ఆబ్జెక్టివ్.. డిస్క్రిప్టివ్

ఒక పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో, మరో పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటే ఎలా చదవాలి? అనే ప్రశ్న ఎదురవుతుంది. ముఖ్యంగా గ్రూప్–1 ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే పరీక్ష. అదే సమయంలో పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించే పరీక్ష గ్రూప్–2. పరీక్ష విధానం ఏదైనా డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫలితంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు కూడా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. దీని ద్వారా రెండు రకాల పరీక్షల్లో విజయానికి అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

బాబు అవినీతిపై టీడీపీ సైలెన్స్!

2019లో రూ.150 కోట్లు తీసుకున్నారని రాయపాటి రంగారావు ఆరోపణ

- పోలవరం ప్రాజెక్టు పేరుతో బాబు, లోకేశ్ వారం వారం డబ్బు వసూలు చేశారని వెల్లడి
- అమరావతి జేఏసీ డబ్బు వసూలు చేశారని మరో ఆరోపణ
- లెక్కలు చెప్పాలన్న రాయపాటి
- నోరు మెదపని చంద్రబాబు, లోకేశ్, టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేశ్ అవినీతిని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు, మొదట్లో పోలవరం ప్రాజెక్టును దక్కించుకున్న ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ అధినేత రాయపాటి రంగారావు ఇటీవల బట్టబయలు చేశారు. నాలుగు రోజుల క్రితం ఆయన విలేకరుల సమావేశం పెట్టి మరీ బాబు, లోకేశ్ ఏ విధంగా డబ్బులు దండుకున్నదీ వెల్లడించడం తెలుగుదేశం పార్టీలో ప్రకంపనలు సృష్టించింది. అయితే, ఆయన ఆరోపణలపై చంద్రబాబు, లోకేశ్ సహా పార్టీ సీనియర్ నేతలెవరూ నోరు మెదపడంలేదు. తాము చేసిన అవినీతిపై మాట్లాడితే తమకే మరింత నష్టం వస్తుందన్న ఆలోచనతో వారంతా సైలెంట్ అయినట్లు సమాచారం.



2019 ఎన్నికల్లో తాను చంద్రబాబునాయుడికి రూ.150 కోట్లు ఇచ్చానని రాయపాటి రంగారావు ఆరోపించారు. దీంతోపాటు సోమవారం పోలవారం అంటూ పోలవరం ప్రాజెక్టుపై ప్రతి సోమవారం సమీక్షలు పెట్టి చంద్రబాబు, లోకేశ్ పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి తమను ముంచేశారని చెప్పారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని బయటపెడతానని సవాల్ చేశారు. ఇంత పెద్ద అవినీతి ఆరోపణలపై తెలుగుదేశం పార్టీ నుంచి, చంద్రబాబు, లోకేశ్ నుంచి సమాధానం రాలేదు. వారు మౌనంగా ఉండటంతో డబ్బులు వసూలు చేసిన మాట నిజమేనని తెలుగుతమ్ముళ్లు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాయపాటి రంగారావుకు వ్యతిరేకంగా అతని సొంత బాబాయి రాయపాటి శ్రీనివాస్, అమరావతి జేఏసీ నాయకురాలు, రాయపాటి సాంబశివరావు మరో సోదరుని కుమార్తె శైలజ మాత్రమే మాట్లాడారు. తాము తెలుగుదేశంలోనే ఉంటామని మాత్రమే చెప్పారు. చంద్రబాబు, లోకేశ్‌పై చేసిన అవినీతి ఆరోపణలపై వారు సమాధానం చెప్పలేకపోయారు. ఈ నేపథ్యంలో అమరావతి జేఏసీ పేరుతో వసూలు చేసిన డబ్బులు వివరాలు చెప్పాలని కూడా రంగారావు డిమాండ్ చేశారు. అమరావతి రైతు ఉద్యమం పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లు జరిగిన సంగతి అందరికి తెలిసిందే. ఉద్యమానికి మద్దతు పేరుతో చంద్రబాబు జోలి పట్టి రాష్ట్రమంతా నిధులు వసూలు చేశారు. అమరావతి జేఏసీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ప్రపంచంలో ఉన్న తమ సామాజిక వర్గం వారి నుంచి పెద్ద ఎత్తున వసూళ్లు చేశారు. ఈ డబ్బులు ఉద్యమం పేరుతో నొక్కేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వివాదం నేపథ్యంలో జేఏసీలో కూడా చీలికలు వచ్చాయి. ఇప్పటికీ అమరావతి ఉద్యమం పేరుతో ఎంత డబ్బు వసూలు చేశారు, ఎంత ఖర్చు పెట్టారన్న విషయాలను బయట పెట్టలేదు. శైలజ కూడా తాము వసూలు చేసిన డబ్బుకు లెక్కలున్నాయని మాత్రమే అంటున్నారు కానీ, ఆ లెక్కలు మాత్రం చెప్పడం లేదు. రాయపాటి కుటుంబం నుంచి డబ్బులు వసూలు, అమరావతి ఉద్యమం పేరుతో డబ్బులు వసూలు చేయడం వాస్తవమే కావడంతో టీడీపీ నాయకులెవ్వరూ వీటిపై స్పందించడానికి ముందుకు రాలేదని తెలుస్తోంది. ఇదేదో కుటుంబ వ్యవహారంగా తక్కువ చేసి చూపే ప్రయత్నం ఎల్లో మీడియా చేస్తోంది. అమరావతి జేఏసీ వసూలు చేసిన డబ్బులు ఏ ఖాతాలకు మళ్లించారో తన వద్ద వివరాలు ఉన్నాయని రాయపాటి రంగారావు చెబుతుండటంతో అమరావతి జేఏసీలో కూడా కలకలం మొదలైంది.

అంగన్‌వాడీలకు జూలైలో వేతనాల పెంపు

మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు జూలైలో వేతనాలు పెంచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంసిద్ధత వ్యక్తం చేశారని, ఇదే విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ ప్రతినిధులకు తెలియజేశామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం సోమలింగాపురంలో మంగళవారం నిర్వహించిన కనుమ సంబరాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి బొత్సను అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి బొత్స మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సంఘ ప్రతినిధులు 11 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారని, అందులో 10 డిమాండ్లను పరిష్కరించేందుకు ఇప్పటికే ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 11వ డిమాండ్‌ను జూలైలో పెంచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇప్పటికైనా సమ్మెను విరమించి సంక్రాంతి సెలవుల అనంతరం విధులకు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రభుత్వం అందరి సంక్షేమంతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమాన్ని కూడా చూసుకునే ప్రయత్నం చేస్తోందని, దీనిని అంగన్‌వాడీ కార్యకర్తలు నమ్మి విధులకు హాజరు కావాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని, మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. బొత్స వెంట ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్వీ రమణరాజు ఉన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మహానేతపై తరగని అభిమానం



పూజలు చేస్తున్న రఘుపతిరాజు కుటుంబ సభ్యులు

బంగారుపాళెం(చిత్తూరు జిల్లా): దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ప్రజాభిమానం తరగలేదు. బంగారుపాళెం మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు వైఎస్సార్ వీరాభిమాని. చనిపోయిన తన తల్లిదండ్రుల చిత్ర పటాలతో పాటు తాను అమితంగా అభిమానించే దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటం ముందు సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త బట్టలు పెట్టి పూజలు నిర్వహించి తన అభిమానాన్ని చాటుకున్నారు. బంధువులు, స్నేహితులను పిలిచి మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాజశేఖర్‌రెడ్డి మృతి చెందినప్పటి నుంచి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహానేత అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎందరో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు.

రెచ్చిపోయిన పచ్చ బ్యాచ్

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి.. ద్విచక్రవాహనం దహనం
- వినుకొండలో ఘటన.. పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు



గాయపడిన ఆసిఫ్

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ పట్టణంలో మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సయ్యద్ ఆసిఫ్ అనే స్థానిక యువకుడు తన మిత్రులతో తిమ్మాయపాలెం రోడ్డులో మాట్లాడుతుండగా నర్సరావుపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు సిద్ధిక్, ఇమ్రాన్, షఫీ తదితరులు 30 మంది వరకు బైకులపై వచ్చి కర్రలతో దాడి చేశారు. ఆసిఫ్ ద్విచక్ర వాహనాన్ని దహనం చేశారు. ఈ దాడిలో యువకుడి తలపై తీవ్రగాయాలయ్యాయి. అతనితో పాటు ఉన్న సహచర మిత్రులకు కూడా గాయాలయ్యాయి. గొడవ అనంతరం మంగళవారం రాత్రి అందరూ కలసి పెద్దమసీదు వద్దకు చేరుకుని చర్చించుకుంటుండగా.. మరోసారి టీడీపీకి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో వచ్చి దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు.



టీడీపీ శ్రేణులు దహనం చేసిన వాహనం

పాత కక్షలతోనే దాడులు

గతేడాది దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిపై సిద్ధిక్ అనే యువకుడితోపాటు అతని అనుచరులు సోషల్ మీడియాలో అవమానకరంగా పోస్టులు పెట్టారు. దీన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రశ్నించడంతో అప్పట్లో గొడవ జరిగింది. ఈ ఘటనపై పోలీసులు పోస్టులు పెట్టిన యువకులపై కేసులు కూడా నమోదు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పండుగరోజు టీడీపీకి చెందిన సిద్ధిక్ తో పాటు అతని అనుచరులు దాడిచేశారు. విషయం తెలుసుకున్న నర్సరావుపేట డీఎస్పీ ఎం.మహేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీకి చెందిన ఒక నాయకుడు ఓ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా అక్కడకు భారీగా అనుచరులు రావడంతో పోలీసు బెటాలియన్ పిలిపించి పరిస్థితిని అదుపు చేశారు.

• తెలంగాణ

తిరుగు ప్రయాణాలతో హైవే రద్దీ

సంక్రాంతికి పల్లెలకు వెళ్లినవారు పట్నంబాట

చౌటుప్పల్: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరుగు ప్రయాణమవడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల రద్దీ ప్రారంభమైంది. హైదరాబాద్ మార్గంలో కార్లు, ఇతర సొంత వాహనాలు పెద్దసంఖ్యలో బారులుదీరాయి. ఈ రద్దీ సాయంత్రం తర్వాత పెరిగే అవకాశాలు ఉన్నాయని భావించిన పోలీసులు ముందస్తుచర్యలు చేపట్టారు. పెట్రోలింగ్ టీంలను అందుబాటులో ఉంచారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్, తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌరస్తా వద్ద ఉన్న జంక్షన్లను తాత్కాలికంగా మూసివేశారు. ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. దీంతో తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంక్షన్ల వద్ద విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సుమారు అరగంటసేపు అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.